www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

బుధవారం | 2-1-2019 | పేజీలు: 14 + 20 | వెల: రూ. 6.50 | సంపుటి: 59 సంచిక: 258 | శ్రీవిళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: ద్వాదశి రా. 2.10 తదుపరి త్రయోదశి; నక్షత్రం: విశాఖ ఉ. 9.40 తదుపరి అనూరాధ; వర్జ్యం: మ. 1.54-3.35; దుర్ముహూర్తం: ఉ. 11.58-12.42; అమృతఘడియలు: రా. 12.03-1.45; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.51; సూర్యాస్తమయం: 5.49 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai

నవ్యాంధ్ర చరితపై సువర్ణ తీర్పు



తాత్కాలిక హైకోర్టును ప్రారంభిస్తున్న జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ ప్రవీణ్ కుమార్, సీఎం చంద్రబాబు

సాకారమయిన 'మన హైకోర్టు' కల

- బెజవాడలోని తాత్కాలిక భవనాల్లో కొలువుతీరిన ఉన్నత న్యాయస్థానం
- యాక్టింగ్ సీజే, 13 మంది జడ్జీలతో ప్రమాణం చేయించిన గవర్నర్
- సీఎం, సుప్రీం జడ్జి రమణ సమక్షంలో ప్రారంభమైన తాత్కాలిక భవనాలు
- విభజన సంపూర్ణం: చంద్రబాబు
- కొత్త చరిత్ర ఆరంభం: సీజే ప్రవీణ్

అమరావతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కాలం మారుతుంది. క్యాలెండర్ తిరుగుతుంది. కొత్త ఏడాదులు వస్తుంటాయి.. పాతబడిపోతుంటాయి. కానీ, ఈ కొత్త సంవత్సరం మాత్రం నవ్యాంధ్ర ప్రదేశ్‌కు వెరీ వెరీ స్పెషల్! 2019.. చరిత్రాత్మకమైన కానుకను మన కోసం తీసుకొచ్చింది. తొలి రోజునే ఆంధ్రులకు చెరిగిపోని స్థానాన్ని.. న్యాయస్థానాన్ని అందించింది. నాలుగున్నరేళ్ల నవ్యాంధ్ర చరితపై సువర్ణాక్షరాలతో కీలక తీర్పును లిఖించింది. గతం తాలూకు గర్వాతిశయాలూ, ఉద్వేగానందాల నడుమ మన హైకోర్టు.. మన రాష్ట్రంలో కొలువుతీరింది. నవ్యాంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం విజయవాడలో మంగళవారం నుంచి తన విధులను ప్రారంభించింది. హైకోర్టు తాత్కాలిక చీఫ్ జస్టిస్

మిగతా 11వ పేజీలో...



గవర్నర్‌తో తాత్కాలిక సీజే ప్రవీణ్ కరచాలనం

ఇదో చారిత్రక ఘట్టం!

- మీ పాదముద్రలు చరిత్రలో నిలుస్తాయి
- 62 సంవత్సరాలకు తీరిన ఆంధ్రా కల
- ఆరంభ ఇబ్బందులను అధిగమించాలి
- పరిమితమైన న్యాయం ప్రజలకు తగదు
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రమణ

11

చంద్రబాబుది ఆక్రోశం

నరేంద్ర మోదీ చర్చకు రా



తెలంగాణలో ఆయన ఆశలు అడియాశలయ్యాయి

- ఆ బాధతో ఏదో మాట్లాడుతున్నారు
- కాంగ్రెస్‌ను వీడిన వారు, ద్వేషించిన వారు మహా కూటమి పేరిట ఒక్కటయ్యారు
- దాని గురించి మాట్లాడటం అనవసరం
- ఈ ఎన్నికలు 'కూటమి వర్సెస్ ప్రజలు' మధ్యే
- ఆకాంక్షలు నెరవేర్చే వారి వెంటే దేశ ప్రజలు
- ఏఎన్ఐ ఇంటర్వ్యూలో మోదీ స్పష్టీకరణ

"చంద్రబాబుకు తెలంగాణపై ఎంతటి ద్వేషభావం ఉందో... తెలంగాణ ఎన్నికల్లో ఎలా ఆయన ఆశలు అడియాశలు అయ్యాయో అందరికీ తెలుసు. ఆ బాధతో ఏదో అంటే నేనేమీ చేయలేను" -నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, జనవరి 1: వచ్చే ఎన్నికలు 'మహా కూటమి వర్సెస్ భారత దేశ ప్రజల' మధ్యే జరుగుతాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రజల ప్రేమ, ఆశీర్వాదానికి తాను ప్రతి రూపమని తెలిపారు. టీడీపీ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబు చొరవతో కాంగ్రెస్‌తో కలిసి ఏర్పాటు చేస్తున్న 'మహా కూటమి'ని తేలిగ్గా తీసుకున్నారు. కాంగ్రెస్, బీజేపీల్లేని 'ఫెడరల్ ఫ్రంట్' పేరిట టీఆర్ఎస్ సారథి, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న ప్రయత్నాల గురించి తనకు అస్సలు తెలియదని వ్యాఖ్యానించారు. మంగళవారం ఏఎన్ఐ ఎడిటర్ స్మితా ప్రకాశ్‌కు ప్రధాని మోదీ ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. 'కేసీఆర్ ఏర్పాటు చేస్తున్న ఫెడరల్ ఫ్రంట్ వెనుక మోదీయే ఉన్నారని చంద్రబాబు ఆరోపిస్తున్నారు కదా!' అని ప్రశ్నించగా... "అలాంటి కూటమి ఏర్పడిందనీ, ఏర్పడుతోందని నాకు తెలియదు. ఆ విషయం నా దృష్టికే రాలేదు" అని బదులిచ్చారు. ఇక... చంద్రబాబు ఆరోపణలు ఆక్రోశంతో చేస్తున్నవే అని తెలిపారు. "ఆయనకు తెలంగాణపై ఏదైతే ద్వేషభావం ఉందో... తెలంగాణ

మిగతా 12వ పేజీలో...

మహాకూటమి.. మహా భయం!

- అదో విఫల ప్రయోగం.. తెలంగాణ ఎన్నికల్లో రుజువైంది
- కేంద్రంలోనూ అదే ఫలితం.. ప్రధానిగా మోదీ కావాలా? వద్దా?
- లోక్‌సభ ఎన్నికల్లో ఇదే రెఫరండం.. కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ

13



ఏఎన్ఐ ఎడిటర్ స్మితా ప్రకాశ్‌కు ఇంటర్వ్యూ ఇస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

నాతోనే జనం నాదే ప్రభంజనం

- ఆకాంక్షలు నెరవేర్చేవారి వెంటే ప్రజలు
- ఎవరేమన్నా రాఫెల్‌పై ముందుకే!
- భారత దేశ భద్రతే నాకు ముఖ్యం
- నోట్ల రద్దు దెబ్బకే నీరవ్, చోక్సీ పరారీ
- రుణమాఫీతో రైతుల కష్టాలు తీరవు: ప్రధాని

13

మీతో దేశానికి ఒరిగిందేంటి?

- వ్యవస్థలన్నిటినీ భ్రష్టుపట్టించారు.. సుప్రీంకోర్టుకూ తప్పుడు సమాచారం
- అవినీతిని ఏం తగ్గించారు?.. దోపిడీదారులు దేశం వదిలిపోతున్నారు
- ప్రధానిపై పది పార్టీల దాడి అబద్ధం.. ఆయనే విపక్షాలపై దాడులు చేయిస్తున్నారు
- ప్రజల ఫోన్లూ ట్యాపింగ్ చేస్తున్నారు.. మీ విధానాలతో 20 ఏళ్లు వెనక్కి
- నాది ఆక్రోశం కాదు.. ప్రాక్టికల్‌గా మాట్లాడుతున్నా
- మోదీ గూటిచిలకే ఫెడరల్ ఫ్రంట్.. అందులో చేరతామని మమత, నవీన్ చెప్పారా?
- టీఆర్ఎస్ గెలిస్తే మీకేల ఆనందం?.. మీరంతా ప్రచారంచేస్తే బీజేపీకి వచ్చింది ఒకటే
- పవన్‌తో మేం కలిస్తే జగన్‌కు బాధేంటి?.. కేసీఆర్‌కు ఏపీలో పనిచేసే ప్రభుత్వం ఉండొద్దు
- మనకు విద్యుత్ బకాయిలు చెల్లించరు.. ఇక్కడ ప్రకటనలు మాత్రం ఇస్తారు: సీఎం

ప్రధానిని సన్నాసి, ఫాసిస్ట్, గాడు అని కేసీఆర్ విమర్శించినా బీజేపీ నేతలు మాట్లాడడం లేదు. దీనినిబట్టే వారి మధ్య లాలూచీ తెలిసిపోతోంది. ప్రజలను అన్ని సార్లూ మోసం చేయలేరు -సీఎం చంద్రబాబు

అమరావతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ వల్ల దేశానికి ఏం లాభం జరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశ్నించారు. ఈడీ, సీబీఐ, ఐటీ, ఆర్‌బీఐ సహా సమస్త వ్యవస్థల్నీ ఆయన భ్రష్టుపట్టించారని ధ్వజమెత్తారు. చివరకు సుప్రీంకోర్టుకు కూడా తప్పుడు సమాచారం ఇస్తున్నారని ఆక్షేపించారు. తాను ఆక్రోశంతో మాట్లాడుతున్నానని మోదీ అనడంపై అభ్యంతరం తెలిపారు. 'నేను ప్రాక్టికల్‌గా మాట్లాడుతున్నాను. ఆయన ఢిల్లీలో కూర్చుని ఏదంటే అది మాట్లాడుతున్నారు. ఈ అంశాలపై ఆయన చర్చకు సిద్ధమా' అని సవాల్ విసిరారు. దేశంలో అవినీతిని మోదీ ఏ మాత్రం తగ్గించారని నిలదీశారు. రాఫెల్ ఒప్పందంలో అవకతవకలపై ఏం చెబుతారని అడిగారు. 'బ్యాంకులను ముంచిన అవినీతిపరులు దేశాన్ని వీడి దర్జాగా

మిగతా 12వ పేజీలో...

చిక్కులున్నా చక్కబెట్టాం!

- ప్రతికూలతలను దాటి ఆర్థికంగా ముందడుగు
- రుణభారం నుంచి రెండంకెల వృద్ధి రేటుకు
- 11.22% వృద్ధిరేటుతో సవాళ్లను అధిగమించాం
- శ్వేతపత్రం విడుదలచేసిన ప్రభుత్వం

12



3.81 లక్షల మంది అమ్మాయిలకు సైకిళ్లు

8-9 తరగతుల వారికి నెలాఖరులోగా పంపిణీ

2

సాక్ష్యాల ధ్వంసంలో కుట్ర?



- కావాలనే అప్పీలు సంగతి దాచారు!
- ఆ విషయం జడ్జికి చెప్పని ఉద్యోగులు
- ఆపై కోర్టు అనుమతితో సాక్ష్యాలు ధ్వంసం
- ఆయేషా కేసులో నిగ్గు తేల్చిన సీబీఐ

12

ఏపీలో ఆర్‌ఓసీ కార్యాలయం ప్రారంభం

పాల్గొన్న దక్షిణ, ఈశాన్య రాష్ట్రాల ప్రాంతీయ ఆర్‌ఓసీ షా

9

అర్హులందరికీ రేషన్, పింఛన్లు

- ఇళ్లకూ దరఖాస్తుల స్వీకరణ
- సంక్షేమం, అభివృద్ధి మరింతగా ప్రజల్లోకి
- భవిష్యత్ కోసం ప్రతి గ్రామానికీ ప్రణాళిక
- నేటి నుంచే ఆరో విడత జన్మభూమి
- 11వ తేదీ వరకు నిర్వహణ
- నేడు కుప్పం వెళ్లనున్న ముఖ్యమంత్రి
- వడ్డిపల్లిలో జన్మభూమికి శ్రీకారం

అమరావతి/చిత్తూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులందరికీ రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్లను మంజూరు చేసే దిశగా జన్మభూమి ప్రణాళికను రూపొందించారు. ఇప్పటికే సుమారు 54 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నారు. దాదాపు 1.4 కోట్ల రేషన్ కార్డులున్నాయి. అయినా ఇంకా అర్హులు కొందరున్నారు. వారికి కూడా లబ్ధి

మిగతా 2వ పేజీలో...

నాటి ముడుపు.. నేడు కుదుపు



- 8 మంది భారత అధికారులకు లంచాలు?
- మళ్లీ తెరపైకి టైటానియం మైనింగ్ స్కాం!
- ఫిర్తాష్‌తో 2007లో వైఎస్ సర్కారు ఎంఓయూ
- కేవీపీ నిందితుడిగా ఉన్న కేసులో తాజాగా బైటపడ్డ నిజాలు
- 2006లో బోయింగ్‌కు పనిచేసిన మెకిన్సే సంస్థ నివేదిక లీక్
- రిపోర్టులో కొంత భాగాన్ని బయటపెట్టిన న్యూయార్క్ టైమ్స్

12

ఎన్టీఆర్ వైద్యసేవలకు బ్రేక్

సోమవారమే మెయిల్స్ ద్వారా ట్రస్ట్‌కు 'ఆశా' సమాచారం

2



పరంజ్యోతి

శుద్ధి-సిద్ధి



సదాశివుడు బోధించిన లక్షా ఇరవై ఐదు వేల రకాల లయయోగాలలో నాదానుసంధాన సమాధియోగమే ఉత్తమమైనది. ప్రాణామాయం వలన సర్వనాడీ శుద్ధి జరిగి, హృదయంలో రకరకాల ధ్వనులతో అనాహత నాదమనే పేరుతో నాదం పుడుతుంది. పరమతత్వం చేరటానికి నాదానుసంధానమే సాధనం. దాని అనుగ్రహముంటే ప్రాణవాయువును, మనసును హృదయంలో లీనం చేయొచ్చు. మూలంలో మూలబంధనం, ఉదరంలో ఓడ్యాణ బంధనం, కంఠంలో జాలంధర బంధనంగా నాడులన్నీ బిగించి, మరణ భయాన్ని దూరం చేసుకోవచ్చు. మూడు బంధాలను సాధిస్తే, మూలాధారంలోనే కుండలినీ శక్తి మేల్కొని, ప్రాణవాయువు సుషుమ్నానాడిలో ప్రవేశిస్తుంది. ప్రాణం నిశ్చలమవుతుంది. బంధత్రయాభ్యాసం వలన ప్రాణవాయువు సుషుమ్నా నాడిని దాటి సహస్రారంలోని చంద్రకళను తాకుతుంది. బంధ యాత్రయాభ్యాసం పూర్ణమై, రేచక, పూరకాలు ఆగుతయ్. మనసులోని విషయవృత్తులు పోగా, కుంభకం మిగులుతుంది. అదే కేవల కుంభక యోగం. మనసు అనాహత చక్రంలో ఏకాగ్రంగా నిలిపితే, శ్వాసతో పాటు మనోసంచారమూ ఆగిపోతుంది. ఇది తిరుగు లేని యోగం. హఠయోగంలో ఎన్ని కుంభక యోగాలున్నా, కేవలకుంభకమే ఉన్నతమైనది. కేవలకుంభకంలో ఉంటూ, మనసును అనాహతం నుండీ అజ్ఞాచక్రం వరకు తెచ్చి, స్తంభింపజేస్తే, ప్రాణవాయువు ఆజ్ఞాచక్రంలో ఉన్న శూన్యంలో లయిస్తుంది. ప్రత్యేక ప్రయత్నం లేకుండానే జరిగే ఈ కేవల కుంభకం.. నాదానుసంధానం కంటే భిన్నమైనది, సహజమైనది. కేవలకుంభకంలో మనసును తత్త్వజ్ఞానమయం చేయాలి. అప్పుడు ఇంద్రియవృత్తులన్నీ శూన్యమై పూర్తిగా వాయులీనం జరుగుతుంది. శుద్ధ జ్ఞాన మూర్తులకే ఇది సాధ్యం. లక్ష్యం, ఏకాగ్రం, మనోస్తంభన, దేశ కాల నియమాలు అక్కరలేని, ప్రాణాయామ, ధారణా, ధ్యానాలు అవసరం లేని ఉత్తమయోగాన్ని రాజయోగంగా పిలుచుకోవాలి. రాజయోగ స్థితిలో కనురెప్పల కదలికలుండవు. ప్రాణవాయువు తీసుకోవడం, వదలడం ఉండదు. మనసుకు సంకల్ప వికల్పాలుండవు. అదే మనోన్మని. అంటే ఉన్నత మనస్సు. ఆ స్థితిలో శ్వాస గమనం, మనోగమనం ఆగిపోయి, శరీరం గాలిలో వెలగే నిశ్చల దీపం అవుతుంది. ప్రపంచాన్ని పట్టించుకోకుండా, మనస్సులో పుట్టే సంకల్పాలను నిర్మూలించగలిగితే, అదే ఉన్మనీ స్థితి. ఉచ్ఛ్వాస నిశ్వాసలు తగ్గి, శరీరం నిటారుగా నిలిచి, కళ్లు అర్ధనిమీలితమైనపుడు ఆ స్థితి అమనస్క ముద్ర అవుతుంది. ఈ ముద్రలో అహంకార మమకారాలు కుప్పకూలుతాయి. భావమూ మనసును దాటి శూన్యంగా ఉండిపోతుంది. ఈ సహజ అమనస్క స్థితిలో ఇంద్రియాలు మరలి, పరమాత్మతో యోగం తరలి వస్తుంది. పూర్వ వాసనలన్నీ నశించి, ప్రపంచం గురించిన ఆలోచనలు వదలిపోగా, జడత్వమూ ఉండదు. ఆ స్థితే యోగనిద్ర. అవస్థాత్రయాన్ని దాటి, తురీయమనే శయ్యపై జ్ఞానమయమైన నిద్రను, వికల్పరహిత స్థితిలో ఎప్పుడూ నిద్రించగల యోగం లభించాలి. ఆత్మవిద్యను అనుభవంలోకి తెచ్చుకోవటానికి కావలసిన దివ్య సాధనం.. యోగశాస్త్రం. ఈ రెండింటినీ అభేద స్థాయిలో అనుష్ఠానం చేసుకోగలిగితే సాధకుడి జన్మ ధన్యం.

- వి.ఎస్.ఆర్.మూర్తి, ఆధ్యాత్మిక శాస్త్రవేత్త



కుప్పం టీడీపీ నేతలు రూపొందించిన అభివృద్ధి స్టిక్కర్

రాష్ట్రవ్యాప్తంగా 'కుప్పం' ప్రణాళిక

- ఇంటింటికీ 'అభివృద్ధి' స్టిక్కర్

కుప్పం, జనవరి 1: 'అభివృద్ధి చేయడమే కాదు.. చేసిన అభివృద్ధిని చెప్పుకోవాలి' అనే ముఖ్యమంత్రి చంద్రబాబు మాటలకు అనుగుణంగా ఈ నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించేందుకు టీడీపీ భారీ ప్రణాళిక రూపొందించింది. చిత్తూరు జిల్లాలోని సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో టీడీపీ నేతలు చేసిన వినూత్న 'అభివృద్ధి స్టిక్కర్' ఆలోచన రాష్ట్ర వ్యాప్తంగా అమలు కానుంది. చేసిన అభివృద్ధి, ప్రతి ఒక్కరికి ఏదో ఒకటి నినాదంతో అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేలా రాష్ట్రంలోని ప్రతి ఇంటి గోడపైనా 'స్టిక్కర్'ను అంటించాలని అధికార పార్టీ నిర్ణయించింది. కుప్పంలోని దళవాయికొత్తపల్లె(డీకేపల్లె) జడ్పీటీసీ రాజ్‌కుమార్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ సత్యేంద్రశేఖర్‌లు చేసిన 'అభివృద్ధి స్టిక్కర్' అనే ప్రాథమిక ఆలోచనకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేశ్ మరింత మెరుగు పెట్టారు. దీనికి ముఖ్యమంత్రి చంద్రబాబు పచ్చజెండా ఊపడంతో ఇక ప్రతి ఇంటి గోడపైనా ఈ స్టిక్కర్ కనిపించనుంది. తొలుత కుప్పం మండలం వడ్డిపల్లె గ్రామంలో నేడు జరగనున్న జన్మభూమి కార్యక్రమంలో ప్రతి ఇంటికీ 'అభివృద్ధి స్టిక్కర్'ను అంటించాలని అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. అభివృద్ధి స్టిక్కర్‌ను పసుపు రంగు బ్యాక్‌గ్రౌండ్‌తో ఆకర్షణీయంగా రూపొందించారు. స్టిక్కర్‌పై.. 'మళ్లీ నువ్వే రావాలి. మా కుటుంబం మొత్తం మాటిస్తున్నాం. సైకిల్ గుర్తుకే మా ఓటు వేస్తాం' అనే నినాదం ఆసక్తిగా ఉంది.

చంద్రబాబు ఆపన్న హస్తం

- కొత్త ఏడాది సీఎంఆర్‌ఎఫ్ ఫైలుపై తొలి సంతకం
- నూర్‌బాషా ఫెడరేషన్‌కు 11.94 కోట్లు విడుదల
- సీఎంకు సీఎస్, డీజీపీ శుభాకాంక్షలు
- బోండా ఉమ పాదాభివందనం..

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): వివిధ వ్యాధులతో బాధపడుతూ మెరుగైన వైద్యానికి సాయం కోసం దరఖాస్తు చేసుకున్న రోగులకు సీఎం చంద్రబాబు ఆపన్నహస్తం అందించారు. నూతన సంవత్సరంలో తొలిరోజైన మంగళవారం ఉదయాన్నే సహాయనిధి(సీఎంఆర్‌ఎఫ్) ఫైలుపై తొలి సంతకం చేశారు. 2018లో వైద్య చికిత్సలకు సాయం కోసం మొత్తం 7,386 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో వైద్య ఖర్చుల రీయింబర్స్‌మెంట్ కేసుల సంఖ్య 6,207. సీఎంఆర్‌ఎఫ్ నుంచి విడుదల చేసిన సొమ్ము రూ.34,50,59,383. అలాగే, ఎల్‌వోసీలకు 1,179 దరఖాస్తులు రాగా, వాటికి రూ.19,13,41,055 విడుదల చేశారు. సీఎంఆర్‌ఎఫ్ ద్వారా 2014 నుంచి ఇప్పటి వరకు రూ.1,249.56 కోట్లు విడుదల చేశానే. అలాగే, నూర్‌బాషా దూదేకుల కోఆపరేటివ్ సొసైటీకి రూ.11.94 కోట్లు విడుదల చేశారు. బీసీ ఫెడరేషన్ ద్వారా ఇస్తున్న నిధులతో 1,896 మందికి రుణసాయం అందించనున్నారు. దీనిపై ఏపీ ముస్లిం దూదేకుల రాజకీయ జేఏసీ అధ్యక్షుడు దస్తగిరి సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మంగళవారం ఉండవల్లిలోని సీఎం నివాసంలో చంద్రబాబును టీటీడీ, దుర్గమ్మ దేవస్థానాల వేదపండితులు ఆశీర్వదించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠ, డీజీపీ ఠాకూర్ సీఎంను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు ఐఏఎస్, ఐపీఎస్ ఉన్నతాధికారులు, టీడీపీ ముఖ్య నాయకులు చౌదరి, ఆర్టీసీ ఛైర్మన్ వర్ల రామయ్య, ఎమ్మెల్సీ టీడీ జనార్ధన్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ ఎన్జీవోల సంఘం అధ్యక్షుడు అశోక్‌బాబు నేతృత్వంలో ఉద్యోగులు సీఎంను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడ నున్న ప్రాంతానికి చెందిన మాసన మానసిక వికలాంగుల ఆశ్రమం నుంచి తనను కలవడానికి వచ్చిన దివ్యాంగులను చూసిన సీఎం అప్యాయంగా పలకరించారు. వారంతా సీఎంకు శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ రెవెన్యూ ఉద్యోగుల సంఘం నేత బొప్పరాజు వెంకటేశ్వర్లు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణకు చెందిన కొందరు నేతలు కూడా సీఎంను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సీఎం నివాసం, హైకోర్టు న్యాయమూర్తుల ప్రమాణస్వీకారం, వారికి విందు, అధికారులతో సమావేశాలు, శ్వేతపత్రం విడుదల, విలేకరుల సమావేశాల్లో పాల్గొంటూనే తన కోసం వచ్చినవారందరినీ సీఎం కలిశారు. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమా సీఎంకు పాదాభివందనం చేశారు. శాప్ మాజీ ఛైర్మన్ పీఆర్ మోహన్ సీఎంకు 1982 నాటి లేఖను చూపించారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో చంద్రబాబు మంత్రిగా ఉండేవారు. టీడీపీలోకి రావాలని, ఎన్టీఆర్ తర్వాత సీఎం అయ్యే సామర్థ్యం మీకే ఉందంటూ చంద్రబాబుకు పీఆర్ మోహన్ లేఖ రాయగా, శుభాకాంక్షలు తెలుపుతూ పీఆర్ మోహన్‌కు చంద్రబాబు తిరిగి లేఖ రాశారు. ఆ ప్రతిని ఆయన మంగళవారం చంద్రబాబుకు చూపించారు.




ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి శుభాకాంక్షలు చెబుతున్న డీజీపీ, ఏపీఎన్జీవో నేతలు

సీఎస్‌కు శుభాకాంక్షల వెల్లువ

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠకు నూతన సంవత్సర శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. కార్మిక శాఖ మంత్రి పితాని సత్యనారాయణ, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు మన్మోహన్‌సింగ్, అనంతరామ్, పూనం మాలకొండయ్య, ముఖ్యకార్యదర్శులు ఎస్ఎస్ రావత్, గోపాలకృష్ణ ద్వివేది, రవిచంద్ర, విజయానంద్, కరికల వలవన్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ సాయిప్రసాద్, కార్యదర్శి రాజశేఖర్, విజిలెన్స్ కమిషనర్ గౌతమ్ సవాంగ్, ఎన్జీవో సంఘం అధ్యక్షుడు అశోక్‌బాబు, సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మురళీకృష్ణ తదితరులు మంగళవారం సీఎస్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కాగా, సచివాలయంలో ఉద్యోగులంతా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకుంటూ సందడి చేశారు.

ఎన్టీఆర్ వైద్యసేవలకు బ్రేక్

- సోమవారమే మెయిల్స్ ద్వారా ట్రస్ట్‌కు 'ఆశా' సమాచారం
- విషయం బయటకు రాకుండా జాగ్రత్తపడ్డ ట్రస్ట్
- మంగళవారం నుంచి సేవలు నిలిపివేసిన ఆస్పత్రులు

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ పరిధిలో నిర్వహిస్తున్న వైద్యసేవలు మొత్తం నిలిచిపోయాయి. ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్(ఆశా) నిర్ణయం మేరకు రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రులు మంగళవారం ఉదయం వైద్యసేవలను నిలిపివేశాయి. ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే ఎన్టీఆర్ వైద్యసేవ పథకం, ఉద్యోగుల హెల్త్ స్కీమ్, జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ సేవలన్నీ నిలిచిపోయాయి. ప్రస్తుతం ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు మాత్రమే వైద్యసేవలు అందిస్తున్నారు. వారితో పాటు ఎమర్జెన్సీ కేసులను మాత్రమే స్పెషాలిటీ హాస్పిటల్స్ యాజమాన్యం అనుమతిస్తోంది. సాధారణ ఓపీలు, ఆపరేషన్లు నిలిచిపోయాయి. దీంతో మంగళవారం ఉదయం నుంచి రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఓపీ చూపించుకుందామని ఆస్పత్రులకు వెళ్లిన వారిలో కొందరు వెనుతిరిగారు, మరికొంత మంది ఓపీకి డబ్బులు కట్టి వైద్యుల వద్దకు వెళ్లారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే సేవలు నిలిపివేస్తామని రెండు నెలలుగా ఆశా ప్రతినిధులు హెచ్చరిస్తున్నారు. నవంబరు 8వ తేదీన ట్రస్ట్‌కు సమ్మె నోటీసులు అందించారు. అనంతరం ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, మంత్రి ఫరూక్ వారితో చర్చలు జరిపారు. వారం రోజుల్లో మొత్తం సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చినా... ఒక్క సమస్య కూడా పరిష్కారం కాకపోవడంతో మంగళవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు వైద్యసేవలను నిలిపివేశాయి. వాస్తవంగా సోమవారం సాయంత్రమే ఆశా ప్రతినిధులు మెయిల్స్ ద్వారా ట్రస్ట్‌కు ఈ సమాచారం అందించారు. కానీ ట్రస్ట్ ఈ విషయం బయటకు రాకుండా జాగ్రత్తగా వ్యవహరించింది.

ట్రస్ట్‌లోనే సమస్య!

ప్రస్తుతం ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్‌లో పాలన అస్తవ్యస్తంగా ఉంది. ముఖ్యంగా నిధుల కొరత... సిబ్బంది లేమితో ట్రస్ట్ తీవ్ర ఇబ్బందుల్లో ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న సిబ్బందిని రెండు రాష్ట్రాలకూ విభజించారు. ట్రస్ట్ ఏపీకి వచ్చిన తర్వాత కొత్త సిబ్బందిని నియమించుకోలేదు. దీంతో ప్రస్తుతం ట్రస్ట్‌ను ఉద్యోగుల కొరత తీవ్రంగా ఉంది. నెట్‌వర్క్ ఆస్పత్రుల నుంచి రోజూ ట్రస్ట్‌కు ఐదువేల వరకూ క్లెయిమ్స్ వస్తున్నాయి. కానీ ప్రస్తుతం గరిష్ఠంగా 2000 క్లెయిమ్స్‌ను చూడగలిగే సిబ్బందే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో రోజువారి క్లెయిమ్స్‌లో సగానికిపైగా పెండింగ్‌లో ఉంటున్నాయి. ప్రస్తుతం ట్రస్ట్ వద్ద సుమారు 80వేల క్లెయిమ్స్ పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. వీటి విలువ సుమారు రూ.400 కోట్లుగా అంచనా.

పథకాల అమలుపై గందరగోళం

ట్రస్ట్ ద్వారా అమలు చేయాలని ఏ పథకం ప్రారంభించినా ఉపయోగం లేకుండా పోతోంది. 2017 జనవరిలో సీఎం చంద్రబాబు చేతుల మీదగా ప్రారంభించిన 'ఆరోగ్య రక్ష' అట్టర్‌ప్లాప్ అయింది. మొదటి ఏడాదిలోనే గందరగోళంగా మారింది. ఆరోగ్యశాఖ పెట్టిన లక్ష్యాన్ని చేరుకోలేక, ప్రజలకు సరైన సమాచారం ఇవ్వకపోవడం వల్ల ఆశించిన స్థాయిలో పథకం విజయవంతం కాలేదు. మూడు రోజుల క్రితం సీఎం చేతుల మీదగా ప్రారంభించిన 'తల్లి సురక్ష' పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పేద గర్భిణులకు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో ప్రసవం అనే విధానం దేశంలో ఎక్కడా లేదు. దీన్ని అమలు చేస్తే అద్భుతంగా ఉంటుంది. కానీ, ఇప్పటికే 80వేల క్లెయిమ్స్ పెండింగ్ ఉన్న ట్రస్ట్‌కు ఇదొక అదనపు భారంగా మారనుంది. ఆస్పత్రులకు బిల్లులు చెల్లించే విషయంలో కూడా ఆలస్యం అవుతోంది. దీనిపై దృష్టి సారించకుండానే ప్రారంభించారు.

ఆశా డిమాండ్లు

1. పెండింగ్ బకాయిలను వెంటనే ఆస్పత్రులకు విడుదల చేయాలి.
2. క్లెయిమ్స్ సమర్పించిన వెంటనే 70శాతం బిల్లులు ట్రస్ట్ చెల్లించే విధంగా జీవో విడుదల చేయాలి.
3. ఎన్టీఆర్ వైద్యసేవ ప్యాకేజీలను వెంటనే పెంచాలి.
4. ఉద్యోగుల హెల్త్‌కార్డు టారిఫ్‌ను 'ఆరోగ్యరక్ష'కు అమలు చేయాలి.
5. ఎమర్జెన్సీ కేర్‌కు సంబంధించి ప్రత్యేక టారిఫ్‌ను రూపొందించాలి.
6. 'తల్లి సురక్ష' పథకం అమలు విషయంలో స్పష్టత ఇవ్వాలి.
7. క్వాలిటీ ఇన్‌సెంటివ్స్‌ను ప్రారంభ దశ నుంచి పెంచాలి.
8. హేతుబద్ధత లేకుండా బిల్లులు కట్ చేయవద్దు.

రూ. 100 కోట్లపైనే తాగేశారు!

- డిసెంబరు 31 మద్యం అమ్మకాల అంచనా
- మూడురోజుల్లో రూ.289 కోట్ల మద్యం దిగుమతి
- బీరు బాట పట్టిన యువత

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మామూలు రోజుల్లోనే మద్యం విక్రయాలకు హద్దులుండవు! అలాంటిది.. నూతన సంవత్సరం ఆగమన వేళ.. ఆగుతుందా?!.. ఎక్సైజ్ శాఖ అంచనాల ప్రకారమే.. డిసెంబరు 31న రాష్ట్రంలో సుమారు రూ.100కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. గత మూడు రోజుల్లో మద్యం వ్యాపారులు చేసుకున్న దిగుమతులే ఇందుకు నిదర్శమని ఆ శాఖ చెబుతోంది. రాష్ట్రంలో రోజుకు సగటున మద్యం అమ్మకాలు రూ.50కోట్లు. కానీ కొత్త సంవత్సరం వేళ వ్యాపారులు ముందుగానే భారీగా మద్యం నిల్వలు దిగుమతి చేసుకున్నారు. డిసెంబరు 29న రూ.103కోట్లు, 30న రూ.67కోట్లు, 31న రూ.118 కోట్లు.. వెరసి రూ.289కోట్ల విలువైన మద్యాన్ని వ్యాపారులు ఎక్సైజ్ నుంచి తీసుకున్నారు. అందులో డిసెంబరు 31 ఒక్కరోజే రూ.100కోట్లకు పైగా విక్రయించినట్లు అధికారులు భావిస్తున్నారు. మరోవైపు బీర్ల అమ్మకాలు భారీగా పెరిగాయి. మూడు రోజుల్లో 4,87,888 కేసుల లిక్కర్‌తోపాటు 3,62,147 కేసుల బీరును వ్యాపారులు దిగుమతి చేసుకున్నారు. సాధారణ సమయాల్లో లిక్కర్‌తో పోలిస్తే బీరు అమ్మకం చాలా తక్కువగా ఉంటుంది. కానీ నూతన సంవత్సరం సందర్భంగా యువత ఎక్కువగా బీర్లు కొనుగోలు చేశారు. ఇక, ఖరీదైన బ్రాండ్లు బాగా అమ్ముడయ్యాయని వ్యాపారులు తెలిపారు.



3.81 లక్షల మంది అమ్మాయిలకు సైకిళ్లు

- 8-9 తరగతుల వారికి 31 కల్లా పంపిణీ

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం 8-9 తరగతులు చదువుతున్న 3,81,142 మంది అమ్మాయిలకు 'బడికొస్తా' కార్యక్రమం కింద ఉచిత సైకిళ్ల పంపిణీకి రంగం సిద్ధమైంది. అమ్మాయిల్లో డ్రాపవుట్లు లేకుండా ఉండేందుకు ఈ కార్యక్రమాన్ని తలపెట్టిన సంగతి తెలిసిందే. ఈ నెల 31లోగా అన్ని స్కూళ్లకు సైకిళ్ల పంపిణీ చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్దేశిత పంపిణీ ఏజెన్సీలకు ఆదేశాలిచ్చింది. ఒక్కొక్కటీ రూ.3,965 ఖరీదైన ఈ సైకిళ్లను.. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, మోడల్ స్కూళ్లు, ఎయిడెడ్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థినులందరికీ అందజేయనున్నారు.

'జన్మభూమి'కి నోడల్ అధికారులు

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం నుంచి ప్రారంభంకానున్న 'జన్మభూమి-మా ఊరు' కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో, విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ క్రమంలో ప్రతి రెవెన్యూ డివిజన్‌కు ఒక నోడల్ అధికారిని నియమించింది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పాటు జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రభుత్వం మరో రూ.9.75 కోట్లు విడుదల చేసింది. కాగా, 'జన్మభూమి-మా ఊరు'లో సాంస్కృతిక కార్యక్రమాలపై పోటీలు నిర్వహిస్తారు.

'ఉపాధి' సమ్మె లేదు!

రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం నుంచి సమ్మె చేయతలపెట్టిన ఉపాధి సిబ్బంది ఆ నిర్ణయాన్ని విరమించుకున్నట్లు ఉపాధి ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ రామచంద్రయ్య తెలిపారు. పంచాయతీరాజ్ డైరెక్టర్ రంజిత్‌బాషాతో మంగళవారం జేఏసీ నేతలు జరిపిన చర్చలు సఫలమయ్యాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఉపాధి సిబ్బంది యథావిధిగా విధులకు హాజరవుతారన్నారు.

జాలర్లను విడిపించాలని చంద్రబాబు లేఖ

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ చెరలో బందీగా ఉన్న ఏపీ మత్స్యకారుల విడుదల కోసం సీఎం చంద్రబాబు తాజాగా కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. ఆయన ఇప్పటికే హోంమంత్రి రాజ్‌నాథ్, విదేశాంగ మంత్రి సుష్మాల దృష్టికి తీసుకెళ్లారు.

అర్హులందరికీ రేషన్, పింఛన్లు

(మొదటి పేజీ తరువాయి)

చేకూర్చడానికి జన్మభూమిని వేదిక చేసుకోనున్నారు. ఇదే సమయంలో రాష్ట్రంలో ఇళ్లను ఇప్పటికే పెద్దఎత్తున మంజూరు చేసినా.. ఇంకా అవసరమైన అర్హులు 10 లక్షల మంది వరకు ఉంటారని అంచనా. వారందరికీ ఇళ్లను మంజూరుచేసేలా చర్యలు తీసుకోనున్నారు. బుధవారం నుంచి 11వ తేదీవరకు జరిగే జన్మభూమి 10 రోజుల కార్యక్రమంలో అర్హుల నుంచి రేషన్, ఫించను, ఇళ్లకు దరఖాస్తులు తీసుకుంటారు. వాటిని పండుగ అనంతరం పరిశీలించి మంజూరు చేస్తారు. మరోవైపు నాలుగున్నరేళ్లలో చేసిన సంక్షేమం, అభివృద్ధిని చెప్పడంతో పాటు.. గ్రామాలకు భవిష్యత్ ప్రణాళికలను కూడా ఖరారుచేసే దిశగా జన్మభూమి-మా ఊరు గ్రామసభలు జరగనున్నాయి. ఆ తర్వాత మండల, జిల్లాల స్థాయుల ప్రణాళికలనూ సిద్ధం చేసి అమల్లోపెడతారు. ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం తన నియోజకవర్గం కుప్పం వెళ్తున్నారు. అక్కడ వడ్డిపల్లి గ్రామంలో జన్మభూమికి లాంచనంగా శ్రీకారం చుడతారు. కాగా.. ఇప్పటికే రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిన 10 శ్వేతపత్రాలపైనా గ్రామసభల్లో చర్చిస్తారు. బుధవారం విభజన నాటి పరిస్థితి, భవిష్యత్ అంశాలు, వయాడక్ట్‌పై చర్చ ఉంటుంది. తర్వాతి రోజుల్లో వివిధ అంశాలపై చర్చ జరుగుతుంది.

చిత్తూరు జిల్లాలో సీఎం 2 రోజుల పర్యటన

తన నియోజకవర్గంలోని వడ్డిపల్లిలో జన్మభూమిని ప్రారంభించనున్న సీఎం.. చిత్తూరు జిల్లాలో రెండ్రోజులు పర్యటించనున్నారు. బుధ, గురువారాల్లో కుప్పం నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు.

పీడీ, పీఈటీ అభ్యర్థులకు 4 నుంచి ఫిజికల్ టెస్టులు

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2018 స్కూల్ అసిస్టెంట్- వ్యాయామ (పీడీ), పీఈటీ అభ్యర్థులకు ఈ నెల 4 నుంచి 13 వరకు ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్టులు నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యా కమిషనర్ కె.సంధ్యారాణి తెలిపారు. రోజుకు 1400 మంది అభ్యర్థులకు చొప్పున రెండు సెషన్లలో ఈ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. డీఎస్సీకి దరఖాస్తు చేసుకున్న 337 పీడీ అభ్యర్థుల్లో 285 మంది, 13,839 మంది పీఈటీ అభ్యర్థుల్లో 12,551 మంది ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. మరో 52 మంది పీడీ అభ్యర్థులు, 1288 మంది పీఈటీ అభ్యర్థులు ఆప్షన్లు నమోదు చేసుకోలేదన్నారు. వీరికి ఉమ్మడిగా 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్‌తోపాటు, షాట్‌పుట్ తప్పనిసరిగా ఉంటుందని ఆమె వివరించారు. చివరి రోజు భౌతిక పరీక్షలు నిర్వహిస్తామన్నారు. హాల్‌టికెట్లు, ఇతర విధివిధానాలకు సంబంధించి సీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్. వెబ్‌సైటును సందర్శించాలని పేర్కొన్నారు. ఫలితాలు అదే రోజు విడుదల చేస్తామన్నారు.

డిగ్రీ లెక్చరర్లకు అంతర్రాష్ట్ర బదిలీ

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలలో పనిచేస్తున్న 38 మంది అధ్యాపకులు/ లైబ్రేరియన్ల అంతర్ రాష్ట్ర బదిలీకి ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ నుంచి తెలంగాణకు, తెలంగాణ నుంచి ఏపీకి వారు పరస్పరం (మ్యూచ్‌వల్) బదిలీ కానున్నారు.

లోకం తీరు



చలికాలం

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
హైదరాబాద్	9.3	28.8
విశాఖపట్నం	12.0	27.0
కడప	12.0	32.0
గుంటూరు	12.2	28.6
విజయవాడ	13.6	28.5
చిత్తూరు	14.8	28.5
ఒంగోలు	17.5	31.3

కొనసాగుతున్న చలి గాలులు


విశాఖపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తీవ్రమైన చలి గాలులు వీస్తున్నాయి. దీనికి తోడు మంచు దట్టంగా కురుస్తోంది. వీటి ప్రభావంతో పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదవుతున్నాయి. ప్రధానంగా రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే నాలుగు నుంచి ఆరు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. మంగళవారం విశాఖ ఏజెన్సీలోని చింతపల్లిలో 2.5, జంఘమహేశ్వరపురంలో 10 డిగ్రీలు నమోదయ్యాయి. రానున్న రెండు రోజులు వరకు శ్రీకాకుళం నుంచి గుంటూరు వరకు చలి గాలుల ప్రభావం ఎక్కువగా వుంటుందని వాతావరణ శాఖ తెలిపింది. ఈనెల ఐదవ తేదీన అండమాన్ పరిసరాల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని పేర్కొంది. అయితే దాని ప్రభావం కోస్తాపై వుండకపోవచ్చని అంచనా వేస్తున్నారు.



కాంగ్రెస్ ఆలోచనలు ఇటలీ మహిళ కోసమే..!

కాంగ్రెస్ ఆలోచనలు ఇటలీ మహిళ కోసమే... హిందూ, ముస్లిం మహిళల అవసరాలు వారికి పట్టవు. ట్రిపుల్ తలాక్ బిల్లు సెలక్ట్ కమిటీకి ఎందుకు పంపించాలి? ఇప్పటికే దీనిపై సభల్లో వాదనలు చాలు.. యావత్ దేశమంతా దీనిపై వాదనలు చేస్తోంది.

- బీజేపీ నేత సుబ్రహ్మణ్యస్వామి



ముందు నా కులం.. తర్వాతే సమాజం

నేను మీకు హామీ ఇస్తున్నా. మిమ్మల్ని విడిచిపెట్టను. నా కులస్థుల అభివృద్ధికి పాటుపడ్డమే నా ప్రథమ కర్తవ్యం. విశాలమైన సమాజ హితం కోసం పనిచేయడమనేది తర్వాతి అంశం.. నేను ప్రతి ఒక్కరి కోసం పనిచేస్తాను.

- రాజస్థాన్ శిశు సంక్షేమశాఖ మంత్రి మమతా భూపేష్

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్ (విజయవాడలో)		డీజిల్	
పాత ధర	రూ. 72.31	పాత ధర	రూ. 67.29
కొత్త ధర	రూ. 72.13	కొత్త ధర	రూ. 67.09
తగ్గుదల 18 పైసలు		తగ్గుదల 20 పైసలు	

బోలు ఎముకల వ్యాధి జన్యుపటం ఆవిష్కరణ

టొరంటో, జనవరి 1: వృద్ధాప్యంలో శరీరం పట్టు కోల్పోతుంది. ఎముకలు బలంగా ఉండవు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా విరిగిపోతాయి. వైద్య పరిభాషలో దీనిని బోలు ఎముకల వ్యాధి లేదా ఎముకలు గుల్లబారడం అంటారు. ఈ వ్యాధికి కారణమయ్యే జన్యుపటాన్ని పరిశోధకులు ఆవిష్కరించారు. ఎముకల్లో ఖనిజ సాంద్రత(బీఎండీ)తో ఈ వ్యాధి ముడిపడి ఉంటుంది. తాజా పరిశోధనలో దాదాపు 518 జన్యు వైవిధ్యం ఉన్న ప్రాంతాలను గుర్తిస్తే అందులో 301 వరకూ కొత్తగా కనుగొన్నవే. ఈ అధ్యయనానికి సంబంధించిన వివరాలను నేచర్ జెనటిక్స్ అనే జర్నల్‌లో ప్రచురించారు. ఈ జన్యుపటం ఆధారంగా కొత్త ఔషధాల తయారీకి బాట పడుతుందని వారు ఆశిస్తున్నారు.

శ్రీవారి సేవలో 90వేల మంది భక్తులు



వేకువజామున 2.50 గంటలకే సర్వదర్శనం ప్రారంభం



శ్రీవారి ఆలయం వెలుపల బోనీకపూర్, జాన్వీ, కేఈ దంపతులు



తిరుమల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆంగ్ల నూతన సంవత్సరాది సందర్భంగా మంగళవారం దాదాపు 90 వేల మంది భక్తులు తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్నారు. అర్ధరాత్రి 12 గంటలకు ఆలయం తెరిచి ధనుర్మాస కైంకర్యాలు మొదలుపెట్టారు. 1.30 గంటలకు వీఐపీ దర్శనం ప్రారంభించారు. వీఐపీల తాకిడి పెద్దగా లేకపోవటంతో 2.50 గంటలకే సర్వదర్శనం భక్తులను అనుమతించారు. ఇతర ప్రత్యేక దర్శనాలు లేకపోవటంతో భక్తులు కేవలం మూడు నుంచి నాలుగు గంటలల్లోనే శ్రీవారిని దర్శించుకుని సంతృప్తి వ్యక్తంచేశారు. ఉదయం 11 గంటల వరకు క్యూలైన్లలో రద్దీ ఒకమోస్తరుగా కనిపించినా ఆ తర్వాత భక్తుల్లేక తిరుమల కొండ బోసిపోయింది. నూతన ఏడాది ప్రారంభం సందర్భంగా దివంగత సినీనటి శ్రీదేవి భర్త బోనీ కపూర్, కుమార్తెలు జాన్వీకపూర్, ఖుషికపూర్, నటి మహేశ్వరి మంగళవారం తిరుమలేశుని దర్శించుకున్నారు. ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి వేకువజామున కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు.

తల్లిదండ్రుల చెంతకు వీరేష్

తిరుమలలో బాలుని కిడ్నాప్ కథ సుఖాంతం



వీరేష్‌ను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న తిరుపతి అర్బన్ ఎస్పీ

తిరుపతి (నేరవిభాగం), జనవరి 1: తిరుమలలో ఐదు రోజుల క్రితం కిడ్నాపైన చిన్నారి వీరేష్ ఎట్టకేలకు తల్లి ఒడికి చేరాడు. మంగళవారం ఉదయం తిరుపతి అర్బన్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అన్బురాజన్ చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించారు. కిడ్నాపైన బిడ్డ తిరిగి తమ చేతుల్లోకి క్షేమంగా రావడంతో వారి ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. మహారాష్ట్రకు చెందిన ప్రశాంత్‌జీ, స్నేహ శ్రీవారి దర్శనానికి వచ్చి గురువారం రాత్రి గదులు దొరకకపోవడంతో బిడ్డతో సహా మాధవనిలయం ఎదురుగా గల మండపంలో పడుకోగా చిన్నారి వీరేష్ కిడ్నాప్ అయిన సంగతి తెలిసిందే. మీడియా, సోషల్‌మీడియాలో ఈ విషయం విస్తృతంగా ప్రచారం కావడంతో మహారాష్ట్రకు చెందిన ఓ పోలీస్ కానిస్టేబుల్ ఆదివారం మహోర్‌లోని రేణుకమ్మ దేవాలయం వద్ద చిన్నారితో ఉన్న కిడ్నాపర్‌ను గుర్తించి అదుపులోకి తీసుకున్నాడు. తిరుపతి అర్బన్‌పోలీసుల బృందం మహోర్ వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకుని చిన్నారితో సహా మంగళవారం తిరుపతి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ అన్బురాజన్ మాట్లాడుతూ... నిందితుడు విశ్వంభర్ (43) తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్ జిల్లా గుండారం గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడని తెలిపారు. విశ్వంభర్‌కు పిల్లలు లేనందున వృద్ధాప్యంలో తనను చూసుకుంటాడనే ఉద్దేశంతోనే బాలుడిని కిడ్నాప్ చేసినట్టు తమ ప్రాథమిక విచారణలో తెలిసిందని చెప్పారు. మీడియా, సోషల్ మీడియావల్లనే కిడ్నాపర్ ఆచూకీ కేవలం రెండు రోజుల్లోనే తెలుసుకోగలిగామన్నారు. తిరుమలకు చిన్నారులతో వచ్చే తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మళ్లీ ఇటువంటి ఘటనలు జరుగకుండా కొండకు వెళ్లే చిన్నారులకు ట్యాగ్‌లు వేస్తామని, కొండదిగేటప్పుడు పిల్లలకు పోలీసులు జారీచేసే ఐడీ కార్డు చూపించేలా ఏర్పాట్లు చేస్తామని వివరించారు.

రాష్ట్రంలో మరో 3 పట్టణాభివృద్ధి సంస్థలు

కడప, ఒంగోలు, ఏలూరు కేంద్రాలుగా ఏర్పాటు

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో మూడు పట్టణాభివృద్ధి సంస్థల (ఉడా)ను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ మెట్రోపాలిటన్ రీజియన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీస్ యాక్ట్, 2016 మేరకు.. కడప, ఒంగోలు, ఏలూరు కేంద్రాలుగా వీటిని ఏర్పాటు చేసింది. వీటికి అధ్యక్షులను రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుందని, ఉపాధ్యక్షులుగా వ్యవహరించబోయే ప్రభుత్వ అధికారి మెంబర్ కన్వీనర్‌గా ఉంటారని పేర్కొంది. సభ్యులుగా పురపాలక- పట్టణాభివృద్ధి శాఖ ఓఎస్డీ లేదా జాయింట్ లేదా డిప్యూటీ సెక్రటరీ, ఆర్థిక శాఖ జాయింట్ లేదా డిప్యూటీ సెక్రటరీ, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన నలుగురు అధికారులతో పాటు.. ఆయా జిల్లా కలెక్టర్లు, డీటీసీపీ లేదా ఆయన నియమించే నామినీ, పట్టణాభివృద్ధి వ్యవహారాల్లో ముగ్గురు నిపుణులు వ్యవహరిస్తారని జీవోలో పేర్కొన్నారు. కడప కేంద్రంగా అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎ.యు.డి.ఎ.), ప్రకాశం జిల్లా ఒంగోలు కేంద్రంగా ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఒ.యు.డి.ఎ.) పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు కేంద్రంగా ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఇ.యు.డి.ఎ.) పనిచేయనున్నాయి.

సీపీఎస్‌ను రద్దు చేస్తాం

కిడ్నీ రోగులకు రూ.10వేల పెన్షన్

వైఎస్ జగన్ పునరుద్ఘాటన



ఒంకులూరు వద్ద కొత్త సంవత్సర కేక్ కట్‌చేస్తున్న జగన్

హరిపురం, జనవరి 1: ప్రజాసంకల్పయాత్రలో భాగంగా వైసీపీ అధినేత జగన్ చేస్తున్న పాదయాత్ర మంగళవారం శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గంలోని వజ్రపుకొత్తూరు, మందస మండలాల్లో సాగింది. వజ్రపుకొత్తూరు మండలం ఒంకులూరు వద్ద జగన్ నూతన సంవత్సర వేడుకలు జరుపుకొన్నారు. అనంతరం పాదయాత్ర ప్రారంభించారు. బహాడపల్లి, ఎన్. బొడ్లూరు, జగన్నాథపురం, గుజ్జులూరు మీదగా నారాయణపురం వరకూ మంగళవారం పాదయాత్ర సాగింది. దారిపొడవునా ప్రజలకు అభివాదం చేస్తూ జగన్ ముందుకుసాగారు. ఆయా వర్గాల ప్రజలు తమ సమస్యలను ఈ సందర్భంగా జగన్ దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై జగన్ స్పందిస్తూ... తమ ప్రభుత్వం వస్తే సీపీఎస్ రద్దు చేస్తామని పునరుద్ఘాటించారు. కిడ్నీవ్యాధిగ్రస్థులకు రూ.10వేల పింఛను, డయాలసిస్ కేంద్రాల ఏర్పాటు, రిసెర్చ్ సెంటర్ నిర్మాణాలను చేపడతామని హామీ ఇచ్చారు. తితలీ తుఫానులో నష్టపోయిన కొబ్బరి చెట్టుకు రూ.3వేలు, ఎకరా జీడి మామిడి తోటలకు రూ.50వేలు అందజేస్తామని హామీ ఇచ్చారు.



వైసీపీ ఫ్లెక్సీలో కేసీఆర్

నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ వైసీపీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో తెలంగాణ సీఎం కేసీఆర్ ఫొటో చర్చనీయాశమైంది. ఓ వైపు శ్రీశైలం నియోజకవర్గ ఇన్‌చార్జి శిల్పా చక్రపాణిరెడ్డి. మరోవైపు కేసీఆర్, మధ్యలో వైఎస్ జగన్ ఫొటోలతో ఉన్న ఫ్లెక్సీని కర్నూలు జిల్లా నంద్యాల-బండి ఆత్మకూరు రహదారిలో సంతజూటూరు వద్ద ఏర్పాటు చేయగా.. అటువైపు వెళ్తున్న వారు ఆసక్తిగా గమనిస్తున్నారు.

–బండి ఆత్మకూరు





శారదా పీఠంలో మురళీమోహన్, రాజేంద్రప్రసాద్

పెందుర్తి, జనవరి 1: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతిని మంగళవారం సీబీఐ కోర్టు జడ్జి జస్టిస్ పాపిరెడ్డి దంపతులు, రాజమండ్రి ఎంపీ మురళీమోహన్, సినీనటుడు రాజేంద్రప్రసాద్ వేర్వేరుగా దర్శించుకున్నారు. పీఠం అధిష్ఠాన దేవత శారదా మాతకు పూజలు నిర్వహించిన అనంతరం పీఠాధిపతి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో ఉత్తర పీఠాధిపతి బాలాస్వామి, ట్రస్టీ శ్రీనివాస్, శరత్ పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

ఉద్యోగాల కోసం ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు

ఆర్జీయూకేటీ ఇన్‌చార్జి డైరెక్టర్

వేంపల్లె, జనవరి 1: ఒంగోలు ట్రిపుల్‌ఐటీలో కాంట్రాక్టు పద్ధతిన అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది నియామకాల కోసం ఎలాంటి ఏజెన్సీకి గాని, వ్యక్తులకు గాని అనుమతులు ఇవ్వలేదని ఆర్జీయూకేటీ ఇన్‌చార్జి డైరెక్టర్ నరసింహరాజు తెలిపారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, ఎవరైనా అలాంటి ప్రలోభాలకు గురిచేస్తే తమకు ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు. కడప జిల్లా వేంపల్లె మండలం ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఉన్న ఒంగోలు ట్రిపుల్ ఐటీ కార్యాలయంలో నరసింహరాజు మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. కొద్ది రోజుల క్రితం ఒంగోలు ట్రిపుల్ ఐటీలో ల్యాబ్ అసిస్టెంట్ ఉద్యోగానికి నకిలీ అపాయింట్‌మెంట్‌తో ఓ వ్యక్తి రావడంతో ఈ విషయం తమకు తెలిసిందని తెలిపారు. దీనిపై ఇప్పటికే ఒంగోలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ట్రిపుల్ ఐటీలో ఉద్యోగ నియామకాలకు సంబంధించి ఎలాంటి పుకార్లు నమ్మవద్దని, ప్రస్తుతానికి ఎలాంటి నియామకాలు జరపడం లేదని ఆయన స్పష్టంచేశారు. దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని నిరుద్యోగులకు విజ్ఞప్తిచేశారు.

ఆస్ట్రేలియా అబ్బాయి.. దక్షిణాఫ్రికా అమ్మాయి

సున్నింపెంటలో ఒక్కటైన జంట



శ్రీశైలం, జనవరి 1: ఆస్ట్రేలియా అబ్బాయి, దక్షిణాఫ్రికా అమ్మాయి శ్రీశైలం మండలం సున్నిపెంటలోని న్యూ యేరుషలేము ప్రార్థనా మందిరంలో ఒక్కటయ్యారు. ఆస్ట్రేలియాకు చెందిన అండ్రూస్ స్టీఫన్స్, దక్షిణాఫ్రికాకు చెందిన జోనాస్ తెలంగాణ రాష్ట్రం దోమలపెంట వద్ద కృష్ణాజలాలను నల్లగొండ ఫ్లోరైడ్ బాధితులకు అందించే సొరంగం పనులు చేపడుతున్న జయప్రకాష్ కంపెనీలో ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. వివాహం చేసుకోవాలనుకున్న వీరు మంగళవారం ఇరువైపు పెద్దలతో రాగా.. సంఘం పాస్టర్ జి.జోసఫ్ క్రిస్టియన్ సంప్రదాయంలో వివాహం జరిపించారు. భారతదేశంలోని క్రిస్టియన్ సంప్రదాయం అంటే తమకు ఎంతో గౌరవం, ఇష్టమని నూతన దంపతులు తెలిపినట్టు పాస్టర్ వివరించారు.

వెండితెరపై సామాజిక వ్యాఖ్యాత

ప్రపంచ సినిమా యవనికపై భారతీయులందరినీ తలెత్తుకొనేలా చేసిన బెంగాలీ దిగ్దర్శక మూర్తి త్రయంలో మూడోరూపం కనుమరుగైపోయింది. సత్యజిత్ రే, రిత్విక్ ఘటక్ తరువాత భారతీయ సినిమా ఖ్యాతిని అంతర్జాతీయంగా విస్తరింపజేసిన బెంగాలీ సినీస్వర్ణయుగపు చివరి దర్శకుడు మృణాల్‌సేన్ ఆదివారం కన్నుమూశారు. జీవితంలోనూ, సినిమాలోనూ, జీవనంకోసం వ్యవస్థతోనూ చివరి వరకూ రాజీపడని అతి కొద్దిమంది దర్శకులలో ఒకరు మృణాల్‌సేన్. భద్రలోక జీవిత ప్రతిబింబమైన సినిమాలకు భిన్నంగా సామాజిక అంతరాల్ని చూపెడుతూ, చిత్రమైన కెమెరా కదలికలు, ఎడిటింగ్ విధానాలతో బెంగాలీ సినిమాకు కొత్త రూపురేఖలు దిద్దిన ఘనత ఆయనది. మధ్యతరగతి జీవితం నుంచి మార్క్సిస్టు సిద్ధాంతాల అంతర్లీన చిత్రీకరణ దాకా సామాన్యుడి ఆవేదనకూ, సామాజిక వాస్తవాలపై ఆలోచనాత్మక ఆక్రోశానికీ ఆయన సినిమాలు ప్రతిరూపాలు. ఎనిమిది పదుల వయసులోనూ 'ఆమార్ భుబొన్' (2002) లాంటి అందమైన సినిమా అందించిన క్రియాయోగి. గ్యాబ్రియల్ గార్షియా మార్క్వెజ్, గ్రెగరీ పెక్ లాంటి ప్రముఖుల సరసన అంతర్జాతీయ సినిమా జ్యూరీల్లో పనిచేసే అరుదైన అవకాశం అందుకున్న వ్యక్తి.

అజ్ఞాత స్వాతంత్ర్య విప్లవ వీరులకు ఆశ్రయం కల్పించడానికే సంపాదనంతా వెచ్చించిన వకీలు గారి పన్నెండుమంది సంతానంలో మృణాల్ ఒకరు. పెరిగిన వాతావరణం, కలిగిన కమ్యూనిస్టు పార్టీ సాంగత్యం, తిరిగిన ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా) అనుభవం, జరిగిన 1946 ఆగస్టు నాటి బెంగాల్ అల్లర్లు... ఇలా ఆయనను దర్శకుడిగా మలిచిన ఉలులెన్నో! ఇరవయ్యేళ్ళ వయసులో చూసిన బెంగాల్ కరవు, యాభై లక్షల మంది ఆకలి కేకలు, కళ్ళెదుటే ఆకలి చావులు యువ మృణాల్‌ను జీవితాంతం వెంటాడాయి. ఆ ప్రభావం ఆయన మూడో చిత్రం 'బైషే శ్రావణ్' (1960)లో అధికంగా కనిపిస్తుంది. మూడు దశల సినీ ప్రయాణం ఆయనది. తొలి చిత్రాలన్నీ కథాకథనం విషయంలో సంప్రదాయ ధోరణిలో సాగిపోతాయి. సున్నితమైన సామాజిక వ్యంగ్యానికి ప్రతీకగా నిలిచే 'భువన్ శోమ్' (1969) హిందీలో ఆయన తొలి చిత్రం, తొలి దశలో ఆఖరి చిత్రం. భారతీయ నవ్య సినిమా ఉద్యమానికి ఆగమ గీతికా అదే! 'ఇంటర్వ్యూ' (1971) నుంచి 'కలకత్తా 71', 'పదాతిక్', 'కోరస్' లాంటి ఉద్యమచిత్రాలు మృణాల్ వామపక్ష భావజాలానికి అద్దంపట్టాయి. కటువైన నిజాలను చూపెట్టాయి. రాడికల్ దృక్పథం, రాజకీయ స్వభావం నిండిన ఆ శక్తిమంతమైన చిత్రాలు మృణాల్ రెండో దశ. 'ఏక్ దిన్ ప్రతిదిన్' (1979), 'ఖారిజ్' (1982) లాంటివన్నీ పట్టణ మధ్యతరగతి జీవుల అనుభవాలకు ప్రతిరూపంగా, ఆత్మపరిశీలన ధోరణిలో తీసిన మూడో దశ సినిమాలు. ఆయన సినిమాలు ఈ మూడు దశల్లోనూ మేధావులను ఆకర్షించాయి. జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకున్నాయి. ఎలాంటి కథతో ఏ సినిమా తీసినా, తత్కాలపు ఆలోచనకూ, ఆవేశానికీ తగ్గట్టు శిల్పాన్నీ, శైలినీ మలుచుకుంటూ పోవడం మృణాల్ అంతర్లక్షణం. ఆయన సినిమాలకు బౌండు స్క్రిప్టులు ఉండేవి కావంటారు. అప్పటికప్పుడు సెట్స్‌పై సన్నివేశాలు, సంభాషణలు అల్లుకుంటూ ఆయన చేసిన సృజన విహారం పేపరు, పెన్నుల పరిధిని మించినది.

ఆ స్వేచ్ఛాప్రియత్వం, ప్రవాహశీలత మృణాల్‌ను బెంగాలీ నుంచి హిందీ, ఒరియా, తెలుగు భాషలకూ తీసుకెళ్ళాయి. సినిమాల నుంచి సీరియల్స్‌కూ డాక్యుమెంటరీలకూ ప్రతిభా పరిమళం విస్తరించింది. తెలుగులో వాస్తవిక చిత్రోద్యమానికి శ్రీకారం చుట్టిన సినిమా కూడా మృణాల్‌దే (ఒక ఊరి కథ–1977). మున్షీ ప్రేమ్‌చంద్ కథ 'కఫన్' ఆధారంగా తీసిన ఈ సినిమా రూపకల్పన తన జీవితకాలంలోని అత్యంత ఉద్విగ్న అనుభవాల్లో ఒకటని మృణాల్ చెప్పుకున్నారు. కథలోని కీలకఘట్టం సినిమాలో లేనందుకు కొన్ని విమర్శలకూ గురైంది. ఆ తరువాత 'అనుగ్రహం', 'మా భూమి' లాంటి మరికొన్ని వాస్తవిక చిత్రాలు తెలుగులో రావడానికి ప్రేరణ అయింది. కాళ్ళు చాపుకొని కుర్చీలో తాపీగా కూర్చున్న ప్రేక్షకులను తెర మీది వాస్తవికతతో అస్థిమితంగా మార్చడం, ఆలోచనలోకీ, ఆత్మపరిశీలనలోకీ నెట్టడం మృణాల్ సినిమాల తత్త్వం. వయసు సహకరించకున్నా, మానసికోత్సాహంతో ఎప్పుడూ ఓ కొత్త కథనో, ఆలోచననో తెరకెక్కించడానికి ఉరకలు వేయడం చివరి దాకా సాగిన ఆయన జీవలక్షణం. సాహిత్యాన్ని సినిమాగా అనుసృజించడానికి మొగ్గుచూపిన ఈయన తీసిన సినిమాల కన్నా, రాసుకొని అర్ధంతరంగా ఆపేసిన స్క్రిప్టులే ఎక్కువ. ఓ ప్రసిద్ధ నక్సలైట్ నాయకుడి జీవితానికి తెర రూపమివ్వాలన్న కోరిక కూడా అలా తీరకుండా మిగిలిపోయినదే!

పద్మభూషణ్ బిరుదం, ఫాల్కే పురస్కారం, ఫ్రాన్స్, రష్యా ప్రభుత్వాల గౌరవం, రాజ్యసభ సభ్యత్వం లాంటివి ఎన్నో వచ్చినా, సినీప్రియుల ప్రేమాస్పద గౌరవమే మృణాల్ సేన్‌కు ఇప్పటికీ అతి పెద్ద గుర్తింపు. అమితాబ్ బచ్చన్ ('భువన్ శోమ్'లో నేపథ్య గాత్రధారిగా), మిథున్ చక్రవర్తి ('మృగయా'లో నటుడిగా) లాంటి అభినయ విశారదుల్ని పరిచయం చేయడం ఆయనకున్న మరో పాస్‌పోర్ట్. సత్యజిత్ రే మరణం తరువాత భారతీయ సినీ విరాణ్మూర్తిగా నిన్నటి దాకా మిగిలింది మృణాల్ సేనే. కానీ, ఇటీవలి ప్రభుత్వాలు, మీడియా ఆయనను అంతగా పట్టించుకున్నట్టు కనిపించదు. ఇప్పుడిక ఆయన కృషి మాత్రం మిగిలింది. కానీ, 'ఒక ఊరి కథ' సహా ఆయన తొలి చిత్రాలు అనేకం ఇప్పటికీ అందుబాటులో లేకపోవడం సినీప్రియులకు మృణాల్ మరణాన్ని మించిన విషాదం!

సమ్మిళితవృద్ధి లక్ష్యంగా 'జన్మభూమి–మా ఊరు'

జన్మభూమి కార్యక్రమం తెలుగు ప్రజల నరనరాల్లో ఇంకిపోయింది. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య పటిష్టమైన వారధిలా ఈ కార్యక్రమం ఎంతో మేలు చేకూరుస్తోంది. ఎన్నికల ఏడాదిలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆరో విడత 'జన్మభూమి–మా ఊరు' కార్యక్రమం కీలకం కానుంది. నవ్యాంధ్రప్రదేశ్‌లో నాలుగున్నరేళ్లగా సమగ్రాభివృద్ధిలో సాధించిన విజయాలను, ప్రగతిని జన్మభూమి వేదికగా ప్రజలకు పూర్తిస్థాయిలో తెలియజెప్పడంతో పాటు రాబోయే రోజుల్లో చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి చర్చించడానికి ఈ కార్యక్రమం వేదిక కానుంది. ఎంతమందికి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందుతున్నాయో సమగ్రంగా చర్చ జరిపి అర్హులైన వారందరికి లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవడం జరుగుతుంది. మరోవైపు అర్హులైన వారి దగ్గరి నుంచి విజ్ఞప్తులు స్వీకరించి కుల, మత, ప్రాంత విబేధాలు లేకుండా కొత్తగా రేషన్‌కార్డులు, పింఛన్లు, ఇళ్ళు, రుణాలు వంటివి అందించడం జరుగుతుంది.

జనవరి 2 నుంచి 11 వరకు జరిగే 'జన్మభూమి–మా ఊరు' కార్యక్రమంలో గ్రామాలవారీగా కల్పించిన మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకున్న లబ్ధిదారుల వివరాలను గ్రామసభల్లో ప్రకటించనున్నారు. అలానే గతంలో జరిగిన గ్రామసభల్లో ప్రజలు వెల్లడించిన సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై ఈ కార్యక్రమంలో నివేదికలు సమర్పిస్తారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి సకాలంలో పరిష్కరించే దిశగా ప్రణాళికలు రూపొందించారు. ప్రజల వద్దకే పాలనను తీసుకొని రావాలనే ఉద్దేశంతో గ్రామ సభలను నిర్వహించి ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నారు.



> ఎన్నికల ఏడాదిలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆరో విడత 'జన్మభూమి–మా ఊరు' కార్యక్రమం కీలకం కానుంది. జనవరి 2 నుంచి 11 వరకు జరిగే ఈ కార్యక్రమం నూతన సంవత్సరంలో ప్రజా సంతృప్తిస్థాయి పెంచేందుకు మరింత దోహదపడుతుంది. నవ్యాంధ్రప్రదేశ్‌లో నాలుగున్నరేళ్ళుగా సమగ్రాభివృద్ధిలో సాధించిన విజయాలను, ప్రగతిని జన్మభూమి వేదికగా ప్రజలకు పూర్తిస్థాయిలో తెలియజెప్పడంతో పాటు రాబోయే రోజుల్లో చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి చర్చించడానికి ఈ కార్యక్రమం వేదిక కానుంది.

సమ్మిళిత వృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆరవ విడత జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించనున్నది. నాలుగున్నరేళ్లల్లో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు వివరాలను, భవిష్యత్ ప్రణాళికలను ప్రజల్లోకి తీసుకెళ్లనున్నారు. మొదటి రోజు ఆంధ్రప్రదేశ్ పునఃవ్యవస్థీకరణ చట్టం అమలు, రాష్ట్ర ప్రభుత్వం కృషి; రెండో రోజు రాష్ట్ర ఆర్థిక వృద్ధి; మూడో రోజు సాంఘిక సాధికారత; నాల్గవ రోజు రైతు సంక్షేమం, ఆహార భద్రత; ఐదో రోజు సహజ వనరుల నిర్వహణ; ఆరో రోజు మానవ వనరుల అభివృద్ధి; ఏడో రోజు గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటు; ఎనిమిదవ రోజు ప్రజా రాజధాని అమరావతి, మౌలిక సదుపాయాలు; తొమ్మిదవ రోజు పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి నైపుణ్యాభివృద్ధి; పదవ రోజు శాంతి భద్రతలు, సుపరిపాలన వంటి అంశాలపై చర్చ జరుగుతుంది. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన శ్వేత పత్రాలు, సృష్టించిన ఆస్తులు ప్రభుత్వ కార్యక్రమాల లక్ష్యాలు, పురోగతి వంటి కార్యక్రమాలపై సర్వే నివేదికలు చర్చిస్తాయి. జన్మభూమి కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు అన్ని వర్గాల ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేలా వ్యాస రచన, చిత్రలేఖనం, ముగ్గుల పోటీలు, ఆటల పోటీలను నిర్వహించనున్నారు. మధ్యాహ్నం గ్రామ నడక ద్వారా అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలకు శ్రీకారం చుడతారు. స్వచ్ఛాంధ్రప్రదేశ్‌కు ప్రాధాన్యతనిస్తూ ప్రజలందరూ స్వచ్ఛ సంక్రాంతి జరుపుకునేలా ప్రజల్లో అవగాహన పెంపొందించనున్నారు. నవ్యాంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు అందరూ కృషి చేసేలా ఈ 'జన్మభూమి–మా ఊరు' కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేయనున్నారు.

ప్రతి మండలం, పురపాలక సంఘం పరిధిలో, మండల, గ్రామస్థాయిలో అధికార బృందాలను ఏర్పాటు చేసి ప్రతిరోజు నిర్దేశిత కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఈ బృందంలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్ఓ, ఉపాధ్యాయులు, వీఆర్‌పీ, అంగన్‌వాడి, స్వయం సహాయక సంఘాలు, ఆశ కార్యకర్తలు, సాధికారమిత్రలు, కళాశాల విద్యార్థులను భాగస్వాములు చేస్తారు. ఇప్పటికే ప్రజల్లో అన్ని పథకాల అమలు తీరుపై దాదాపు 85% సంతృప్తి వ్యక్తం అయ్యింది. దానిని నూటికి నూరు శాతం చేసేందుకు ప్రభుత్వం అనేక ప్రణాళికలు రచిస్తోంది. నూతన సంవత్సరంలో 'జన్మభూమి–మా ఊరు' కార్యక్రమం ప్రజా సంతృప్తిస్థాయి పెంచేందుకు మరింత దోహదపడుతుంది. సమాజంలోని అన్ని వర్గాల సమ్మిళిత, సుస్థిర అభివృద్ధిలో మెరుగైన జీవన ప్రమాణాల సాధన కోసం స్మార్ట్ విలేజ్, స్మార్ట్ వార్డు కార్యక్రమాలను చేపట్టారు. ప్రవాస భారతీయులు, వాణిజ్య వ్యాపార సంస్థలు సామాజిక బాధ్యతలపై స్పందించేలా ఈ కార్యక్రమాలను రూపొందించారు. సోషల్ రెస్పాన్సిబిలిటీలో జన్మభూమి కూడా ఒక భాగమే. అందరి సహకారంతో గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుతున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణానికి జన్మభూమిలో కంకణబద్ధులు కావాలి.

■ పాటిబండ్ల అనిల్

ఎన్నికల్లో నల్లధనం మాటేమిటి?

ఇండియాగేట్



■ ఎ. కృష్ణారావు

పార్లమెంట్ సెంట్రల్‌హాలులో చాలా మంది ఎంపీలు ఇటీవల చాలా దిగులుగా కనపడుతున్నారు. మళ్లీ ఎన్నికలు వస్తాయని, మళ్లీ కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టాల్సి వస్తుందని బాధ వ్యక్తం చేస్తున్నారు. ఎంపీ పదవికి పోటీ చేయడం కన్నా ఎమ్మెల్యే సీటుకు పోటీచేస్తే ప్రయోజనం ఎక్కువుంటుందని చాలా మంది అభిప్రాయపడుతున్నారు. ఈ మధ్య జరిగిన అసెంబ్లీల ఎన్నికల్లో అధికారంలో ఉన్న పార్టీలు తిరిగి అధికారంలోకి రావడానికి భారీ ఎత్తున ఖర్చుపెట్టాయి. అధికారంలో లేని పార్టీలే భారీ ఎత్తున డబ్బులు ఖర్చులు పెడుతున్నపుడు అధికారంలో ఉన్న పార్టీ భారీ ఎత్తున ఖర్చుపెట్టడంలో ఆశ్చర్యం ఏముంది? అని ఎంపిలు చర్చించుకుంటున్నారు. ఎన్నికలంటూ జరిగిన తర్వాత అధికారంలో ఉన్నా, లేకపోయినా పార్టీలు, అభ్యర్థులు పెద్ద ఎత్తున నిధులు ఖర్చు పెట్టాల్సి వస్తుంది. పొరుగు రాష్ట్రాల నుంచి, కార్పొరేట్ల నుంచి కూడా నిధులు ప్రవహిస్తాయి. ఫలానా రాష్ట్రంలో ఫలానా ప్రభుత్వం ఉండడం వల్ల ఫలానా వారికి ప్రయోజనం ఉంటుందనే చర్చ ప్రతి ఎన్నికల్లోనూ జరుగుతుంది. కర్ణాటక ఎన్నికల సమయంలో కూడా బిజెపి పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు పెద్ద ఎత్తున రంగంలోకి దిగారు. వారు ఏమీ ఉత్తి చేతులతో రారు కదా. అదే సమయంలో కాంగ్రెస్‌కు సహాయం చేయకుండా అనేక కార్పొరేట్ సంస్థలపై, వ్యక్తులపై ఆదాయపన్ను దాడులు జరిగాయి. ఏది ఏమైనా ఎమ్మెల్యేగా పోటీ చేయడం వల్ల అటు వ్యక్తిగతంగానూ, ఇటు రాజకీయంగానూ లాభం ఉంటుందని ఎంపీలు అనుకోవడంలో ఆశ్చర్యం లేదు. తమ పార్టీ గెలిస్తే మంత్రిపదవులు, పైరవీలు. తమ పార్టీ ఓడిపోయి తాము ఎమ్మెల్యేలుగా మిగిలితే అధికార పార్టీతో కుమ్మక్కయ్యే అవకాశాలు. లేదా తాము ఎమ్మెల్యేగా ఓడిపోయినా ఎన్నికలకోసం వచ్చిన డబ్బుల్లో ఎంతో కొంత మిగుల్చుకునే అవకాశాలు ఎలాగూ ఉంటాయి.

'మమ్మల్ని ఎవరు పట్టించుకుంటారు.. ఎమ్మెల్యేకున్న విలువ మాకేమున్నది.?' అని బాధపడే ఎంపీలు చాలా మంది ఉన్నారు. 'ఈ సారి నేను ఎమ్మెల్యే సీటుకు పోటీ చేయాలనుకుంటున్నాను' అని ఒకరంటే 'మనకు టికెట్ ఇస్తారంటారా' అని మరొకరు ప్రశ్నిస్తున్నారు. క్లుప్తంగా చెప్పాలంటే ఎంపిలు చాలా మంది ఎమ్మెల్యేల పట్ల ఈర్ష్య పడుతున్నారు. అనేక కార్పొరేట్ సంస్థలకు యజమాని అయి, ఎంపీగా ఉన్న ఒక నేత కూడా 'అసలు ఎమ్మెల్యేల వద్ద ఇంత డబ్బెలా వస్తున్నది!' అని ఆశ్చర్యపోతున్నారు. ఒకప్పుడు తన సహాయంతో గెలిచిన ఒక ఎమ్మెల్యే ఇప్పుడు రోడ్డుకు అటూఇటూ వైపు ఉన్న భూములన్నీ తనవేనని చెప్పుకుంటున్నారని ఆయన వెల్లడించారు. ఎంపీలు డబ్బులు సంపాదించడం లేదని కాదు, ఎమ్మెల్యేల అంత సంపాదించలేకపోతున్నామనే వారి బాధ.

అసలు ఇంత డబ్బు సంపాదించడం అవసరమా అన్నది కీలకమైన ప్రశ్న. 'రాజకీయాల్లో ప్రవేశించిన ప్రతి వాడూ అత్యంత ధనికుడుగా మరణించడం అవసరమా?' అని ఒక మాజీ ఎంపి ప్రశ్నించారు. ఇవాళ రాజకీయాల్లో ఉన్న వారు అత్యంత ధనికులుగా మరణించాలనుకుంటున్నారు కాని, ఉన్నత వ్యక్తిత్వంతోనో, గొప్ప ప్రజాసేవకుడుగానో మరణించాలనుకోవడంలేదని ఆయన చెప్పారు. ఎన్నికల్లో ప్రజాప్రతినిధులయ్యేవారిలో చాలామంది ఎడా పెడా ఆర్జించేందుకు అవసరమైన పరిస్థితులను ప్రభుత్వాలే కల్పిస్తున్నందువల్ల ఎవర్ని తప్పుపట్టాలో అర్థం కావడం లేదని ఆయన అభిప్రాయపడ్డారు.

ఎన్నికల్లో డబ్బులు ఎలా ఖర్చుపెడతారు? అన్న ప్రశ్న అమాయకమైనది. ప్రజలను సానుకూలంగా మార్చుకునేందుకు ఏ స్థాయిల్లో ఎప్పుడు ఎంతమేరకు ఖర్చు పెట్టాలన్నది ఒక శాస్త్రీయమైన కళ. బూత్ కమిటీలు, శక్తి కేంద్రాలు, పన్నా ప్రముఖ్‌లు, ఐటి కేంద్రాలు, కన్సల్టంట్లు, సోషల్ మీడియా ప్రచారాలు, ప్రకటనలు, బ్యానర్లు, కటౌట్లు, పరిశీలకులు, పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తల్ని దించడం, ఇంటింటికీ ప్రచారం, సర్వేలు, ఇవన్నీ పైకి కనపడే ఖర్చుతో కూడుకున్న వ్యవహారాలు. మద్యం, నోట్ల పంపిణీ మాత్రమే కాదు అన్ని స్థాయిల్లో అనేక యంత్రాంగాల్ని, వ్యక్తుల్నీ తిప్పుకోవడం మరో ఎత్తు. శతకోటి దరిద్రాలకు అనంత కోటి ఉపాయాలు



> ఎన్నికల సంస్కరణల విషయమై 1990లో గోస్వామి కమిటీ నుంచి 2008లో రెండవ పరిపాలనా సంస్కరణల కమిషన్ వరకు ఎన్నో సూచనలు చేశాయి. కేంద్రంలో ఉన్న ఏ ప్రభుత్వమూ వీటిని అమలు చేసేందుకు చిత్తశుద్ధి చూపలేదు. నల్లధనాన్ని అరికడతానని హంగామా చేసి అధికారంలోకి వచ్చిన మోదీ హయాంలో ఎన్నికల వ్యవస్థలో నల్లధనం పాత్ర పెరిగిన దాఖలాలే కాని తగ్గిన సూచనలు చేవు.

ఉన్నట్లు– గుజరాత్‌లో డిజిటల్ లావాదేవీల ద్వారా కూడా డబ్బులు బదిలీ అయ్యాయని ఆ తర్వాతి కాలంలో తెలిసింది. 'నా పదవీ కాలంలో ఎదుర్కొన్న అత్యంత కీలకమైన సవాలు– రాష్ట్రాల ఎన్నికల్లో డబ్బు ప్రభావాన్ని అరికట్టడం. ఇది రోజురోజుకూ పెరిగిపోతున్నది' అని ఇటీవల పదవీవిరమణ చేసిన ప్రధాన ఎన్నికల కమిషనర్ ఓపీ రావత్ అన్నారు. విచిత్రమేమంటే– రోజుకు పదివేల రూపాయల కంటే, మొత్తం ఎన్నికల్లో రూ.28 లక్షల కంటే ఎక్కువ అభ్యర్థి ఖర్చు పెట్టకూడదని ఎన్నికల కమిషన్ ప్రకటించింది. డబ్బు మంచినీళ్లలా కళ్లముందే ప్రవహిస్తున్న ఈ రోజుల్లో ఎన్నికల కమిషన్ ప్రకటన విన్నవారికి నవ్వు రాకమానదు. అసలు పార్టీలు పెట్టే ఎన్నికల ఖర్చుకు పరిమితి లేదన్న విషయం చాలా మందికి తెలియదు. అసలు ఎన్నికల కమిషన్ అనుమతించిన దానికంటే పోలీసులు స్వాధీనం చేసుకున్న మొత్తం ఎన్నో రెట్లు ఎక్కువ ఉంటుంది. కర్ణాటక ఎన్నికల్లో రూ.5600 కోట్ల మేరకు ఖర్చయిందని క్రింది స్థాయిలో పనిచేసే కన్సల్టంట్లు చెప్పినట్లు ఒక వార్తాకథనం ప్రచురితమైంది.

భారత దేశంలో ఎక్కడా ఎన్నికల్లో సామాన్యుడు పోటీ చేసే పరిస్థితి లేదని అనే వారు చాలా మంది ఉన్నారు. అధికార పార్టీ అండతోనో, మరో వెన్నుదన్నుతోనో పోటీ చేసిన సామాన్యులు కూడా అనతికాలంలోనే సంపన్నులు అయిపోతున్నారు. రాజస్థాన్ ఎన్నికల్లో ఇటీవల గెలిచిన ఎమ్మెల్యేలలో 73 శాతం మంది కోట్లకు పడగెత్తిన వారు. అసలు రాజస్థాన్ నుంచి పోటీ చేసిన బిజెపి అభ్యర్థుల్లో 81 శాతంమంది కోటీశ్వరులు. మధ్యప్రదేశ్‌లో 656 మంది కోటీశ్వరులు పోటీ చేయగా వారిలో 161 మంది గెలిచారు. ఛత్తీస్‌గఢ్ ఎన్నికల్లో కూడా 42మంది కోటీశ్వరులు పోటీ చేశారు.

అసలీ డబ్బులు ఎలా వస్తున్నాయి? అధికారంలో ఉన్న పార్టీలు ఎంత ఆర్జిస్తే ఇంత భారీ ఎత్తున డబ్బులు ఖర్చు పెట్టగలుగుతాయి? అసలు రాజకీయ పార్టీలకు ఏఏ పారిశ్రామిక సంస్థలు, రియల్ ఎస్టేట్ సంస్థలు సహాయపడుతున్నాయి? ఎందుకు సహాయపడుతున్నాయి? ఈ ప్రశ్నలను సామాన్యులెవరూ అడగడం లేదు. ఎన్నికల నిధుల వెనుక పరిశ్రమలు, రియల్ ఎస్టేట్ సంస్థల హస్తం ఉన్నదని అనేక అధ్యయనాల్లో తేలింది. ఈ డబ్బంతా లెక్కలు చెప్పలేని నల్లధనం అనడంలో కూడా అతిశయోక్తి లేదు. మరి ఈ దేశంలో నల్లధనాన్ని నిర్మూలిస్తానని పెద్దఎత్తున వాగ్దానాలు చేసిన నరేంద్రమోదీ ఏమి సాధించారు? మన కళ్లముందు ఎన్నికల సమయంలో ప్రవహిస్తున్న నల్లధనాన్ని అరికట్టలేని వారు దేశంలో నల్లధనాన్ని మొత్తంగా ఎలా నిర్మూలించగలరు? నల్లధనాన్ని అరికట్టేందుకు పెద్ద నోట్ల రద్దుతో సహా అనేక చర్యల్ని మోదీ ప్రభుత్వం తీసుకోలేదని చెప్పలేం కాని దాని వల్ల ఏం ప్రయోజనం కలిగింది? పెద్ద నోట్ల రద్దు మూలంగా ఏ ఫలితమూ రాలేదని రద్దయిన నోట్ల విలువ దాదాపూ తిరిగి వచ్చిందని రిజర్వు బ్యాంకు వార్షిక నివేదికే చెప్పింది. మహా అయితే ఉత్తర ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు తీసుకున్న ఈ చర్య వల్ల బిఎస్‌పి, ఎస్‌పి లాంటి పార్టీలకు కొంత చెప్పుకోలేని ఇబ్బందులు ఎదురయి ఉండవచ్చు. స్థూలంగా చూస్తే పెద్ద నోట్ల రద్దు కేవలం రాజకీయ ప్రయోజనాలకోసం తీసుకున్న చర్య మాత్రమే కాని నల్లధనాన్ని అరికట్టేందుకు నిజాయితీతో చేపట్టిన చర్య కాదని అర్థమవుతోంది. ఇక ఆదాయ ప్రకటన పథకం, బినామీ నిషేధ చట్టం, ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన, ఆదాయపన్ను దాడులన్నిటితోనూ కలిపితే లక్షా 15వేల కోట్ల రూపాయలు స్వాధీనం చేసుకున్నామని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అయినప్పటికీ అయిదు రాష్ట్రాల ఎన్నికల్లో వేల కోట్ల నల్లధనం ఎలా ప్రవహించింది? నరేంద్ర మోదీ చెప్పగలరా?

విచిత్రమేమంటే విదేశాల్లో ఉన్న నల్లధనం గురించి దేవుడెరుగు. స్వదేశంలో ఉన్న నల్లధనాన్ని అరికట్టడంలో మన దర్యాప్తు సంస్థలు విఫలమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఎన్నో చట్టాలు చేయగలదు. ఎన్నో దర్యాప్తు సంస్థలు కేంద్రం చేతుల్లో ఉన్నాయి. రాష్ట్రాల చేతుల్లో కూడా ఎన్నో సంస్థలు ఉన్నాయి. ఈ సంస్థలన్నీ రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా నడుచుకోవడం వల్ల, ఆ సంస్థలకు, వాటిపై అజమాయిషీ చలాయించే వారు కుమ్మక్కు కావడం వల్ల ఎవరూ ఏమి చేయలేకపోతున్నారు. అధికార పార్టీ నాయకులపై, వారికి సహాయం చేసే పారిశ్రామిక సంస్థలు, వ్యక్తులపై, ప్రాంతీయ కుబేరులపై దాడులు జరిగిన సందర్భాలు ఎక్కడన్నా ఉన్నాయా? 2014లో 500 కోట్ల డాలర్ల మేరకు ఎన్నికల్లో ఖర్చయిందని ఒక అధ్యయన సంస్థ పేర్కొంది. 2012లో జరిగిన అమెరికా అధ్యక్ష పదవి ప్రచారంలో జరిగిన ఖర్చు కంటే ఇది కొంచెం తక్కువ. 2019లో జరిగే లోక్ సభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ తరపున చేసే ప్రచారంలో భారీ ఎత్తున డబ్బు ఖర్చు పెట్టబోమని నరేంద్రమోదీ గుండెలమీద చేయి వేసుకుని చెప్పగలరా? ఆయన పార్టీ అధ్యక్షుడు అమిత్ షా, కేంద్ర మంత్రులు, బిజెపి నేతలు, కార్యకర్తలు తిరిగే హెలికాప్టర్లు, ప్రత్యేక విమానాలు, కార్లు, పాల్గొనే బహిరంగ సభలు, ర్యాలీలు, రోడ్ షోలకు, అభ్యర్థుల ప్రచారానికి, జనాలను సమీకరించేందుకు అయ్యే ఖర్చంతా తెల్లధనమేనని వారు స్పష్టీకరించగలరా?

'ఏన్ అన్ డాక్యుమెంటెడ్ వండర్, మేకింగ్ ఆఫ్ ద గ్రేట్ ఇండియన్ ఎలెక్షన్' అనే పుస్తకంలో మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎస్.వై.ఖురేషీ ఎన్నికల సమయంలో డబ్బు ఎంత క్షుద్రంగా ప్రవహిస్తుందో వివరించారు. ఎన్నికల సంస్కరణల విషయమై 1990లో గోస్వామి కమిటీ నుంచి 2008లో రెండవ పరిపాలనా సంస్కరణల కమిషన్ వరకు ఎన్నో సూచనలు చేశాయి. కేంద్రంలో ఉన్న ఏ ప్రభుత్వమూ వీటిని అమలు చేసేందుకు చిత్తశుద్ధి చూపలేదు. నల్లధనాన్ని అరికడతానని హంగామా చేసి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ హయాంలో ఎన్నికల వ్యవస్థలో నల్లధనం పాత్ర పెరిగిన దాఖలాలే కాని తగ్గిన సూచనలు లేవు.

భారత దేశంలో అధర్మాలు పెరిగిపోతున్నాయని, దేశభక్తిని బాగా ప్రజల్లో పెంచాల్సిన అవసరం ఉన్నదని వాదించే వారితో విబేధించనక్కర్లేదు. కాని దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రాణాధారమైన ఎన్నికల వ్యవస్థలో నల్లధనం ప్రమేయాన్ని అరికట్టి సరైన ప్రజాప్రతినిధులను ఎన్నుకోగలిగినప్పుడే దేశభక్తి అనే పదానికి సార్థకత ఏర్పడుతుంది. మోదీ ఎజెండాలో ఇలాంటి కర్తవ్యాలు లేకపోవడంలో ఆశ్చర్యం లేదు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

హైకోర్టు న్యాయవాదుల ద్వంద్వ వైఖరి

భారతరాష్ట్రపతి నోటిఫికేషన్ ప్రకారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మంగళవారం విజయవాడలో ప్రారంభమైంది. ప్రధాన న్యాయమూర్తితోపాటు మొత్తం 14 మంది న్యాయమూర్తుల చేత గవర్నర్ నరసింహన్ ప్రమాణస్వీకారం చేయించారు. ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల న్యాయవాదులు ప్రమాణస్వీకార ఉత్సవంలో పెద్ద సంఖ్యలో పాల్గొనగా, హైదరాబాద్‌లోవుంటూ హైకోర్టులో ప్రాక్టీసుచేస్తున్న ఆంధ్రన్యాయవాదులు కూడా తగిన సంఖ్యలో హాజరయ్యారు. ఈ రీత్యా, హైదరాబాద్–ఆంధ్ర న్యాయవాదులు రాష్ట్రపతి నోటిఫికేషన్ అమలును వాయిదావేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన రిట్ పిటీషన్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలి. హైకోర్టు పనులు ప్రారంభమైన దృష్ట్యా ఈ పిటీషన్ కాలదోషం పట్టినదిగా మారుతుందన్న విషయం ఎలాగూ ఉండనే ఉన్నది. అయినప్పటికీ, ఈ న్యాయవాదుల వ్యవహారశైలి ద్వంద్వంగా ఉన్నదనేదే ఇక్కడ ముఖ్యమైన అంశం. ఎందుకంటే, సుప్రీంకోర్టులో వ్యతిరేకిస్తూ ఇక్కడ అమరావతి హైకోర్టులో ప్రాక్టీసు చేస్తామనడాన్ని ఏమనాలి? హైదరాబాద్ ఆంధ్ర న్యాయవాదులు ఆ పిటీషన్‌ను ఉపసంహరించుకోవాలి, లేదా, సుప్రీంకోర్టులో పిటీషన్ వేయడం తప్పు అని మిగిలిన న్యాయవాదులు ఖండించాలి. కనీసం, ఆ పిటీషన్‌తో తమకు సంబంధం లేదనైనా బహిరంగంగా ప్రకటించాలి.

సుప్రీంకోర్టు రిట్ పిటీషన్‌లో ఇంప్లీడ్ అవ్వడానికి తగిన ఏర్పాట్లు కొందరు న్యాయవాదులము చేస్తున్నాము. రిట్ పిటీషన్ సమర్థనీయమే కాదనీ, హైకోర్టు పని ప్రారంభించాక రాష్ట్రపతి నోటిఫికేషన్ అమలు చేయరాదనే పిటీషన్‌కు కాలం చెల్లిపోయిందనే వాదనలను ఇంప్లీడ్ పిటీషన్ ద్వారా సుప్రీంకోర్టులో వినిపించనున్నాము.

మరోవిషయం, సుప్రీంకోర్టులో 'హైదరాబాద్ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్' అనే పేరిట పిటీషన్‌ను దాఖలు చేసారు. ఇది పూర్తిగా తప్పు. రాష్ట్రపతి నోటిఫికేషన్ ద్వారా ఎ.పి. హైకోర్టు జనవరి 1, 2019న అమరావతిలో ఏర్పడింది. హైకోర్టు నెలకొల్పకముందే హైకోర్టు న్యాయవాదుల సంఘం ఏలా ఏర్పడుతుంది? అమరావతిలో స్థాపించవలసిన సంఘాన్ని హైదరాబాదులో ఏలా ఏర్పరుస్తారు? కనుక, హైదరాబాదులో ఏర్పడినట్లు చెప్పబడుతున్న సంఘానికి చట్టబద్ధతా లేదు, న్యాయబద్ధతా లేదు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్‌ను అమరావతిలో ఏర్పాటు చేసుకోవడానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదులు సంసిద్ధంగా ఉండాలని కోరుతున్నాను.

– వై.కె.
సీనియర్ అడ్వకేట్

అమెరికా వెళితే అసత్యాలు మాట్లాడాలా?

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అమెరికా పర్యటనపై ఆంధ్రజ్యోతిలో డిసెంబరు 20వ తేదీన "రాయబారానికొస్తూ రాళ్ళేస్తారా?" అంటూ ఆర్కే మాగంటి రాసిన వ్యాసం చదివిన తరువాత నా ఆలోచనలను, నాకు కలిగిన అనుమానాలను ఈ వ్యాసం ద్వారా తెలియచేయాలనుకుంటున్నాను. పవన్ తన అమెరికా పర్యటనలో చే గువేరా పట్ల తనకున్న ప్రగాఢాభిమానం గురించి మాట్లాడడం, యుఎస్ ఇమ్మిగ్రేషన్ చట్టాలనూ అమెరికాలోని ఇమ్మిగ్రేషన్ సమస్యల పూర్వాపరాలనూ సమగ్రంగా అధ్యయనం చేయకుండా ఏకపక్ష వాదనలు వినిపించడం తప్పని సదరు వ్యాసకర్త అభిప్రాయపడ్డారు.

అమెరికా దృష్టిలో చేగువేరా ఒక నరహంతకుడు, అంతర్జాతీయ టెర్రరిస్టు అని వ్యాసకర్త పేర్కొన్నారు. కాబట్టి అటువంటి వ్యక్తి నాకు ఆదర్శం అంటూ పవన్ అనడం అమెరికన్ల మనసుల్ని గాయపరచదా అని వాపోయారు. నిజమే అమెరికా దృష్టిలో చే గువేరా ఒక తీవ్రవాది. కానీ ప్రపంచం దృష్టిలో కాదు. పవన్ కూడా తన ప్రసంగంలో 'మన మనుషులు కాకపోయినా, మన కుటుంబీకులు కాకపోయినా, మన వారు కాకపోయినా మానవత్వం ఎక్కడ మంట కలుస్తుందో, మనుషులు ఎక్కడ దోపిడీకి గురవుతున్నారో (అక్కడ) పీడితుల పక్షాన అండగా ఉండాలని చెప్పిన చే గువేరా జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని నేను రాజకీయాల్లోకి వచ్చాను' అన్నారు. ఈ విషయాన్ని వ్యాసకర్తే ధృవీకరించారు. అయితే పవన్ చేసిన ఈ వ్యాఖ్యల్లో తప్పేముందో అర్థంకానిది. అంటే చే గువేరాపై అభిమానం ఉన్నా దాన్ని అమెరికాలో వ్యక్తపరచకుండా కేవలం ఆ ప్రాంత నాయకులని మాత్రమే పొగడాలని వ్యాసకర్త ఉద్దేశమేమో. అలా చేస్తే అది ఆత్మద్రోహం అనిపించుకోదా? "చే గువేరా క్యూబా, లాటిన్ అమెరికాకు మాత్రమే పరిమితంకాదు. ప్రపంచంలో ఎన్నో దేశాలలో ఆయనను ఆదర్శ నేతగా గుర్తిస్తారు. ప్రపంచంలో దోపిడీ వ్యవస్థలకు వ్యతిరేకంగా పోరాడే యువతకు చే గువేరానే ఆదర్శం" అని చే గువేరా జీవిత చరిత్ర రాసిన అమెరికాకు చెందిన ప్రముఖ రచయిత జాన్ ఆండర్సన్ అన్నారు. అమెరికాకు చెందిన రచయితే చే గువేరా గురించి అంత గొప్పగా మాట్లాడితే, అమెరికా ప్రజల మనోభావాలు దెబ్బతింటాయని వ్యాసకర్త ఎలా నిర్ధారిస్తారు? ఇంకొక విషయం చే గువేరా క్యూబా మంత్రి హోదాలో 1959లో భారత్ లో పర్యటించారు. తన భారత పర్యటనపై నివేదిక రాసి ఫిడెల్ కాస్ట్రోకు అందించారు. "మేము కైరో నుంచి భారత్‌కు వెళ్ళాము. 39 కోట్ల జనాభా, 30 మిలియన్ చదరపు కిలోమీటర్ల విస్తీర్ణమున్న దేశమది. మేమీ పర్యటనలో భారత అగ్రశ్రేణి రాజకీయ నాయకులను కలిశాం. జవహర్ లాల్ నెహ్రూ మాపై ఎంతో అభిమానం చూపారు. నెహ్రూ మాకు ఎన్నో విలువైన సలహాలిచ్చారు. క్యూబా ప్రజా ప్రయోజనాల కోసం చేస్తున్న ఉద్యమానికి ఎటువంటి షరతులు లేకుండా మద్దతు ప్రకటించారు. క్యూబా ప్రజలతో మేమున్నామని, వారు చేస్తున్న పోరాటానికి మద్దతు పలుకుతున్నామని" నెహ్రూ చెప్పినట్లు చే గువేరా ఆ నివేదికలో పేర్కొన్నారు. అమెరికా దృష్టిలో తీవ్రవాది అయినా, చే గువేరాని అప్పటి భారత ప్రభుత్వం సాదరంగా ఆహ్వానించింది. మరి అమెరికా ప్రభుత్వం భారత్‌పై ఎటువంటి ఆంక్షలూ విధించలేదే! అమెరికా–భారత్ మధ్య సంబంధాలకు ఎటువంటి అడ్డంకి రాలేదే! ఒకవేళ వ్యాసకర్త దృష్టిలో అమెరికా వెళ్ళినపుడు మాత్రం చే గువేరా గురించి మాట్లాడకూడదు, ఒకవేళ మాట్లాడినా పొగడకూడదు అనేదే అసలు ఉద్దేశమయితే అమెరికా వెళితే అసత్యాలు చెప్పొచ్చు కానీ, నిజాలు మాట్లాడకూడదు అని భావించవచ్చా? దక్షిణాఫ్రికా నల్ల సూరీడు నెల్సన్ మండేలా కూడా 'స్వేచ్ఛను ప్రేమించే ప్రతీ ఒక్కరికీ చే గువేరా ఒక స్ఫూర్తి' అని కొనియాడారు. అంటే వ్యాసకర్త ఉద్దేశ్యంలో అమెరికాలో స్వేచ్ఛను ప్రేమించే వ్యక్తులు లేనట్టా? లేక నెల్సన్ మండేలా వ్యాఖ్యలు తప్పన్నట్లా? ఒకటి మాత్రం స్పష్టం. చే గువేరా ఎంచుకున్న మార్గం కరెక్ట్ కాకపోవచ్చు. అమెరికా సామ్రాజ్యవాద నాయకులకు చే గువేరా అంటే ఇష్టం లేకపోవచ్చు. కానీ విప్లవానికి ఎల్లలు లేవని; విప్లవాగ్నికి కులం, మతం, ప్రాంతం, భాష తెలియదని; విప్లవం సమస్త మానవాళి సామూహిక స్వప్నమని నిరూపించిన యోధుడు చే గువేరా. స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగ వ్యతిరేకమైన సాయుధ పోరాటాలు తప్పు కావచ్చు కానీ, ఒకప్పుడు స్వాతంత్ర్యం కోసం పోరాడిన భగత్ సింగ్, అల్లూరి, బోస్ లాంటి వారు కూడా చే గువేరా తరహాలోనే సాయుధ పోరాటాలు చేయలేదా? అలా అయితే వారు కూడా తీవ్రవాదుల లెక్కలోకి వస్తారు కదా? అంతెందుకు ఒకప్పుడు మన ప్రధాని మోదీకి వీసా ఇవ్వడానికే నిరాకరించిన అమెరికా ఆ తరువాత ఘనస్వాగతం పలికింది. అది అమెరికా అవకాశవాదం అంటారో, లేక సమయస్ఫూర్తి అంటారో సదరు వ్యాసకర్తే చెప్పాలి.



> అమెరికా దృష్టిలో తీవ్రవాది అయినా, చే గువేరాని అప్పటి భారత ప్రభుత్వం సాదరంగా ఆహ్వానించింది. మరి అమెరికా ప్రభుత్వం భారత్‌పై ఎటువంటి ఆంక్షలూ విధించలేదే! అమెరికా–భారత్ మధ్య సంబంధాలకు ఎటువంటి అడ్డంకి రాలేదే! ఒకవేళ వ్యాసకర్త దృష్టిలో అమెరికా వెళ్ళినపుడు మాత్రం చే గువేరా గురించి మాట్లాడకూడదు, ఒకవేళ మాట్లాడినా పొగడకూడదు అనేదే అసలు ఉద్దేశమయితే అమెరికా వెళితే అసత్యాలు చెప్పొచ్చు కానీ, నిజాలు మాట్లాడకూడదు అని భావించవచ్చా?

ఇక రెండో అభియోగం.. పవన్ యు.ఎస్ ఇమ్మిగ్రేషన్ చట్టాలని, అమెరికాలోని ఇమ్మిగ్రేషన్ సమస్యల పూర్వాపరాలని సమగ్రంగా అధ్యయనం చేయకుండా ఏకపక్ష వాదనలు వినిపించారు అని. పవన్ డల్లాస్ సభలో మాట్లాడుతూ సహజంగానే అమెరికా పర్యటన అంటే విరాళాల కోసమన్న అపప్రథ ఉంటుందని, అయితే తాను విరాళాల కోసం రాలేదని, ఇక్కడున్న తెలుగు ప్రజలకు ధైర్యం కల్పించేందుకే 20కి పైగా సభల్లో పాల్గొంటున్నాననీ తెలిపారు. అంతేకాదు మీకిక్కడే సమస్యలున్నా మీకంటూ నేనొకడున్నానని తెలియచెప్పేందుకే తానిక్కడికొచ్చినట్లు స్పష్టం చేసారు. అయితే సదరు వ్యాసకర్త అమెరికాలో భారతీయులు ఎదుర్కొంటున్న సమస్యలపై పవన్ కళ్యాణ్ భారత ప్రధానికి లేఖ రాసారని, ఆ లేఖలో అమెరికా నూతన నాయకత్వం పైన జుగుప్సాకరమైన వ్యాఖ్యలు చేశారని, "రాయబారానికొస్తూ రాళ్ళేస్తారా?" అంటూ విచారం, ఆగ్రహం వ్యక్తం చేశారు. పైగా అక్కడ అనేకమంది ఫేక్ డాక్యుమెంట్లతో ఇమ్మిగ్రేషన్ నిబంధనలకు టోపీ వేసి ఉద్యోగాలకు వెళ్ళిపోయి, ఆ తరువాత ప్రతినిత్యం ఉద్యోగంలో చస్తూ బతుకుతూ దినదిన గండంగా బ్రతుకుతున్నారని, ఇలాంటి వాళ్ళ పవన్ కళ్యాణ్ డల్లాస్ సభకు హాజరైన వారిలో కూడా ఉన్నారని ఆరోపించారు. మరి అమెరికా ప్రభుత్వంపై అంత ప్రేమ కురిపించే సదరు వ్యాసకర్త ఆ ఫేక్ వ్యక్తులను అక్కడి ప్రభుత్వానికి అప్పగించొచ్చుకదా? అయినా పవన్ కళ్యాణ్ ఎక్కడా అమెరికా నిబంధనలకు, చట్టాలకు వ్యతిరేకంగా ఉంటున్నవారిని ఆదుకుంటానని చెప్పలేదే. అలా ఉన్న వారిని భారత ప్రధాని కూడా రక్షించలేరు. ఇక్కడ ఇంకొక్క విషయం. ఈ సమస్య తొలుత మొదలైంది ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ వల్ల కాదని, 'సేవ్ జాబ్స్ యూఎస్ఏ' అనే సంస్థ ట్రంప్ అధికారానికి రాక పూర్వమే వేసిన లాసూట్ వల్ల అనీ వ్యాసకర్త పేర్కొన్నారు. అయితే ట్రంప్ అధికారంలోకి వచ్చాకే హెచ్1బి వీసా దరఖాస్తుల తిరస్కరణ, ధరఖాస్తులను తొక్కిపెట్టడం లాంటివి పెరిగాయని కంపీట్ అమెరికా పేర్కొనడం సదరు వ్యాసకర్తకు తెలియదంటారా? (సాంకేతిక దిగ్గజాలు గూగుల్, ఫేస్‌బుక్, మైక్రోసాఫ్ట్ తదితర సంస్థల సమాఖ్యయే ఈ కంపీట్ అమెరికా).

ఇక వ్యాసకర్త "అమెరికా అనుసరిస్తున్న విధానాలు అమెరికా జాతి నిర్మాతలు (ఫౌండింగ్ ఫాదర్స్) మొదట దర్శించిన దానికి భిన్నంగా ఉన్నాయా?" అని ప్రశ్నించారు. ఆటోమేషన్ తో ఉద్యోగాలు, ఆదాయం కోల్పోయిన సగటు అమెరికన్ ఆగ్రహాన్ని ఒక వ్యాపారవేత్తలా తన రాజకీయ అవసరాలకు వాడుకున్న ట్రంప్‌ను, ఒకప్పటి అమెరికా అగ్రనేతలు జార్జ్ వాషింగ్టన్, అబ్రహం లింకన్, రూజ్వెల్ట్ లాంటి వారితో ఎలా పోలుస్తారో వ్యాసకర్తే చెప్పాలి. అమెరికాగానీ, మరొక పాశ్చాత్య దేశంగానీ... దేశాల మధ్య సంబంధాలు అవసరాలు, అవకాశాలు మధ్యే ఉంటాయి తప్ప వ్యక్తులు జరిపే బేరసారాల వల్ల కాదనేది సత్యం. అవసరం ఉంటే కౌగలించుకుని, ఎదురు తిరిగితే విధ్వంసం సృష్టించి భూస్థాపితం చేసే సామ్రాజ్యవాద దేశం అమెరికాలో నివాసముంటున్న వ్యాసకర్తకు ఆ విషయం నేను ప్రత్యేకించి చెప్పనక్కర్లేదనుకుంటున్నాను.

■ కూసంపూడి శ్రీనివాస్

నవ్య
కుటుంబ కదంబం
బుధవారం • 2 జనవరి 2019



హాంకాంగ్‌లో నివాసముండే తెలుగు కుటుంబాలకు ఏ అవసరం వచ్చినా ఆదుకుంటారు.. ఆ దేశం మీదుగా, ఇతర దేశాలకు రాకపోకలు సాగించే తెలుగువాళ్లకు హాంకాంగ్‌లో ఏ ఆపద వచ్చినా ఆపన్నహస్తం అందిస్తారు. 'హాంకాంగ్ తెలుగు సమాఖ్య' ఏర్పాటు చేసి దాని అధ్యక్షురాలుగా ఉన్న **జయ పీసపాటి** అక్కడ 'తెలుగు' సేవ చేస్తున్నారు. ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఇటీవల హైదరాబాద్‌కు వచ్చిన ఆమెను 'నవ్య' పలుకరిస్తే...

హాంకాంగ్‌లో 'తెలుగు' సేవ!

మాది విజయవాడ దగ్గర యద్దనపూడి. నాన్న యద్దనపూడి నాగేశ్వరరావు రైల్వేలో ఉన్నతోద్యోగి కావడంతో నా బాల్యమంతా మహారాష్ట్ర, గుజరాత్, రాజస్తాన్‌లో సాగింది. నేను ఐదో తరగతిలో ఉన్నప్పుడు హైదరాబాద్‌కు వచ్చాం. ఇక్కడి రైల్వే స్కూల్‌లో తెలుగు మీడియంలో చేరడానికి అడ్మిషన్ అడిగితే తెలుగు రాయడం, చదవడం రావాలన్నారు. కానీ నాకు తెలుగు వచ్చేది కాదు. పది రోజులు టైమిచ్చారు. ఏదోవిధంగా కొంత నేర్చుకుని రైల్వే స్కూల్‌లో అడ్మిషన్ పొందాను. ఆ తర్వాత కష్టపడి తెలుగులో పట్టు సాధించాను.

2002లో హాంకాంగ్ వెళ్లాం..

నా భర్త పేరు రవిశంకర్ పీసపాటి. మర్చంట్ నేవీలో మెరైన్ ఇంజనీర్. రవాణా నౌకల సాంకేతిక సమస్యలను చూస్తుంటారు. ముంబయి, గోవాలో పని చేశారు. ఆయన ఉద్యోగరీత్యా 2002లో హాంకాంగ్‌కు వెళ్లి, అక్కడే స్థిరపడ్డాం. మాకు ఇద్దరు పిల్లలు. హాంకాంగ్‌కు వెళ్లిన కొత్తలో అక్కడ మాకు ఎవరూ తెలియదు. దేశం కానీ దేశంలో మన అనుకునే తెలుగువాళ్లు కనిపిస్తే ఎంతో ధైర్యం వస్తుంది. మావారు డ్యూటీకి వెళితే రెండు నెలలైనా గానీ రారు. ఇంట్లో ఒక్కదాన్నే ఉండలేక అక్కడ తెలుగువారి కోసం వెదకడం మొదలెట్టాను. అప్పట్లో ఒక్క అసోసియేషన్ కూడా లేదు. ఏడాదిపాటు వెతకగా, చివరకు యూనివర్సిటీ ప్రొఫెసర్ కేపీ రావు పరిచయం అయ్యారు. ఇండియన్ ఎంబసీ నుంచి తెలుగువారి సమాచారం తీసుకుని ఆయన వారికి లేఖలు రాసి వనభోజనాలకు ఆహ్వానించేవారు. ఆ విధంగా నాకు కూడా వచ్చిన లేఖతో వనభోజనాలకు వెళ్ళి హాంకాంగ్‌లో తెలుగువారిని కలిశాను. అయితే ఈ లేఖలతో సమాచారం చేరడం కష్టమని, మెయిల్స్, మొబైల్ మెసేజ్‌ల ద్వారా తెలుగువారిని ఒకే తాటిపైకి తీసుకొస్తే బాగుంటుందని కేపీరావుకు సూచించాను. ఆయన ఆ పని నాతోనే చేయించారు.



ఫ్యామిలీతో..

'తెలుగు సమాఖ్య' ఏర్పాటు...

హాంగాంక్‌లో తెలుగువారి వివరాలు తీసుకుని మెయిల్స్, మెసేజ్‌ల ద్వారా పరిచయం పెంచుకున్నాను. ఆ విధంగా నేను అక్కడికి వెళ్లిన నాలుగేళ్లకు అంటే 2006లో 'ది హాంకాంగ్ తెలుగు సమాఖ్యను' ఏర్పాటు చేశాం. ఆ సమాఖ్యకు వ్యవస్థాపక అధ్యక్షురాలిగా ఇప్పటికీ కొనసాగుతున్నాను. అప్పట్లో కేవలం నలుగురితోనే గవర్నింగ్ బాడీ ఉండేది. 40కుటుంబాలు మాత్రమే ఉండేవి. సమాఖ్య తరపున అందరి ఆలోచనల మేరకు ప్రతీ ఏడాది అక్కడ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తుంటాం. మన సంస్కృతిలో భాగంగా ఉగాది పండుగతో పాటు వనభోజనాలు, సంక్రాంతి, సత్యనారాయణ వ్రతాలు, నవరాత్రోత్సవాలు... ఇలా అన్నీ తెలుగు పండుగలు చేస్తుంటాం. క్రిస్మస్, న్యూ ఇయర్ సంబరాలను కూడా ఘనంగా జరుపుకుంటాం. ప్రస్తుతం తెలుగు సమాఖ్యలో 250 కుటుంబాలున్నాయి. తెలుగువారికి ఏలాంటి సహకారం కావాలన్నా సమాఖ్య ముందుంటుంది.



అక్కడి ప్రభుత్వం, ఇండియన్ ఎంబసీలు మంచి సహకారాన్ని అందిస్తున్నాయి.

తెలుగువారు అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాలకు వెళ్తూ ఆరోగ్య సమస్యలతో హాంకాంగ్ ఎయిర్‌పోర్ట్‌లో నిలిచినవారికి మా తెలుగు సమాఖ్య అండగా నిలిచింది. ఆస్పత్రిలో చేరిన పలువురు తెలుగువాళ్లను కలవగానే వారి బాధంత చెబుతారు. ఆస్పత్రిలో వారి కుటుంబీకులు చికిత్స పొందే సమయంలో అక్కడ ఉండే అవకాశం లేకపోవడంతో చాలామందికి మా ఇళ్లలో ఆశ్రయం కల్పించాం. వారికి అండగా నిలిచాం.



స్కూల్ టీచర్‌గా..

నేను హాంకాంగ్‌లోని ఉడ్‌ల్యాండ్ ఇంటర్నేషనల్ ప్రీ స్కూల్‌లో టీచర్‌గా పని చేస్తున్నా. అక్కడంతా ఇంగ్లీష్, చైనీస్ భాషలోనే విద్యా బోధన ఉంటుంది. తెలుగు కుటుంబాల పిల్లలకు నేను తెలుగు బోధిస్తున్నాను. తెలుగు క్లాసులకు చైనీస్ పిల్లలు కూడా వస్తుంటారు. చైనీయులు తెలుగు నేర్చుకోవడానికి కారణమేమిటంటే.. అక్కడ కొంతమంది చైనీయులు కూచిపూడి డ్యాన్స్ నేర్చుకుని ప్రదర్శనలు ఇస్తుంటారు. తెలుగు భాషను నేర్చుకుని భావాలకు అనుగుణంగా నాట్య ప్రదర్శనలు చేస్తున్నారు. అలా ఈ మధ్య కూచిపూడి నేర్చుకున్న డ్యాన్సర్ ఇండియాకు రావడానికి ఇండియన్ ఎంబసీ వీసా నిరాకరించింది. ఈ విషయం తెలిసి ఎంబసీ డైరెక్టర్ జనరల్‌తో మాట్లాడి వీసాను ఇప్పించాం. అలాగే తెలుగువారెవరైనా హాంకాంగ్ వస్తే వారి ఉపాధి వివరాలు తెలుసుకుని వారికి ఉండేందుకు ఇల్లు, పిల్లలకు స్కూలు విషయాల్లో సలహాలిస్తుంటాం. హాంకాంగ్‌లోని ఇండియన్ ఎంబసీలో తెలుగు సమాఖ్య వివరాలున్నాయి.

> **హాంకాంగ్‌లో మెదక్ జిల్లాకు చెందిన వ్యక్తి ప్రమాదానికి గురవ్వగా, అక్కడి ఆస్పత్రిలో వైద్య సేవల నుంచి, అతడిని ఇండియాకు పంపడం దాకా 'హాంకాంగ్ తెలుగు సమాఖ్యే' బాధ్యత తీసుకుంది.**

అమెరికాలో ఉద్యోగం చేస్తున్న అవినాష్, ఆరు నెలల గర్భవతి అయిన తన భార్య రిషికను (పేర్లు మార్చాం) అమెరికా తీసుకెళ్తున్నారు. అనుకోకుండా రిషికకు నొప్పులు ప్రారంభమయ్యాయి. వెంటనే విమానాన్ని హాంకాంగ్ ఎయిర్‌పోర్ట్‌లో దించి ఆస్పత్రికి తరలించారు. నెలలు నిండకుండానే పసిగుడ్డుకు రిషిక జన్మనిచ్చింది. ఐదో నెలలో పుట్టిన పసిబిడ్డను తొమ్మిది నెలలు నిండే వరకు ఆస్పత్రిలోనే ఉంచాలని వైద్యులు సూచించారు. చేసేదేమి లేక భార్యతో కలిసి అవినాష్ అక్కడే ఉన్నారు. దేశం కాని దేశంలో తనకు సాయపడేవారు లేరా! అని ఎదురుచూస్తుండగా 'హాంకాంగ్ తెలుగు సమాఖ్య' ప్రతినిధులు నాలుగున్నర నెలల పాటు వారికి అవసరమైన సహకారం అందించారు.

రేడియో జాకీగా..

హాంకాంగ్‌లో నిర్వహించే పలు కార్యక్రమాలను తెలుగువన్.కామ్ వెబ్‌సైట్‌కు పంపేదాన్ని. ఆ సంస్థ తెలుగువన్ రేడియోకు కార్యక్రమాలను చేయమంది. దాంతో రేడియో జాకీగా మారాను. అలా 'హాయ్ హాంకాంగ్' పేరుతో ఇక్కడి తెలుగు వారి విశేషాలను చెప్పేదాన్ని. తెలుగువన్ రేడియోలో ప్రాచుర్యం పొందిన 'జైహింద్' కార్యక్రమాన్ని హాంకాంగ్ నుంచి నిర్వహిస్తున్నా. భారత జవాన్ల సాహసాలను, వారి త్యాగాలను, పోరాట పటిమను వివరించి వాటి ద్వారా యువత స్ఫూర్తి పొందాలనే ఆలోచనతో 'జైహింద్' కార్యక్రమాన్ని ప్రారంభించాను. పుట్టిన గడ్డకు, మాతృభాషకు ఏదో చేయాలనే తపనతోనే ఇదంతా చేస్తున్నా.

• **బయ్యు దామోదర్**
ఫొటోలు: **అశోకుడు**

లక్ష్యం, సాధనం.. రెండూ వారిద్దరే!

పద్ధెనిమిదో పాశురం


ఉన్దు మదకళిత్త! నోడాద తోళ్వలియన్
నన్ద గోపాలన్ మరుమగళే! నప్పిన్నాయ్!
కన్దమ్ కమళుమ్ కుళలీ! కడై తిరవాయ్
వన్దెఙ్గుమ్ కోళి అళైత్తనకాణ్ మాదవి
ప్పన్దల్ మేల్ పల్ కాల్ కుయిలి నఙ్గల్ కూవినగాణ్
పన్దార్ విరలి! ఉన్ మైత్తునన్ పేర్పాడ
చెన్దామరైక్కైయాల్ శీరార్ వళై యొళిప్ప
వన్దు తిరవాయ్ మగిళిందేలొ రెమ్బావాయ్!

ఈ దివ్య పాశురంలో ఆండాళ్ శ్రీవైష్ణవ ముఖ్య సిద్ధాంతం ఒకటి నిక్షిప్తం చేసింది. ఆ సిద్ధాంతం శ్రీదేవీ, భగవానుడూ అవిచ్ఛిన్నమైన శక్తులనీ (విడదీయ రానివారనీ), చేరవలసిన (ఉపేయం) పరమ లక్ష్యం, చేర్చే (ఉపాయం) సాధనం... రెండూ వారిద్దరేనని ప్రతిపాదించింది. ఈ మౌలిక సిద్ధాంతానికి 'ఏక శేషిత్వం' అని పేరు. ఇది దృష్టిలో పెట్టుకొని నప్పిన్నాయ్‌ని.. అంటే కృష్ణుని దేవేరిని ఆండాళ్ భక్తిపురస్సరంగా మేల్కొల్పుతోంది. నప్పిన్నాయ్ కృష్ణుని మేనమామ కుమార్తె. పోటెక్కిన కోడెలను అదుపు చేసి పందెంలో గెలిచి ఆమెను కృష్ణుడు పరిణయమాడాడు. ఆమె బాహువుల నడుమ సుఖనిద్రలో మునిగిన కృష్ణుణ్ణి మేలుకొలపాలంటే, ముందు నప్పిన్నాయ్ తన కౌగిలి సడలించవలసి ఉంది. కేవలం ఆమె అనుగ్రహిస్తేనే కృష్ణుడు లేవగలడు. అందుకని ఆమెను ప్రార్థించి లేపుతున్నది ఆండాళ్.

"మత్తగజాలను సైతం తన బాహుబలంతో అదుపు చెయ్యగల మహాబలశాలి నందగోపుని కోడలా! యుద్ధభూమిలో అపజయమన్నది ఎరుగని నందగోపుని వీరత్వమే ఆయన కుమారుడు కృష్ణుడు పుణికి పుచ్చుకున్నాడు కాబోలు! ప్రజా కంటకంగా సంచరిస్తున్న కోడెలను నిగ్రహించి నిన్ను గెలుచుకున్నాడు. అంతటి మహాబలశాలినీ, పరాక్రమవంతుడినీ నీ సున్నితమైన బాహుబంధంలో బంధించి ఉంచావు. ఈ గొల్లపిల్లల పట్ల దయతో నీ భర్తను వీడి నిద్దుర లేపవమ్మా!" అని ఆండాళ్ వేడుకుం టోంది.

మేలుకొలుపునకు మధ్యవర్తిత్వం

అలా ప్రాధేయపడినా నప్పిన్నాయ్ స్పందించలేదు. ఆమె అటు ఇటు కదిలింది కాబోలు... శిరస్సున ధరించిన పుష్పమాలలు విరజిమ్మిన పరిమళాలు మందిరం బయటకు ప్రసరించాయి. "అమ్మా! నప్పిన్నాయ్! నీ శిరోజాల పరిమళాలు బయటి దాకా ప్రసరించి నీ ఉనికిని తెలుపుతున్నాయి. కరుణించి కృష్ణుని మేల్కొలపవమ్మా! చూడు, తెల్లవారింది. ఎల్లెడలా కోళ్లు కూతలు పెడుతున్నాయి. నీవు పెంచిన మత్తకోకిలలు నీ రాక కోసం గురివింద పందిళ్ల మీద కూర్చొని కుహూ



చిత్రం: కేశవ్ https://www.facebook.com/keshav61/

మని మధురంగా కూస్తున్నాయి. నీ స్వామిని స్తోత్రం చేస్తున్న ఈ అమాయక గొల్లపడుచుల మీద దయతో లే! నీ ఎర్రకలువల వంటి చేతుల గాజులు సుమధురంగా గలగలమని ధ్వనిస్తుండగా తలుపు తియ్యి తల్లీ ! భోగోపకరణమైన బంతిని చేతుల్లో ధరించినదానా! అలసినావేమో, మా పట్ల దయ చూపి నీ భర్తను లేపి తలుపు తియ్యవమ్మా! అని జాలిగా ఆండాళ్ ప్రాధేయపడుతున్నది.

ఈ అద్భుత పాశురాన్నే 'తిరుప్పావై జీయర్' గా పేరుగాంచిన శ్రీ రామానుజాచార్యులు ఉంఛవృత్తి చేసుకుంటున్నప్పుడు అనుసంధించారట! ఆ ఆనందానుభవంలో తమ ఆచార్యుల కుమార్తె అత్తుళ్ళై తన గాజులు గలగలమంటుండగా భిక్ష సమర్పించానికి తలుపు తియ్యగానే, ఆమెను 'నప్పిన్నపిరాట్టి'గా భావించి బాహ్యస్మృతి కోల్పోయారని ఐతిహ్యం. తిరువారాధన క్రమంలో ఆచార్యుని, నిత్యసూరులైన (వైకుంఠంలో నారాయణుడికి సేవలు చేసేవారైన) అనంత-గరుడ-విష్వక్సేనులను సుప్రభాతసేవలో మేల్కొలిపి, ఆపైన భగవానుని దేవేరిని (పిరాట్టిని) మేల్కొల్పటం జరుగుతుంది. ఈ పాశురంలో నప్పిన్నపిరాట్టిని మేల్కొల్పడం ముగ్గురు నిత్యసూరులను మేల్కొల్పడమే!

కృష్ణావతారంలో కృష్ణుడు గోకులంలో నివసించినంత కాలం నప్పిన్నాయ్ ఆయన ప్రధాన దేవేరిగా, ప్రియతమురాలిగా పూజలందుకున్నది. నప్పిన్నాయ్‌ని నీళాదేవి అవతారంగా పండితులు సంభావించారు. అందువల్ల గోపికలు నప్పిన్నాయ్ పురుషకారాన్ని (మధ్యవర్తిత్వాన్ని) అర్థించారు. ఈ దివ్యపాశురం అపార కారుణ్యమూర్తి నప్పిన్నాయ్‌ని మేల్కొల్పుతూ గోపికలు పాడే మూడు పాశురాలలో రెండవది. భగవానుడిని 'పురుషునిగా' అంటే 'పూర్ణునిగా' తీర్చిదిద్దే తల్లి మహాలక్ష్మి. అందుకే ఆమె చేసే సాయాన్ని 'పురుషకారం' అని సంభావిస్తారు.

"ఉభయవిభూతి నాయకురాలా! నీ సంకల్పానికి ఎటువంటి అడ్డూ లేదు. అయినా మమ్ములను పట్టించుకోకున్నావు! మాకు, భగవానుడికి మధ్య ఏర్పడిన ఆటంకాలను తొలగించి మమ్మల్ని కేశవుని ముందు నిలుపు మాతా! నీవు ఎక్కడికి వెళ్తే అక్కడ సారగ్రాహుల వలె (కోళ్ల వలె) ప్రపత్తి ఆచరిస్తున్నాం. దయ చూడు తల్లీ! వాల్మీకి, శుక శౌనకుల వంటి మహర్షులు వేదోపశాఖలపై కోకిలల్లా కూర్చొని నీ స్వామి కళ్యాణగుణ గానం చేస్తున్నారు. నీ స్వామి చేతిలో లీలోపకారణాల వంటి (ఆటవస్తువుల్లాంటి) మమ్మల్ని భోగోపకారణాలుగా (ఆనందం కలుగజేసేవిగా) మార్చు తల్లీ! నీ స్వామికి మా మీద ఉన్న కోపాన్ని నిగ్రహించి వాత్సల్యాన్ని కలుగజెయ్యి!" అని ఆండాళ్ ప్రార్థిస్తోంది.

ఆండాళ్ తిరువడిగళే శరణం!

• **శ్రీదేవీ మురళీధర్**

నెయ్యి మనకు నేస్తమే!

నెయ్యితో కొవ్వు పెరిగిపోతుందని, అది ఆరోగ్యానికి హానికరమనే ఒక భావన చాలా మందిలో ఉంటుంది. నెయ్యిలో కొవ్వు ఉన్నది నిజమే కానీ, అది కరిగిపోయి శక్తినిస్తుందే తప్ప హానిచేయదు. మేధోశక్తినీ, జ్ఞాపకశక్తినీ పెంచడంలోనూ జీర్ణవ్యవస్థను చక్కదిద్దడంలోనూ నెయ్యి ఎంతో ఉపయోగపడుతుంది. గాయాలను మాన్పడంలోనూ, చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలోనూ నెయ్యి పాత్ర కీలకమే. శరీరంలోని హానికారక ఫ్రీరాడికల్స్‌ను దెబ్బతీసే యాంటీ ఆక్సిడెంట్లు నెయ్యిలో సమృద్ధిగా ఉన్నాయి. పరిమితికి లోబడి తీసుకుంటే నెయ్యితో లాభాలు బోలెడు...



- బీటా కెరోటిన్లకు, ఎ,డి,కె విటమిన్లకు నెయ్యి ఒక నిధిలాంటిది. నెయ్యితో లభించే సహజసిద్ధమైన విటమిన్ ఏ, ఇతర వంటనూనెల్లో లభించేదాని కన్నా ఎంతో నాణ్యమైనది.
- నెయ్యిలో అంతకు ముందున్న పాల తాలూకు అంశాలు, లాక్టోస్, షుగర్లు ఉండవు కాబట్టి పాలు పడని వారు కూడా నెయ్యిని నిస్సందేహంగా తీసుకోవచ్చు.
- శరీరంలోని మలినాలను బయటికి పంపే శక్తి కూడా నెయ్యిలో ఉంది.
- పిల్లల ఎదుగుదలకు తోడ్పడటంతో పాటు నెయ్యి వారి ఏకాగ్రతను, జ్ఞాపకశక్తినీ పెంచుతుంది.
- కాలిన లేదా తెగిన గాయాల పైన నేరుగా కాస్తంత నెయ్యి పూస్తే చాలు మానిపోతాయి.
- నెయ్యిలో సమృద్ధిగా ఉండే యాంటీ ఆక్సిడెంట్లు జీవక్రియలను ఉత్తేజపరచడంతో పాటు, కొలెస్ట్రాల్‌నూ, శరీరం బరువునూ తగ్గిస్తాయి.
- కంటిపై నెయ్యి ఒత్తిడిని తగ్గిస్తుంది. గ్లూకోమా సమస్యను నియంత్రిస్తుంది.

ప్రాణానికి రక్షణగా పాల దంతాలు




సాధారణంగా చాలామంది తల్లులు పిల్లల పాలదంతాలు ఊడిన తర్వాత కాటన్‌లో ఉంచి, గార్డెన్‌లో పూడ్చేస్తారు. అలాకాకుండా వాటిని జాగ్రత్తగా భద్రపరిస్తే, అవి పిల్లల ఆరోగ్యానికి సంజీవనిలా పనిచేస్తాయంటున్నారు పరిశోధకులు.


పళ్లలోని స్టెమ్‌సెల్స్‌ను సేకరించేందుకు ఊడిపోయిన పాల దంతాలు ఎంతో ఉపయోగపడతాయి. స్టెమ్‌సెల్స్‌తో పిల్లలు పెద్దయ్యాక వ్యాధుల బారిన పడకుండా చూసుకోవచ్చు అంటున్నారు. శరీరంలో దెబ్బతిన్న కణాలను భర్తీ చేయడం ఎంతో ముఖ్యం. స్టెమ్‌సెల్స్ వివిధ రకాల కణాలుగా రూపాంతరం చెందుతాయి. పాల దంతాల్లోని స్టెమ్‌సెల్స్‌ను ఉపయోగించి, కొత్త కణాలను ఉత్పత్తి చేయొచ్చు. ఇవి భవిష్యత్తులో ఎదురయ్యే, ప్రాణాంతకమైన వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయి. క్యాన్సర్ వ్యాధి నుంచి బయటపడేందుకు కూడా స్టెమ్‌సెల్స్ ఉపయోగపడతాయని అంటున్నారు పరిశోధకులు.




బి.లక్ష్మి
కూకట్‌పల్లి,
హైదరాబాద్



17 చుక్కలు
3 వరుసలు
3 వచ్చేవరకు



13 చుక్కలు
5 వరుసలు
5 నిలువు



కె.లక్ష్మీ తులసి
రైల్వేకోడూరు, కడప జిల్లా

ముగ్గులు పంపాల్సిన చిరునామా
నవ్య, ముత్యాలముగ్గు,
ఆంధ్రజ్యోతి కార్యాలయం, రోడ్ నెంబర్ 70,
హుడా హైట్స్, జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500033.
ఈ-మెయిల్: navya@andhrajyothy.com



స్టయిల్ మాస్టర్

ట్రెండ్



"నీకు ఎవరితో డేటింగ్ చేయాలని ఉంది?" అని బాలీవుడ్ హీరో సైఫ్ అలీఖాన్ కుమార్తె సారా అలీ ఖాన్‌ను అడిగాడు కరణ్ జోహార్. తడుముకోకుండా సారా చెప్పిన సమాధానం విని అందరూ అవాక్కయ్యారు. సాధారణంగా అమ్మాయిలు రణ్‌బీర్ కపూర్, హృతిక్ రోషన్ పేర్లు చెప్పడం వింటూ ఉంటాం. కానీ సారా అలీఖాన్ 'కార్తీక్ ఆర్యన్' అంటూ ఓ వర్ధమాన హిందీ హీరో పేరు చెప్పింది. అయితే అతని సినీ కెరీర్ వయసు పట్టుమని పదేళ్లు కూడా లేదు. ఇప్పటి వరకూ చేసినవి ఏడు సినిమాలు మాత్రమే. 2011లో విడుదలైన 'ప్యార్ కా పంచనామా' చిత్రంతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టాడు. తాజాగా అతను నటించిన 'సోనూ కె టీటూ కీ స్వీటీ' మంచి విజయం సాధించడంతో మళ్లీ ఫోకస్‌లోకి వచ్చాడు. 'కాఫీ విత్ కరణ్ ' ఆరో సీజన్‌లో తండ్రితో కలిసి ఓ ఎపిసోడ్‌లో పాల్గొన్న సారా సడన్‌గా కార్తీక్ పేరు ఎత్తడం సంచలనంగా మారింది. అంతేకాదు అనుకోకుండా ఓ పెళ్లి వేడుకకు ఈ ఇద్దరూ హాజరయ్యారు. ఆ వేడుకలో పాల్గొన్న హీరో రణవీర్‌సింగ్ ఒకరినొకరికి పరిచయం చేశాడు. ఆ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. అందుకేనేమో కార్తీక్‌కు బాలీవుడ్‌లో ఉన్న క్రేజ్‌ను గమనించి 'కాఫీ విత్ కరణ్' షోకు ఆహ్వానించారు కరణ్ జోహార్. బాలీవుడ్ కథానాయిక కృతీసనన్ ('1 నేనొక్కడినే' ఫేమ్) కూడా అతిథిగా హాజరయ్యారు. ఇక ఆ షోలో పాల్గొన్న కార్తీక్ డ్రెస్సింగ్‌కు నెటిజన్లు ఫిదా అయ్యారు. ఎందుకంటే అతను ధరించిన వెల్వెట్ జాకెట్ ఖరీదుతో మనం నాలుగు సార్లు లండన్ నగరానికి వెళ్లి రావచ్చు. జపాన్‌కు చెందిన లగ్జరీ బ్రాండ్ 'మాస్టర్ మైండ్'కి ప్రపంచ వ్యాప్తంగా ఎంతో పేరు ఉంది. ప్రమాదానికి సంకేతమైన 'పుర్రె' బొమ్మ ఈ కంపెనీ లోగో. ఈ సింబల్ ఉంటే చాలు మాస్టర్‌మైండ్ అని టక్కున గుర్తుపట్టేస్తారు ఫ్యాషన్ ప్రియులు. ఇంతకీ కార్తీక్ ధరించిన జాకెట్ ధర సుమారు రూ.7 వేల డాలర్లు (రూ. 5 లక్షలు).

బెటర్ లైఫ్

ఎన్నేళ్లు గడిచినా ఇంతేనా?

నాకు 27 ఏళ్లు. ఎంబీఏ పూర్తయింది. ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నా. బతకడానికి అది తప్పనిసరి కావడం వల్ల తప్ప ఆ ఉద్యోగం పట్ల నాకు ఆసక్తి లేదు. ఎంతసేపూ అందులో నుంచి ఎప్పుడు బయటపడాలా అనే ఆలోచనే! అయితే, ప్రతి జనవరి ఫస్ట్‌న ఈ సంవత్సరం అద్భుతంగా ఏదో ఒకటి చేయాలనుకుంటాను. ఐదేళ్లుగా ఇలా అనుకుంటూనే ఉన్నా. కానీ, ఒక్క అడుగైనా ముందుకు పడలేదు. ఎప్పటికీ ఇంతేనా? అనే నైరాశ్యం వేధిస్తోంది. ఒక్క ఏడాదిలోనే ఎంతో ఎత్తుకు ఎదిగిన వాళ్లు నా కళ్లముందు ఎందరో ఉన్నారు. నా విషయంలో ఎందుకు అలా జరగడం లేదు?

- ఎన్.రాకేశ్, ఖమ్మం



ఇదేదో మీ ఒక్కరి పరిస్థితి అనుకోవద్దు. ఈ తరహా ఆవేదన సమాజంలోని అత్యధికుల్లో కనిపిస్తుంది. ఆలోచనకూ, ఆచరణకూ మధ్యన ఉండే అగాధమే అందుకు కారణం. కనీసం ఏదో ఒకటి చేయాలన్న తపనైనా మీలో ఉంది. అది అభినందనీయమే. కాకపోతే, ఎంతసేపూ ఆరాట పడటమే తప్ప, అసలు ఏం చేయాలనుకుంటున్నారో మీకు ఇంత వరకూ ఒక స్పష్టత ఉన్నట్టు లేదు. ఆ అస్పష్టతే మీ అడుగు ముందుకు పడకుండా చేస్తోంది. అనుకున్నది వాస్తవరూపం దాల్చడం ఒక సుదీర్ఘ ప్రక్రియ. పకడ్బందీ ప్రణాళిక వేసుకుని, దానికి అనుగుణంగా ముందుకు సాగాలి. ఫలానా పనిచేయాలని పక్కాగా అనుకోకపోవడం మీ సమస్య. అలాగని ఏదో ఒకటి అనేసుకుంటే సరిపోదు. దానికి సంబంధించిన వనరులు సమకూర్చుకొని, సామర్థ్యం పెంపొందించుకోవాలి. అప్పుడే అడుగులు ముందుకు పడతాయి. ఏడాదిలోనే ఎంతో ఎదిగిన వాళ్లు మీ కళ్లముందు ఉన్నారంటున్నారు. ఆ ఎదుగుదల బయటికి కనపడటం ఏడాది నుంచే కావచ్చు. కానీ, దానికి చాలా కాలం క్రితమే బీజం పడి ఉంటుంది. ఇదంతా విషయ పరిజ్ఞానం వల్ల సాధ్యమవుతుంది. ఆ జ్ఞానమే ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది. అది మీ అడుగులు ముందుకు సాగేలా చేస్తుంది. ముందు మీరు ఏం చేయాలనుకుంటున్నారో స్పష్టతకు రండి. అప్పుడే కార్యాచరణ మొదలు పెట్టండి.

- డాక్టర్ ప్రవీణ్‌కుమార్ చింతపంటి
కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్, ట్రాంక్విల్ మైండ్ క్లినిక్, మాదాపూర్, హైదరాబాద్

navya@andhrajyothy.com

సర్వే సారం



'డ్రై' జనవరి!

కొత్త సంవత్సరం వచ్చిందంటే కొత్త ఉషస్సు, కొంగొత్త ఆలోచనలు! గడిచిపోయిన సంవత్సరంలో సాధించలేని పనులను ఈ ఏడాదిలో పూర్తిచేయాలనే పట్టుదలను పెంచి, ప్రేరణ ఇచ్చే ఎనర్జీ డ్రింక్ కూడా. ఆరోగ్యానికి హాని కలిగించే పాత అలవాట్లను మానేసి... కొత్త జీవితానికి శ్రీకారం చుట్టాలని భావిస్తారు చాలామంది. అలాంటి నిర్ణయాల్లో ముఖ్యమైనది మద్యానికి గుడ్‌బై చెప్పడం! ఈ మంచి ఆలోచనేదైనా మీకూ కలిగితే ఇంతకు మించిన సందర్భం మరొకటి ఉండదంటున్నారు 'సర్వే' జనులు. జనవరి మాసమంతా మద్యం ముట్టని వారు ఆ ఏడాదంతా ఇక దాని జోలికి వెళ్లరని అమెరికాకు చెందిన సస్సెక్స్ యూనివర్సిటీ పరిశోధక బృందం. '2018 డ్రై జనవరి ఛాలెంజ్'లో భాగంగా 800 మందిపై జరిపిన అధ్యయన ఫలితాలను వారు వెల్లడించారు. జనవరిలో మందుకు నో చెప్పడం వల్ల ఎక్కువ ఎనర్జీ, చక్కని నిద్రతో పాటు ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు కూడా అలవడతాయని తేల్చారు. జనవరిలో మద్యం సేవించనివారు... ఆగస్ట్ వరకూ మందు ఊసే ఎత్తలేదట! దీంతో చాలామందిలో డబ్బు ఆదాతో పాటు, కంటి నిండా నిద్ర, బరువు తగ్గడం వంటి మార్పులు కనిపించాయట. ఆశ్చర్యకరమైన విషయమేమంటే... నెలలో అన్ని రోజులూ మద్యం సేవించేవారు కూడా ఆల్కహాల్ తీసుకోలేదట.

ఇంజనీరింగ్, ఆ తరువాత పీజీ. మంచి ఉద్యోగం వచ్చింది. కొలువులో కూర్చుని పని మొదలు పెడితే కానీ తెలియలేదు... ప్రోగ్రామింగ్‌లో తామెంత వెనకబడి ఉన్నామో! చదువుకునే రోజుల్లో సబ్జెక్టు సరిగ్గా వంటబట్టించుకోకపోవడమే ఇందుకు కారణమని అర్థమైంది. తమ సమస్య నేటి విద్యార్థులకు రాకూడదని భావించిన ముగ్గురు యువకులు అంకుర సంస్థ 'క్యూటిపై'కి శ్రీకారం చుట్టారు. ఇప్పుడు వందల మంది చిన్నారులను రోబోటిక్స్‌తో మమేకం చేస్తున్న ఆ సంస్థ వెనక ఉన్న ముగ్గురిలో ఒకరైన తెలుగు యువకుడు ఆరె రఘునాథ్ మాటల్లోనే ఆ ప్రయాణం...





వినూత్నం

పిల్లల కోసం రోబోట్రిక్స్

మాది గుంటూరు జిల్లా కాకమాను మండలం అప్పాపురం. నేను గుంటూరులో ఇంటర్ చదువుతున్న రోజుల్లోనే నాన్న నాగేశ్వరరావు మరణించారు. అమ్మ భవాని గృహిణి. అన్నయ్య వ్యవసాయం చేపట్టి కుటుంబానికి అండగా నిలిచాడు. దాంతో బాపట్ల ఇంజనీరింగ్ కాలజీలో ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్‌లో బీటెక్ పూర్తి చేయగలిగాను. 'గేట్'లో మంచి ర్యాంకు రావడంతో బెంగుళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో చేరాను. అక్కడ ఇన్‌స్ట్రుమెంటేషన్‌లో ఎంటెక్ చేశాను.

కొలువులో కొత్త ఆలోచనలు...

ఎంటెక్ తరువాత 'యాహూ'లో ఉద్యోగం వచ్చింది. అక్కడ కొంత కాలం పనిచేసి, మైక్రోసాఫ్ట్‌కు మారాను. ఇక్కడ ఓ విషయం చెప్పాలి... నేను ఎంటెక్ చదివినా ప్రోగ్రామింగ్ సరిగా చేయలేకపోతున్నా. ఉద్యోగంలో చేరాక కానీ అందులో వీక్‌గా ఉన్నానన్న విషయం నాకు అర్థం కాలేదు. నేనే కాదు... యాహూలో పరిచయమైన సహోద్యోగి జర్లిన్ పరిస్థితి కూడా అదే! పైపై చదువులు కాకుండా మూలాలు అర్థం చేసుకోవాలి. ఆ మూలాలు అర్థం కావాలంటే ప్రోగ్రామింగ్‌పై మంచి అవగాహన ఉండాలి. కానీ ఇప్పుడు ఎంతమందికి దానిపై అవగాహన ఉంది? అలాగే ఒక మంచి ఉత్పత్తి ఎంతోమందికి చేరువవుతుందని యాహూలో చేస్తున్నప్పుడే తెలిసింది. అక్కడ మేం అభివృద్ధి పరిచిన ఒక సెర్చ్ ఇంజినే అందుకు ఉదాహరణ. ఈ క్రమంలో మా ఫ్రెండ్ జర్లిన్ కజిన్ జేసిన్ కూడా మాతో జత కలిశాడు. మా ఆలోచనలు పంచుకున్నాడు.

అక్కడే అర్థమైంది...

ఉద్యోగం చేస్తున్న రోజుల్లో ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ల నైపుణ్యాలపై నివేదికలు చదివేవాళ్ళం. ఉద్యోగానికి అవసరమయ్యే నైపుణ్యం వారిలో చాలా తక్కువగా ఉందని ప్రతి నివేదికలోనూ చూశాం. ముఖ్యంగా కమ్యూనికేషన్, కంప్యుటేషన్ స్కిల్స్ అవసరమైన మేర లేవని తేలింది. మూడు మూళ్ళు తొమ్మిది అని చెప్పడం వెనక ఉన్న ప్రోగ్రామింగ్ తెలిస్తే లెక్కలు మరింత సులువు అవుతాయి. అసలు ఆ స్థాయి నుంచే ప్రతీది లోతుగా తెలుసుకునే విధంగా పిల్లలను ప్రోత్సహిస్తే ప్రోగ్రామింగ్, తద్వారా సృజనాత్మకత పెరుగుతుందనిపించింది. దాంతో ఆ దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టాం.

ప్రోగ్రామింగ్‌పై అవగాహన...

ఆ తరువాత అపార్టుమెంట్లలో కొందరు పిల్లను కలిసి ప్రోగ్రామింగ్‌పై అవగాహన కల్పించే ప్రయత్నం చేశాం. అయితే ఆ అవసరాన్ని గుర్తించేలా చేయడం మావల్ల కాలేదు. ప్రత్యామ్నాయంపై చేస్తున్న ఆలోచనలో భాగంగా ఆటలతో పిల్లలను ఆకట్టుకోగలమనిపించింది. ఆ వయస్సులో పిల్లలకు ఆటలపైనే ఆసక్తి. ఆటతో మొదలుపెట్టి ప్రోగ్రామింగ్ దిశగా మరల్చాలని నిర్ణయించాం. కారును రూపొందించడం ఒక ఆట అనుకుంటే, అందుకు మెటీరియల్ ఏమిటి అన్న విషయమై తర్జనభర్జన చేశాం. మార్కెట్లో ఏదైనా మెటీరియల్ అవసరమైనది ఉందా అని వాకబు చేశాం. చాలా రకాలు సేకరించాం. అయితే అవన్నీ ఒక నిర్దేశిత మోడల్ ప్రకారం రూపొందించేందుకు ఉపకరించేవే కావడంతో నిరుత్సాహపడ్డాం.

బ్లాక్స్‌తో ప్రయోగం...

చివరకు ఏ వస్తువునైనా రూపొందించేందుకు అనువైన విధంగా బ్లాక్స్ రూపొందించాం. పద్నాలుగు బ్లాక్స్‌తో పిల్లలు తమ ఆలోచన మేరకు వస్తువులను రూపొందించుకోవచ్చనే విషయం గ్రహించాం. వస్తువు రూపొందుతుంది సరే... దాని కదలిక మాటేమిటి. కూర్చుకున్న కారు కదలాలంటే ప్రోగ్రామింగ్ అవసరం. అలా ప్రోగ్రామింగ్ వైపు పిల్లల మనసు మళ్లేలా చూడగలిగాం. కుడి, ఎడమ వైపు తిరగాలి, వేగం పెంచుకోవాలి. సడన్‌గా ఆపాలి. ఇలా అన్నింటికీ ప్రోగ్రామింగ్ అవసరం. సరైన ప్రోగ్రామింగ్ రాసుకుని, ఆండ్రాయిడ్ ఫోన్‌తో... తయారు చేసిన వస్తువులో కదలిక తేవచ్చు. ఇలా సక్సెస్ అయ్యాం. కర్ణాటకలో మొదలుపెట్టి ఇప్పుడిప్పుడే తెలుగు రాష్ట్రాల్లోకి వస్తున్నాం.

ఇదీ 'క్యూటిపై'...

'క్విక్ టు ప్రోటోటైప్ ఐడియా' (క్యూటీపీఐ/ క్యూటిపై) పేరిట ఏర్పాటైన అంకుర సంస్థ. రోబోటిక్స్‌తో సబ్జెక్టు అర్థమయ్యే విధానానికి శ్రీకారం చుట్టాం. పద్నాలుగు వేర్వేరు డిజైన్లతో అనుకున్న వస్తువును రూపొందించుకోవచ్చు. చేసిన వస్తువు పని చేసేందుకు ఎలక్ట్రానిక్ ప్రాసెసర్‌తో అనుసంధానం కూడా ఇందులో భాగమే. ఈ విధానంలో ప్రోటోటైప్ అంటే బేసిక్స్ మాత్రమే. ఉదాహరణకు కారునే తీసుకుంటే ప్రోటోటైప్ మాదిరిగానే కాకుండా విద్యార్థి తన ఆలోచనలకు దగ్గరకు మరొకటి రూపొందించవచ్చు. ఒంటబట్టించుకున్న పరిజ్ఞానంతో ప్రయోగాలు, మెరుగైన ఫలితాల సాధన లెర్నింగ్ ప్రాసెస్‌లో భాగం. దానికి అనుగుణంగా ప్రోగ్రామింగ్‌పై అవగాహన కల్పిస్తూ, ఆలోచనలకు రూపం ఇచ్చేలా తీసుకువచ్చిందే 'క్యూటిపై'. స్టెమ్(సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మేథ్స్) విధానంపై దృష్టిపెడుతూనే విశ్లేషణాత్మకంగా ఆలోచించేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నాం.

వెనకడుగు వేయలేదు...

మైక్రోసాఫ్ట్‌లో మంచి జీతం, అమెరికా ఛాన్సు వదులుకుని ఇదేం పని అని సహోద్యోగులు, స్నేహితులే కాదు... కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. వద్దని వారించారు. కొందరైతే అవహేళనగా మాట్లాడారు. అయినా మేం వెనకడుగు వేయలేదు. మా ప్రొడక్ట్‌పై మాకు విశ్వాసం. మొదట్లో ఏడు వందల మందిని ఆకట్టుకోగలిగాం. ఇప్పుడు ఆ సంఖ్య ఏడు వేలకు చేరింది. అందుకు రెండున్నరేళ్లు పట్టింది. ఇప్పటికి లాభాలు కాదు కదా, జీతం కూడా తీసుకోవటం లేదు. అయినప్పటికీ సక్సెస్ మా ముందు కనిపిస్తోంది. రాబోయే రెండేళ్లలో మా ఉత్పత్తి 75వేల మందికి చేరువ కాగలదని భావిస్తున్నాం. ఒకప్పుడు వెబ్‌సైట్లకే పరిమితమైన ఈ వ్యవహారాన్ని ఆధునిక సాంకేతికత సహాయంతో పోర్టల్స్ మొదలుకుని పరికరాలతో వివిధ రూపాల్లో లెర్నింగ్ ప్రాసెస్‌ను పరిపుష్టం చేస్తున్నాం. ఆ క్రమంలో సరికొత్తగా ముందుకు వచ్చినదే రోబోటిక్స్ మెథడ్! కర్ణాటకలో మంత్రులు కూడా మా వర్క్‌పై ఆసక్తి కనబరుస్తున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో...

కర్ణాటకలో పేరున్న పాఠశాలలకు మొదట దీన్ని పరిచయం చేశాం. ప్రస్తుతం ఏపీ, తెలంగాణలోని పాఠశాల్లోనూ ప్రవేశపెడుతున్నాం. ఏపీలో భాష్యం స్కూల్స్, హైదరాబాద్‌లో జూబ్లీ పబ్లిక్ స్కూల్ వంటివి దీన్ని అడాప్ట్ చేసుకున్నాయి. సైన్స్, మేథమెటిక్స్ పాఠాలను సులువుగా ఆకళింపు చేసుకునేందుకు ఈ విధానం ఉపయోగపడుతుంది. మేమే కొన్ని బృందాలను ఏర్పాటు చేసి, తర్ఫీదు ఇస్తున్నాం. ఇందుకోసం ఒక్కో విద్యార్థి నుంచి ఏటా రూ.2.200 వసూలు చేస్తున్నాం. మొత్తం కిట్ రూ.15వేలు. వ్యక్తిగతంగా కొనుగోలు చేసేవారికి పరిమిత పరికరాలతో రూ.6 వేలకు కిట్ అందిస్తున్నాం.

కొత్త బండి గురూ!

ఈ స్పీడ్‌కు బ్రేక్‌లు లేవు

వేగానికి వేగం... లుక్‌కు లుక్... హైఎండ్ బైక్‌ల సొంతం. వీటిపై మనసు పారేసు కొనే కుర్రకారు జోష్‌ను ఈ కొత్త సంవత్సరంలో రెట్టింపు చేసేందుకు సిద్ధమైంది హోండా కంపెనీ. 2019లో తమ సీబీయూ (కంప్లీట్ బిల్ట్ యూనిట్)ను ఆవిష్కరించబోతోంది. ఈ సీబీయూ లైనప్‌లో సీబీ1000ఆర్+, గోల్డ్ వింగ్ టూర్ డీ డీసీటీ, సీబీఆర్ 1000ఆర్ఆర్ ఫైర్‌బ్లేడ్ ఉన్నాయి. ఇప్పటికే ఎక్స్‌క్లూజివ్ వింగ్ వరల్డ్ సేల్స్ అండ్ సర్వీస్ అవుట్‌లెట్స్ వద్ద బుకింగ్స్ ప్రారంభించింది. యువతరమే టార్గెట్‌గా వస్తున్న ఈ నవ తరం బైక్స్‌పై ఓ లుక్కేద్దాం రండి...



హోండా సీబీఆర్ 1000ఆర్ఆర్ ఫైర్‌బ్లేడ్

హోండా సీబీఆర్1000 ఆర్ఆర్ ఫైర్‌బ్లేడ్‌లో 'వీలీ కంట్రోల్ సిస్టమ్' పరిచయం చేశారు. ఇది అత్యధిక భద్రత, యాక్సెలరేషన్ అందిస్తుంది. అంతేకాదు... ఎలక్ట్రిక్ నియంత్రణ తరువాత టైమ్ లాగ్‌ను సైతం గణనీయంగా తగ్గించడం వల్ల అత్యధిక వేగం వద్ద అత్యుత్తమ నియంత్రణ సైతం లభిస్తుంది. 1000 సీసీ ఇన్-లైన్ 4-సిలిండర్ ఇంజిన్ గరిష్ఠంగా 13వేల ఆర్‌పీఎం వద్ద 141 కిలోవాట్లు; 11వేల ఆర్‌పీఎం వద్ద 114ఎన్ఎం టార్క్‌ను అందిస్తుంది. ఇది సిక్స్ స్పీడ్ ట్రాన్స్‌మిషన్‌తో పనిచేస్తుంది. ఫుల్ కలర్ టీఎఫ్‌టీ లిక్విడ్ క్రిస్టల్ డాష్‌ను ఫైర్‌బ్లేడ్ ఉపయోగించుకోవడం వల్ల స్పష్టంగా సమాచారం రైడర్‌కు లభిస్తుంది. నూతన హోండా సీబీఆర్ 1000 ఆర్ఆర్ ఫైర్‌బ్లేడ్ రెండు రంగులు- గ్రాండ్ ప్రిక్స్ రెడ్, మాట్ బాలిస్టిక్ బ్లాక్ మెటాలిక్‌లో లభిస్తుంది. సీబీఆర్ 1000ఆర్ఆర్ ఫైర్‌బ్లేడ్ ధర రూ.16.43 లక్షలు. అలాగే ఇందులో మరో వెర్షన్ సీబీఆర్ 1000 ఆర్ఆర్ ఫైర్‌బ్లేడ్ ఎస్‌పీని కూడా హోండా తెస్తోంది. దీని ధర రూ.19.28 లక్షలు.

గోల్డ్ వింగ్ టూర్ డీ సీటీ

టూరింగ్ బైక్ అంటే ఇలానే ఉండాలనేలా హోండా గోల్డ్ వింగ్ రూపుదిద్దుకుంది. 2019 గోల్డ్ వింగ్ అథ్లెటిక్‌గా కనిపిస్తుంది. ఇందులో ఎలక్ట్రిక్ విండ్ స్క్రీన్ ఉంది. దీనిని ఎత్తు, యాంగిల్ కోసం మార్చుకొనే వీలుంది. దీంతోపాటు టూరింగ్ బైక్ ఫీచర్లను అందిస్తుంది. సాధారణంగా కార్లలో కనిపించే యాపిల్ కార్ ప్లే ఇంటిగ్రేషన్, యాంటీ లాక్ బ్రేక్స్ (ఏబీఎస్) స్టాండర్డ్ ఫీచర్లున్నాయి. ఈ ఫీచర్లు రైడర్లకు ప్రణాళిక చేసుకోవడానికి, అత్యంత సులభంగా సవారీ చేయడానికి అవకాశాన్ని కల్పిస్తాయి. సులభంగా వినియోగించే కంట్రోల్స్‌ను సెంట్రల్ కన్సోల్, హ్యాండిల్ బార్‌పై అమర్చింది. మారిన రోడ్డు పరిస్థితుల్లో కూడా సౌకర్యంగా సవారీ చేసే అవకాశం కల్పిస్తుందీ బైక్. దీనిలో 1833సీసీ ఫ్లాట్ 6-సిలిండర్ ఇంజిన్ గరిష్ఠంగా 92.7 కిలోవాట్ల శక్తిని 5500 ఆర్‌పీఎం వద్ద, 4500 ఆర్‌పీఎం వద్ద 170 ఎన్ఎం టార్క్‌ను అందిస్తుంది. 4-రైడ్ మోడ్స్ ఇంజిన్‌తో పాటు సస్పెన్షన్, కంబైన్డ్ బ్రేక్ సిస్టమ్ (సీబీఎస్) వంటివి ఎంచుకున్న మోడ్‌కు అనుగుణంగా మారుతుంటాయి. డీసీటీ (డ్యూయల్ క్లచ్ టెక్నాలజీ)లో 7-స్పీడ్స్, హిల్ స్టార్ట్ అసిస్ట్ (హెచ్ఎస్ఏ), ఐడల్ స్టాప్ వంటి ఫీచర్లూ ఉన్నాయి. రెడ్ కలర్‌లో లభిస్తున్న ఈ బైక్ ధర రూ.27.79 లక్షలు.





హోండా సీబీ1000ఆర్+

జపనీస్ కళాత్మక నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తూ హోండా సీబీ1000 ఆర్+ ఆకర్షణీయంగా ముస్తాబైంది. దీన్ని నియో స్పోర్ట్స్ కేఫ్ డిజైన్‌గా హోండా చెబుతుంది. కానీ... విలాసవంతమైన ప్యాకేజీలో చక్కటి పని తీరు, శైలి కోరుకునే రైడర్ల కోసం రూపకల్పన చేసినట్లుగా డిజైన్ కనిపిస్తుంది. కంపాక్ట్ శైలి ఎలిమెంట్స్ వాహనానికి మరింత లుక్‌నిస్తాయి. ఐకానిక్ ఫ్రంట్ ఎల్ఈడీ ఈ తరహా బైక్‌ల్లో సరికొత్త శైలికి మార్గమూ చూపవచ్చు. వెనుక వైపు ఫెండర్‌పై అమర్చిన స్వింగ్ ఆర్మ్‌కు తోడు నెంబర్ ప్లేట్ బైక్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చాయి. దీని నాలుగు సిలిండర్ల ఇంజిన్ గరిష్ఠ శక్తి 107 కిలోవాట్‌ను 10500 ఆర్‌పీఎం వద్ద, 104 ఎన్ఎం టార్క్‌ను 8250 ఆర్‌పీఎం వద్ద అందిస్తుంది. క్విక్ షిఫ్టర్, హీటెడ్ గ్రిప్స్, విస్తృత శ్రేణిలో ప్రీ-ఫిట్ ప్రీమియం యాక్సెసరీలైన మెటాలిక్ మీటర్ విజర్, సీల్‌కౌల్, ఫ్రంట్ ఫెండర్ ప్యానెల్, హగ్గర్ ప్యానెల్, రేడియేటర్ గ్రిల్ వంటివి ఉంటాయి. నూతన సీబీ1000ఆర్+ పూర్వమోడల్ డిజైన్ కన్నా తేలిగ్గా ఉన్నప్పటికీ పవర్ టు వెయిట్ రేషియో మాత్రం బాగా పెరిగింది. గ్రాఫైట్ బ్లాక్‌కలర్‌తో వస్తున్న దీని ధర రూ.14.46 లక్షలు (ఎక్స్‌షోరూమ్-ఢిల్లీ).

సెలబ్ స్టయిల్

అందాల దేవత

క్యాట్రియోనా గ్రే... గత ఏడాది విశ్వసుందరి కిరీటం అందుకున్న ఫిలిప్పీన్స్ బ్యూటీ. 'మిస్ యూనివర్స్' ఫైనల్స్‌లో ఆమె ధరించిన రెండు డ్రెస్‌లు అందర్నీ ఆకట్టుకున్నాయి. విశేషమేమిటంటే ఫిలిప్పీన్స్ సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్‌తో మ్యాక్ టుమాంగ్ వీటిని రూపొందించారు. ఈ రెండింటిలో రెడ్ కలర్ గౌన్ ఒకటి చూపరులను బాగా ఆకర్షించింది. ఈ గౌన్ వెనుక ఓ కథ ఉంది. ఫిలిప్పీన్స్‌లో మయోన్ అనే అగ్నిపర్వతం ఉంది. ఇదొక యాక్టివ్ వ్యాల్కెనో. ప్రశాంతంగా ఉన్నప్పుడు ఎంత అందంగా ఉంటుందో, ఇది బద్దలై, లావా ఎగిసి పడుతున్నప్పుడు కూడా అంతే అద్భుతంగా ఉంటుంది. క్యాట్రియోనా ధరించిన గౌన్‌కి ఆ లావా ఎగిసిపడుతున్న దృశ్యాలే స్ఫూర్తిగా నిలిచాయని మాక్ టుమాంగ్ తెలిపారు. ఫిలిప్పీన్స్ పురాణాల్లోని 'దరగాంగ్ మగయాన్' అనే దేవత పేరు నుంచి వచ్చిందే మయోన్. అందుకే గ్రేను కూడా ఆ అందాల దేవతతో పోలుస్తున్నారు నెటిజన్లు.



డైలీ సుడోకు - 413

		5			7		6	
2			9	5	6	4		
	4	6						
8		2	4			6		7
4				6				3
5		1			3	2		4
						3	1	
		4	8	1	9			6
	7		6			9		

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 412 సమాధానం

8	9	2	7	4	1	6	5	3
1	7	6	5	3	9	2	4	8
3	4	5	6	8	2	7	9	1
6	5	1	2	7	4	8	3	9
9	2	3	1	6	8	4	7	5
7	8	4	3	9	5	1	6	2
5	6	9	8	1	7	3	2	4
4	1	7	9	2	3	5	8	6
2	3	8	4	5	6	9	1	7

ఆవిరి... దెయ్యమా?



'వినయ విధేయ రామ'లో కియారా అద్వాణీ, రామ్‌చరణ్



హారర్ చిత్రాలు తీయడంలో రవిబాబుది అందెవేసిన చేయి! 'అనసూయ', 'అమరావతి', 'అవును', 'అవును 2' చిత్రాలతో... భయపడి వినోదం పొందాలనుకునే ప్రేక్షకులను అలరించారు. మరోసారి హారర్ చిత్రం తీయడానికి ఆయన సన్నాహాలు చేస్తున్నారని సమాచారం! నూతన సంవత్సరం సందర్భంగా ఫ్లయింగ్ ఫ్రాగ్స్ పతాకంపై తన స్వీయ దర్శకత్వంలో 'ఆవిరి' చిత్రాన్ని తెరకెక్కించనున్నట్టు రవిబాబు ప్రకటించారు. కాన్సెప్ట్ పోస్టర్‌నూ విడుదల చేశారు. అందులో ఓ గాజు సీసాలో బంధించిన అమ్మాయి... కాస్త తెరచిన మూతలోంచి ఆవిరి బయటకు వెళ్తున్నట్లుంది. ఇది హారర్ చిత్రమనీ, ఆ అమ్మాయి ఆత్మ అని కృష్ణానగర్ ఖబర్! మరికొన్ని రోజుల్లో నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలు వెల్లడిస్తామని రవిబాబు తెలిపారు.

'కల్కి' కదిలాడు



రాజశేఖర్

'పి.ఎస్.వి.గరుడవేగ' వంటి సూపర్‌హిట్ తర్వాత రాజశేఖర్ నటిస్తున్న చిత్రం 'కల్కి'. 'అ!' దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న ప్రశాంత్‌వర్మ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సి.కల్యాణ్, శివానీ రాజశేఖర్, శివాత్మిక రాజశేఖర్ నిర్మాతలు. ఆదాశర్మ, నందితా శ్వేత కథానాయికలు. మంగళవారం ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను రాజశేఖర్ ట్విట్టర్ వేదికగా విడుదల చేశారు. 'కల్కి' ఫస్ట్ అవతార్‌ను విడుదల చేయడం ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. 1983 బ్యాక్‌డ్రాప్‌లో ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్నారు. ఈ మోషన్ పోస్టర్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేసి 'కదిలినాడు కల్కి' అని రాసుకొచ్చారు దర్శకుడు ప్రశాంత్ వర్మ. నాజర్, అశుతోష్ రానా కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: దాశరథి శివేంద్ర, సంగీతం: శ్రవణ్ భరద్వాజ్.

తెలుగు 'బర్ఫీ'లో?



తెలుగు ప్రేక్షకులకు హిందీ బర్ఫీ రుచి చూపించడానికి నాగచైతన్య అంగీకరించారని ఫిల్మ్‌నగర్ టాక్! ఆయుష్మాన్ ఖురానా, రాజకుమార్ రావ్ హీరోలుగా, 'వన్ నేనొక్కడినే' ఫేమ్ కృతి సనన్ హీరోయిన్‌గా నటించిన హిందీ హిట్ 'బరేలీ కి బర్ఫీ'. ఈ సినిమా తెలుగు రీమేక్ హక్కులను రచయిత కోన వెంకట్‌కి చెందిన కోన ఫిల్మ్ కార్పొరేషన్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ సొంతం చేసుకున్నాయి. ఇందులో ఓ హీరోగా నాగచైతన్య నటించనున్నట్టు, నిర్మాతల ప్రతిపాదనకు ఆయన అంగీకరించినట్టు సమాచారం! ప్రస్తుతం తెలుగు ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టు కోన వెంకట్ కథలో మార్పులు చేస్తున్నారట! త్వరలో పూర్తి వివరాలు వెల్లడించనున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం నాగచైతన్య 'మజిలీ', 'వెంకీమామ' చిత్రాల్లో నటిస్తున్నారు. అవి పూర్తి కాగానే ఈ సినిమా పట్టాలు ఎక్కే అవకాశం ఉంది. ఇప్పుడు నాగచైతన్య, సమంత అమస్టర్‌డామ్‌లో ఉన్నారు. కొత్త ఏడాదికి అక్కడ స్వాగతం పలికారు.

ఆడ పులి!



నయనతార

నయనతార నటించిన మలయాళ చిత్రం 'ఎలెక్ట్రా' చిత్రాన్ని 'లేడీ టైగర్' పేరుతో ఈ నెల 4న తెలుగులో విడుదల చేస్తున్నారు నిర్మాత సురేశ్ దూడల. సి.ఆర్. రాజన్ సమర్పణలో సురేశ్ సినిమా పతాకంపై విడుదల కానున్న ఈ చిత్రంలో ప్రకాశ్‌రాజ్, మనీషా కొయిరాల, బిజూ మీనన్ ప్రధాన పాత్రల్లో నటించారు. నిర్మాత సురేశ్ దూడల మాట్లాడుతూ "నయనతార అభిమానులకు పండుగలాంటి చిత్రమిది. మనీషా కొయిరాల నటన, ప్రకాశ్‌రాజ్ ద్విపాత్రాభినయం చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి" అన్నారు. ఈ చిత్రానికి శ్యామ్‌ప్రసాద్ దర్శకుడు.

కన్నుమూసిన బాలీవుడ్ దిగ్గజం



ఖాదర్‌ఖాన్

పాత సంవత్సరం వెళ్లిపోతూ ఓ ప్రతిభాశాలిని తన వెంట తీసుకుపోయింది. నటుడిగా, మాటల రచయితగా దాదాపు రెండు దశాబ్దాల పాటు హిందీ చిత్రరంగంలో ఓ వెలుగు వెలిగిన ఖాదర్‌ఖాన్ (81) సోమవారం సాయంత్రం తుది శ్వాస విడిచారు. కొంతకాలంగా ఆయన శ్వాసకోస వ్యాధితో బాధపడుతున్నారు. ఈ విషయాన్ని ఖాదర్ ఖాన్ కుమారుడు సర్ఫరాజ్ వెల్లడించారు. కుటుంబ సభ్యులంతా కెనడాలోనే ఉండటం వల్ల అంత్యక్రియలు ఇక్కడే జరుపుతామని ఆయన తెలిపారు. అఫ్గానిస్థాన్‌లోని కాబూల్‌లో జన్మించిన ఖాదర్ ఖాన్ 1970 నుంచి 1975 మధ్యకాలంలో ఓ ఇంజనీరింగ్ కాలేజ్‌లో లెక్చరర్‌గా పనిచేశారు. ఆ కాలేజ్‌లో జరిగిన ఓ ఫంక్షన్‌లో ఖాన్ వేసిన నాటకం చూసి దిలీప్‌కుమార్ ఆయన్ను పిలిపించి తన తర్వాతి చిత్రంలో అవకాశం ఇప్పించారు. ఆ తర్వాత 1973లో 'ధాగ్' చిత్రంతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టి 300లకు పైగా చిత్రాల్లో నటించారు. 250పైగా సినిమాలకు డైలాగులు రాశారు. మాటల రచయితగా ఆయన మొదటి సినిమా 'జవానీ దివానీ'. 1974లో 'రోటీ' చిత్రానికి డైలాగ్‌లు రాసినందుకు హీరో రాజేశ్ ఖన్నా, దర్శకుడు మన్మోహన్‌దేశాయి లక్షా ఇరవై ఒక్క వెయ్యి రూపాయలు పారితోషికంగా ఇవ్వడం ఆ రోజుల్లో చర్చనీయాంశమైంది. హాస్య పాత్రలకు పేరుగాంచిన ఖాన్, దర్శకుడు డేవిడ్ ధావన్ సినిమాల్లో ఎక్కువగా నటించారు. కడుపుబ్బ నవ్వించే పాత్రలనే కాదు సాఫ్ట్ విలనీ పాత్రలనూ ఆయన పోషించి మెప్పించారు. అమితాబ్‌తో పాటు రాజేశ్ ఖన్నా, జితేంద్ర, ఫిరోజ్ ఖాన్, అనిల్ కపూర్, గోవిందా తదితర ప్రముఖ నటులతో ఆయన స్క్రీన్ షేర్ చేసుకున్నారు. తెలుగు చిత్ర ప్రముఖులు కోవెలమూడి బాపయ్య, దాసరి నారాయణరావు, రాఘవేంద్రరావు, తాతినేని రామారావు తదితరులు హిందీలో తీసిన చిత్రాలకు ఆయనే సంభాషణలు రాశారు. 2001లో సొంతంగా 'హస్నామత్'తో హాస్యం ప్రధానమైన టీవీ సిరీస్ మొదలుపెట్టారు. 'మస్తీ నహీ సస్తీ' హిందీలో ఆయన నటించిన చివరి చిత్రం.


ఖాదర్ ఖాన్ మరణం మనసుకి ఎంతో బాధ కలిగించింది. మా కాంబినేషన్‌లో 'అమర్ అక్బర్ ఆంటోని', 'ముకద్దర్ కా సికిందర్', 'గంగా జమున సరస్వతి', 'కూలీ', 'లావరీస్', 'దేశ్ ప్రేమి', 'సుహాగ్', 'పర్వరీశ్' వంటి హిట్ చిత్రాలొచ్చాయి. గొప్ప స్టేజ్ ఆర్టిస్ట్ ఆయన. రచయితగా ఆయన ప్రతిభను మాటల్లో చెప్పలేను. మంచి మిత్రుణ్ణి కోల్పోయా. ఖాన్ ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నా" అని అమితాబ్ బచ్చన్ ట్విట్టర్‌లో రాసుకొచ్చారు.

మంచి మిత్రుణ్ణి కోల్పోయా

- కె.బాపయ్య



ఖాదర్‌ఖాన్ మంచి రచయిత, నాకు మంచి మిత్రుడు కూడా. నేను దర్శకత్వం చాలా హిందీ చిత్రాలకు రచయితగా, నటుడిగా పనిచేశారు. స్టేజీ నుంచి వచ్చిన వ్యక్తి కావడంతో ఎమోషనల్ డైలాగులు బాగా రాసేవారు. కాకపోతే ఆయన లెంగ్త్రీ డైలాగులు రాసేవారు. పది డైలాగుల్లో చెప్పాల్సిన విషయాన్ని నాలుగు మాటల్లో క్లుప్తంగా, పవర్‌ఫుల్‌గా చెబితే బాగుంటుందని సూచించేవాడిని. జంట రచయితలు సలీమ్-జావేద్ రచనాశైలిని పరిశీలించమని చెప్పేవాడిని. నా మాట పాటించేవారు. దర్శకుడికి ఏం కావాలో దానికి అనుగుణంగా మెలిగిన వ్యక్తి. నిర్మాతలను ఇబ్బంది పెట్టని రచయిత, నటుడు. ఇతరుల విషయాల్లో జోక్యం చేసకొనేవాడు కాదు. తన పని తప్ప మిగిలిన విషయాల గురించి ఆలోచించ లేదెప్పుడూ. మనిషికి కొంచెం కోపం ఎక్కువ కానీ దాని ప్రభావం ఇతరుల మీద పడకుండా జాగ్రత్త పడేవారు. తను రచన చేసే సినిమాల్లో ఖాదర్‌ఖాన్ నటించేవారు. అయితే 'తన పాత్రలకు పెద్ద డైలాగులు, పవర్‌ఫుల్ డైలాగులు రాసుకొని, మిగిలిన పాత్రలకు అంత ప్రాధాన్యం లేని డైలాగులు రాసేవారని కంప్లయింట్ ఆయన మీద ఉండేది కానీ నా సినిమాల్లో ఎప్పుడూ అలా చేయలేదు. బాగా చదువుకొని వచ్చిన వ్యక్తి కావడంతో క్రమశిక్షణతో మెలిగేవారు. ఒక మంచి మిత్రుణ్ణి కోల్పోయినందుకు బాధగా ఉంది'




మృణాల్ సేన్

నివాళి..

భారతీయ సినిమాకు అంతర్జాతీయంగా ఖ్యాతి తెచ్చిన ముగ్గురు బెంగాలీ చిత్ర ప్రముఖుల్లో మృణాల్ సేన్ (1923-2018) ఒకరు. మిగిలిన ఇద్దరు సత్యజిత్ రాయ్, రుత్విక్ ఘటక్. బెంగాలీ, హిందీ సినిమాలతో పాటు ఒకే ఒక్క తెలుగు చిత్రానికి మృణాల్‌సేన్ దర్శకత్వం వహించారు. ఆ సినిమా 'ఒక ఊరికథ'. అందులో హీరోగా నటించిన నారాయణరావు, ఆ చిత్రానికి అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేసిన ముత్యాల సుబ్బయ్య మృణాల్ సేన్‌తో తమకున్న అనుబంధాన్ని వివరించారిలా...

నెల రోజుల్లో 18 కిలోలు తగ్గా!

-నారాయణరావు



- మృణాల్ సేన్‌గారు దర్శకత్వం వహించిన 'మృగయా' చిత్రం మా అన్నయ్య ఆధ్వర్యంలో రూపుదిద్దుకొంది. అందుకే పరంధామరెడ్డిగారు ఆయనతో తెలుగులో సినిమా తీయాలనుకొన్నప్పుడు మా అన్నయ్య సహకారం అభ్యర్థించారు. 'ఒక ఊరి కథ' సినిమాలో నటించాలని కానీ, నటిస్తానని కానీ నేను అనుకోలేదు. ప్రొడక్షన్ సైడ్ ఆయనకు హెల్ప్ చేయాలనుకున్నాం అంతే. రియలిస్టిక్ ఎప్రోచ్‌తో నిర్మించే ఈ చిత్రంలో కమల్‌హాసన్ హీరో పాత్రకు బాగుంటాడని ఆయన్ని మృణాల్ సేన్ దగ్గరకు తీసుకెళ్లా. అయితే ఆ పాత్రకు భిన్నంగా, లావుగా కమల్ ఉండటంతో మృణాల్ వద్దనేశారు. ఆ తర్వాత రకరకాల పేర్లు అనుకున్నాం. ఎవరూ మృణాల్ సేన్‌కు నచ్చలేదు. ఒకరోజు అనుకోకుండా ఆయన నేను నటించిన 'నిజం' చిత్రం రషెస్ చూశారు.
- ఆ తర్వాత ఏమనుకున్నారో ఏమో ఉన్నట్లుండి 'అవునూ.. ఆ వేషం నువ్వెందుకు వేయకూడదూ' అని అడిగారు. నేను మనసులో చాలా హ్యాపీగా ఫీలయ్యా. 'మీరు వెయ్యమంటే వేస్తాను సార్' అన్నాను. 'నువ్వు ఓకే.. కానీ బాగా సన్నబడాలి' అని కండీషన్ పెట్టారు. నేను వెనక్కి తగ్గలేదు. 'సన్నబడతాను సార్.. కాకపోతే కొంచెం టైమ్ ఇవ్వాలి' అన్నాను. 'సరే.. నెల రోజులు టైమ్ ఇస్తా తీసుకో' అన్నారు. ఆ నెల రోజుల్లో 18 కిలోలు తగ్గాను. చొక్కా తీస్తే ఎముకలు కనిపించేలా ఉండాలని ఆయన అనడంతో అచ్చం అలాగే తయారయ్యాను.
- ఒక ఊరి కథ' చిత్రం మున్షీ ప్రేమ్‌చంద్ రాసిన 'కఫన్ కథ ఆధారంగా రూపుదిద్దుకొంది. నాకు తండ్రిగా కన్నడ నటుడు వాసుదేవ రావు నటిచచారు. పండిట్ రవిశంకర్ సోదరుడు ఉదయశంకర్ కుమార్తె మమతా శంకర్ నాకు భార్యగా నటించారు. 'మృగయా'లో కూడా ఆమే హీరోయిన్‌గా నటించారు. హైదరాబాద్‌లోని రంగస్థల నటులకు అవకాశం ఇచ్చారు. హైదరాబద్‌లోని ఇబ్రహీంపట్నంలో షూటింగ్ చేశాం. రెయిన్ ఎఫెక్ట్ సీన్ మాత్రం సారథి స్టూడియోలో సెట్ వేసి తీశాం.

ఆయన దగ్గర పనిచేయడం నా అదృష్టం!

-ముత్యాల సుబ్బయ్య



- మద్రాసులో ఉండే 'సుప్రియ హోటల్' యజమాని, నా మిత్రుడు పరంధామరెడ్డికి సినిమాలంటే ఆసక్తి. తెలుగులో ఓ ఆఫ్‌బీట్ సినిమా తీయాలని ఆయన కోరిక. ముఖ్యంగా బెంగాలీ దర్శకుడు మృణాల్‌సేన్ అంటే ఆయనకు అభిమానం. ఆయనతో ఓ తెలుగు సినిమా తీయాలని ముచ్చటపడ్డారు. మృణాల్ సేన్‌గారు కూడా అంగీకరించారు. ఆయన యూనిట్‌లో ఎక్కువగా ఉత్తరాది వారు ఉండేవారు. తెలుగు తెలిసిన అసోసియేట్ డైరెక్టర్ ఉంటే బాగుంటుందని పరంధామరెడ్డిగారు నన్ను వచ్చి అడిగారు. ఆ సమయంలో నేను ఖాళీగా ఉండటంతో సరేనన్నాను.
- 'ఒక ఊరి కథ' చిత్రానికి డైలాగులు ఎవరు రాస్తే బాగుంటుందా అనే అంశం మీద చాలా చర్చ జరిగింది. ఒక దశలో వామపక్ష భావాలు కలిగిన రచయిత చెరబండరాజుతో రాయిద్దాం అనుకొని ఆయన్ని పిలిపించాం. అయితే ఆయనకూ, దర్శకుడు మృణాల్ సేన్‌కూ సరిపడలేదు. ఎందుకంటే తను హిందీలో రాసిన డైలాగ్స్ యథాతథంగా తెలుగులోకి అనువదించాలని మృణాల్ సేన్ అనేవారు. దానికి చెరబండరాజు అంగీకరించలేదు. ఆ తర్వాత నేను శ్రీశ్రీ పేరు సూచించాను. అదీ కుదరలేదు. చివరకు యండమూరి వీరేంద్రనాథ్ ను పిలిపించి ఆయనతో మాటలు రాయించాం.
- యూనిట్‌లో తెలుగువాళ్ల సంఖ్య తక్కువ. అంతా హిందీలోనే మాట్లాడేవారు.నాకు హిందీ రాదు. పల్లెటూరి చదువులవల్ల ఇంగ్లీషు కూడా ఫ్లూయంట్‌గా మాట్లాడలేను. దాంతో భాషా సమస్యవల్ల ఆ షూటింగ్ జరిగినంతకాలమూ ఇబ్బంది పడ్డాను.
- మృణాల్ సేన్ గొప్ప దర్శకుడే కాదు చాలా మంచి వ్యక్తి కూడా. సెట్లో చాలా సింపుల్‌గా ఉండేవారు. అందరితో కలసిపోయేవారు. అప్పట్లో నేను సిగరెట్ తాగేవాడిని. టీ తాగగానే సిగరెట్ తాగడం నాకు అలవాటు. మృణాల్ సేన్‌గారి ముందు తాగడానికి ఇబ్బంది పడి చాటుకు వెళ్లి తాగేవాడిని. ఒక రోజు ఆయన నా దగ్గరకు వచ్చి సిగరెట్ కావాలని అడిగారు. నాకు అలవాటు లేదని బుకాయించబోయా. 'నువ్వు సిగరెట్ తాగుతావని నాకు తెలుసు. .. ఇటివ్వు' అని నా దగ్గర సిగరెట్ తీసుకొని తాగారు. అంత సింపుల్‌గా ఉండేవారు. ఆయన దగ్గర పని చేసే అవకాశం రావడం నా అదృష్టం'

ఆంధ్రప్రదేశ్‌లోని ఉద్యోగార్థులకు ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నూతన సంవత్సర కానుక అందజేసింది. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 1386 పోస్టుల భర్తీ కోసం ఏపీపీఎస్సీ ప్రకటనలు విడుదల చేసింది. ఇందులో అత్యధిక మంది ఎదురు చూస్తున్న గ్రూప్-1, గ్రూప్-2 పోస్టులు కూడా ఉండటం విశేషం. ఇందుకు సంబంధించిన వివరాలను చూద్దాం..



ఏపీపీఎస్సీ.. ఉద్యోగ కానుక

గ్రూప్-1 సర్వీసులు (పోస్టులు 169)

- పోస్టులు: డిప్యూటీ కలెక్టర్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (సివిల్), డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ జైల్స్ (మెన్), డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ / అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్లు తదితరాలు...
- అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా డిగ్రీ. కొన్ని పోస్టులకు కమిషన్ నిర్దేశించిన ఇతర అర్హతలు ఉండాలి. అవి.. డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ / అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్.
- వయసు: 18 - 42 ఏళ్ల మధ్య ఉండాలి (జూలై 1, 2018 నాటికి). యూనిఫామ్ పోస్టులకు వయోపరిమితి వేర్వేరుగా ఉంటుంది. అవి..
- డీఎస్పీ పోస్టులకు: 21 - 28 ఏళ్లు, డీఎస్పీ జైల్స్ (పురుషులు): 18 - 28 ఏళ్లు, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్: 21 - 28 ఏళ్లు, అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరిండెంట్: 18 - 26 ఏళ్లు. యూనిఫామ్ పోస్టులకు నిర్దేశించిన విధంగా శారీరక ప్రమాణాలు కూడా తప్పనిసరి.
- ఎంపిక: ప్రిలిమినరీ ఎగ్జామినేషన్, మెయిన్ ఎగ్జామినేషన్, ఓరల్ టెస్ట్ (ఇంటర్వ్యూ) ఆధారంగా. మొత్తం ప్రక్రియకు 825 మార్కులు కేటాయించారు. స్ర్కీనింగ్ టెస్ట్‌లో రెండు పేపర్లు ఉంటాయి. ఒక్కో పేపర్‌లో 120 ప్రశ్నలు 120 మార్కులకు ఉంటాయి. మెయిన్స్‌లో లాంగ్వేజెస్‌తో కలిపి ఏడు పేపర్లు ఉంటాయి. అవి.. తెలుగు (150 మార్కులు), ఇంగ్లీష్ (150 మార్కులు), పేపర్-1 జనరల్ ఎస్సే (150 మార్కులు), పేపర్-2 హిస్టరీ-జాగ్రఫీ (150 మార్కులు), పేపర్-3 పాలిటీ (150 మార్కులు), పేపర్-4 ఎకానమీ (150 మార్కులు), పేపర్-5 సైన్స్ అండ్ టెక్నాలజీ (150 మార్కులు). ఇంటర్వ్యూకు 75 మార్కులు కేటాయించారు.
- ప్రిలిమినరీ ఎగ్జామ్ తేదీ: మార్చి 10, 2019.
- మెయిన్ ఎగ్జామ్ తేదీ: 2019 జూన్ 10 నుంచి 22 వరకు.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
- ఫీజు: అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు రూ.250; ఎగ్జామినేషన్ ఫీజు రూ.120.
- దరఖాస్తు ప్రక్రియ ప్రారంభ తేదీ: జనవరి 7, 2019.
- ఫీజు చెల్లించడానికి చివరి తేదీ: జనవరి 27, 2019.
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 28, 2019.

పాలిటెక్నిక్ లెక్చరర్ (పోస్టులు 405)

- సబ్జెక్టులు / బ్రాంచీలు: ఆర్కిటెక్చరల్ ఇంజనీరింగ్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్, బయో-మెడికల్ ఇంజనీరింగ్, కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్, సిరామిక్ టెక్నాలజీ, కెమికల్ టెక్నాలజీ, కెమిస్ట్రీ, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఇంగ్లీష్, గార్మెంట్ టెక్నాలజీ, జియాలజీ, మెరైన్ ఇంజనీరింగ్, మ్యాథమేటిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్, ఫార్మసీ, ఫిజిక్స్, టెక్స్‌టైల్ టెక్నాలజీ.
- అర్హత: సంబంధిత బ్రాంచీలు / సబ్జెక్టుల్లో బ్యాచిలర్స్ డిగ్రీ, పీజీ ఉత్తీర్ణత. కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్ లెక్చరర్ పోస్టులకు కామర్స్‌లో మాస్టర్స్ డిగ్రీ, ఇంగ్లీష్‌లో టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ హయ్యర్ గ్రేడ్ ఉండాలి.
- వయసు: 18 - 42 ఏళ్ల మధ్య ఉండాలి (జూలై 1, 2018 నాటికి).
- ఎంపిక: స్ర్కీనింగ్ టెస్ట్, కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామ్/ మెయిన్ ఎగ్జామినేషన్, ఓరల్ టెస్ట్ (ఇంటర్వ్యూ) ఆధారంగా. మొత్తం ప్రక్రియకు 500 మార్కులు కేటాయించారు. రాత పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. అవి పేపర్-1 జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ (150 మార్కులు), పేపర్-2 ఎంచుకున్న సబ్జెక్ట్ (300 మార్కులు). ఇంటర్వ్యూకు 50 మార్కులు కేటాయించారు.
- మెయిన్ ఎగ్జామినేషన్ తేదీ: 2019 జులైలో.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
- ఫీజు: అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు రూ.250; ఎగ్జామినేషన్ ఫీజు రూ.120.
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం: ఫిబ్రవరి 6, 2019.
- ఫీజు చెల్లించడానికి చివరి తేదీ: ఫిబ్రవరి 26, 2019.
- దరఖాస్తుకు చివరితేదీ: ఫిబ్రవరి 27, 2019.

డిగ్రీ కాలేజ్ లెక్చరర్ (పోస్టులు 308)

- సబ్జెక్టులు: ఇంగ్లీష్, తెలుగు, హిందీ, ఉర్దూ, ఒరియా, హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, కామర్స్, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్, స్టాటిస్టిక్స్, మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ, జియాలజీ.
- అర్హత: సంబంధిత సబ్జెక్టులో మాస్టర్స్ డిగ్రీతోపాటు నెట్ / స్లెట్ (లేదా) పీహెచ్‌డీ ఉత్తీర్ణత.
- వయసు: 18 - 42 ఏళ్ల మధ్య ఉండాలి (జూలై 1, 2018 నాటికి).
- ఎంపిక: స్ర్కీనింగ్ టెస్ట్, కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామ్ / మెయిన్ ఎగ్జామినేషన్, ఓరల్ టెస్ట్ (ఇంటర్వ్యూ) ఆధారంగా. మొత్తం ప్రక్రియకు 500 మార్కులు కేటాయించారు. రాత పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. అవి పేపర్-1 జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ (150 మార్కులు), పేపర్-2 ఎంచుకున్న సబ్జెక్ట్ (300 మార్కులు). ఇంటర్వ్యూకు 50 మార్కులు కేటాయించారు.
- మెయిన్ ఎగ్జామ్ తేదీ: 2019 మే 21, 22 తేదీల్లో.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
- ఫీజు: అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు రూ.250; ఎగ్జామినేషన్ ఫీజు రూ.120.
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం: ఫిబ్రవరి 5, 2019.

ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (పోస్టులు 43)

- ఫీజు చెల్లించడానికి చివరి తేదీ: ఫిబ్రవరి 25, 2019.
- దరఖాస్తుకు చివరితేదీ: ఫిబ్రవరి 26, 2019.
- జోన్ల వారీగా ఖాళీలు: జోన్-1: 07, జోన్-2: 22, జోన్-3: 08, జోన్-4: 06
- అర్హత: బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ (బీఎఫ్ఎస్సీ).
- వయసు: 18 - 42 ఏళ్ల మధ్య ఉండాలి (జూలై 1, 2018 నాటికి).
- ఎంపిక: ఎంపిక: స్ర్కీనింగ్ టెస్ట్, కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామ్ / మెయిన్ ఎగ్జామినేషన్ ఆధారంగా. మొత్తం ప్రక్రియకు 450 మార్కులు కేటాయించారు. రాత పరీక్షలో మూడు పేపర్లు ఉంటాయి. అవి పేపర్-1 జనరల్ స్టడీస్ & మెంటల్ ఎబిలిటీ (150 మార్కులు), పేపర్-2 ఫిషరీస్ సైన్స్-1 (150 మార్కులు), పేపర్-3 ఫిషరీస్ సైన్స్-2 (150 మార్కులు).
- మెయిన్ ఎగ్జామినేషన్: 2019 మే 21, 22 తేదీల్లో.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం: జనవరి 17, 2019.
- ఫీజు చెల్లించడానికి చివరి తేదీ: ఫిబ్రవరి 7, 2019.
- దరఖాస్తుకు చివరితేదీ: ఫిబ్రవరి 8, 2019.

అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ (ఏపీ ఫిషరీస్ సబ్-సర్వీస్) (పోస్టులు 10)

- **జోన్ల వారీగా ఖాళీలు:** జోన్-1: 01, జోన్-2: 06, జోన్-3: 02, జోన్-4: 01
- అర్హత: ఫిషరీస్ టెక్నాలజీలో పీజీ డిప్లొమా (లేదా) ఫిషరీస్ టెక్నాలజీలో డిప్లొమా, నేవిగేషన్ పాలిటెక్నిక్ (లేదా) ఇన్‌ల్యాండ్ / మెరైన్ ఫిషరీస్ క్లాసెస్ కోర్సు సర్టిఫికెట్ (లేదా) జువాలజీ ప్రధాన సబ్జెక్టుగా బీఎస్సీ (లేదా) బీఎఫ్ఎస్సీ (లేదా) బీఎస్సీ (ఎఫ్‌జడ్‌సీ), బీఎస్సీ (ఫిషరీస్) ఉత్తీర్ణత.
- వయసు: 18 - 42 ఏళ్ల మధ్య ఉండాలి (జూలై 1, 2018 నాటికి).
- ఎంపిక: స్ర్కీనింగ్ టెస్ట్, కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామ్ / మెయిన్ ఎగ్జామినేషన్ ఆధారంగా. మొత్తం ప్రక్రియకు 300 మార్కులు కేటాయించారు. రాత పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. అవి పేపర్-1 జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ (150 మార్కులు), పేపర్-2 సబ్జెక్ట్ (150 మార్కులు).
- మెయిన్ ఎగ్జామ్ తేదీ: మే 27, 2019.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేదీ: జనవరి 18, .2019.
- ఫీజు చెల్లించడానికి చివరి తేదీ: ఫిబ్రవరి 7, 2019.
- దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 8, 2019.

డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ (ఏపీ ఇన్ఫర్మేషన్ సర్వీస్) (పోస్టులు 5)

- **జోన్ల వారీగా ఖాళీలు:** జోన్-1: 01, జోన్-2: 02, జోన్-3: 01, జోన్-4: 01
- అర్హత: ఎలక్ట్రానిక్స్ (లేదా) టెలీకమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ.
- వయసు: 18 - 42 ఏళ్ల మధ్య ఉండాలి (జూలై 1, 2018 నాటికి).
- ఎంపిక: స్ర్కీనింగ్ టెస్ట్, కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామ్ / మెయిన్ ఎగ్జామినేషన్ ఆధారంగా. మొత్తం ప్రక్రియకు 450 మార్కులు కేటాయించారు. రాత పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. అవి పేపర్-1 జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ (150 మార్కులు), పేపర్-2 సబ్జెక్ట్ (300 మార్కులు).
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభ తేదీ: జనవరి 22, 2019.
- దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 12, 2019.

గ్రూప్-2 సర్వీసులు (పోస్టులు 446)

- పోస్టులు: అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ తదితరాలు.
- ఎగ్జిక్యూటివ్ పోస్టులు - 154, నాన్ ఎగ్జిక్యూటివ్ - 292
- అర్హత: ఏదైనా డిగ్రీ. కొన్ని పోస్టులకు కమిషన్ నిర్దేశించిన ఇతర అర్హతలు ఉండాలి. అవి.. అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్), అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (లా డిపార్ట్‌మెంట్), సీనియర్ అకౌంటెంట్, జూనియర్ అకౌంటెంట్.
- వయసు: 18 - 42 సంవత్సరాల మధ్య ఉండాలి (ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్సై పోస్టుకు 18 - 28 మధ్య). యూనిఫామ్ పోస్టులకు నిర్దేశించిన విధంగా శారీరక ప్రమాణాలు కూడా తప్పనిసరి.
- ఎంపిక: స్ర్కీనింగ్, మెయిన్స్ పరీక్షల ద్వారా. మొత్తం ప్రక్రియకు 600 మార్కులు కేటాయించారు. ఇందులో స్ర్కీనింగ్ పరీక్ష 150 మార్కులకు ఉంటుంది. మెయిన్స్‌లో మూడు పేపర్లు ఇస్తారు. అవి.. పేపర్-1 జనరల్ స్టడీస్ మెంటల్ ఎబిలిటీ (150 మార్కులు), పేపర్-2 హిస్టరీ-పాలిటీ (150 మార్కులు), పేపర్-3 ఎకానమీ (150 మార్కులు).
- స్ర్కీనింగ్ టెస్ట్ తేదీ: మే 5, 2019.
- మెయిన్ ఎగ్జామ్ తేదీ: 2019 జులై 18, 19 తేదీల్లో.
- దరఖాస్తు రుసుము: అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు 250, ఎగ్జామ్ ఫీజు రూ.80 చెల్లించాలి.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం: జనవరి 10, 2019
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 31, 2019
- ఫీజు చెల్లించడానికి చివరి తేదీ: జనవరి 30, 2019

వెబ్‌సైట్: https://psc.ap.gov.in/

ట్రేడ్ అప్రెంటీస్‌లు (ఖాళీలు 1273)

వెస్ట్ సెంట్రల్ రైల్వే - ట్రేడ్ అప్రెంటీస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ట్రేడ్స్ వారీ ఖాళీలు: డీజిల్ మెకానిక్ 100, వెల్డర్ 51, ఫిట్టర్ 378, వైర్‌మన్ 38, ఎలక్ట్రికల్ 136, కార్పెంటర్ 20, బ్లాక్‌స్మిత్ 20, స్టెనో 6, ఎలక్ట్రానిక్ మెకానిక్ 30, డ్రాఫ్ట్‌మన్ 5, మెకానిక్ కం ఆపరేటర్ ఎలక్ట్రానిక్స్ సిస్టం 10, కంప్యూటర్ & పెరిఫెరల్ హార్డ్‌వేర్ రిపేర్ 10, కమ్యూనికేషన్ మెకానిక్ 10, ఎలక్ట్రీషియన్ 130, మెషినిస్ట్ 16, టర్నర్ 10, ఎలక్ట్రీషియన్ 200, మాసాన్ 25, పెయింటర్ 15, కోపా 4, హోటల్ క్లర్క్ 2, ఇన్ఫర్మేషన్ & కమ్యూనికేషన్ టెక్ 10, కేబుల్ జాయింటర్ 6, క్యాడ్ క్యామ్ ఆపరేటర్ కం ప్రోగ్రామర్ 6, ఎలక్ట్రికల్ మెకానిక్ 25
- అర్హత: పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ పూర్తిచేసి ఉండాలి.
- ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామ్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ద్వారా
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: 2019 జనవరి 23
- వెబ్‌సైట్: wcr.indianrailways.gov.in

స్పెషలిస్టులు (ఖాళీలు 329)

ఈఎస్ఐసీ ఆధ్వర్యంలోని వివిధ ఆసుపత్రుల్లో స్పెషలిస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- కేడర్ వారీ ఖాళీలు: సీనియర్ స్కేల్ 72, జూనియర్ స్కేల్ 257
- విభాగాలు: అనెస్తీషియా, కార్డియాలజీ, హెమటాలజీ, న్యూరాలజీ తదితర విభాగాలు
- అర్హత: ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతోపాటు సంబంధిత విభాగంలో పీజీ పూర్తి చేసి ఉండాలి
- వేతనం: సీనియర్ గ్రేడ్‌కు రూ.78,800 జూనియర్ గ్రేడ్‌కు రూ.67,700
- దరఖాస్తుకు ఆఖరు తేదీ: 2019 జనవరి 24
- వెబ్‌సైట్: www.esic.nic.in

టెక్నీషియన్లు (ఖాళీలు 64)

విక్రం సారాభాయ్ స్పేస్ సెంటర్ (వీఎస్ఎస్‌సీ) - టెక్నీషియన్ తదితర ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- విభాగాలవారీ ఖాళీలు: టెక్నీషియన్ (బీ గ్రేడ్) (ఎలక్ట్రీషియన్ 7, ఎలక్ట్రానిక్ మెకానిక్ 5, మెషినిస్ట్ 5, ఫిట్టర్ 3, ఎఫ్ఆర్‌పి 4, కెమికల్ ఆపరేటర్ 2, టర్నర్ 2, ఎంఆర్ & ఏసీ 2, ఎలక్ట్రో ప్లేటర్ 1, ప్లంబర్ 1, బ్లాక్ స్మిత్ 1, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ 1), డ్రాఫ్ట్‌మన్ బి (మెకానికల్ 4, కుక్ 3), ఫైర్ మన్ 1, క్యాటరింగ్ అటెండెంట్ 22.
- అర్హత: పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు ఐటీఐ / ఎన్‌టీసీ / ఎన్ఏసీ పూర్తిచేసి ఉండాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: 2019 జనవరి 11
- వెబ్‌సైట్: www.vssc.gov.in

జూనియర్ టెక్నికల్ ఆఫీసర్లు (ఖాళీలు 2100)

ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్)- జూనియర్ టెక్నికల్ ఆఫీసర్లు, జూనియర్ కన్సల్టెంట్ - ఫీల్డ్ ఆపరేటర్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ఉద్యోగాలవారీ ఖాళీలు: జూనియర్ టెక్నికల్ ఆఫీసర్లు 1470, జూనియర్ కన్సల్టెంట్లు (గ్రేడ్-1లో 315, గ్రేడ్-2లో 315)
- జోన్లవారీ ఖాళీలు: హైదరాబాద్‌లో 650, న్యూఢిల్లీలో 550, బెంగళూరులో 225, ముంబైలో 25, కోల్‌కతాలో 650
- అర్హత: ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తిచేసి ఉండాలి.
- వేతనం: జేటీఓలకు రూ.19,188, జూనియర్ కన్సల్టెంట్లలో గ్రేడ్-1 అభ్యర్థులకు రూ. 17,654 గ్రేడ్-2 అభ్యర్థులకు రూ. 16.042
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: 2019 జనవరి 5
- వెబ్‌సైట్: www.ecil.co.in

ఆఫీసు సిబ్బంది (ఖాళీలు 70)

పుదుచ్చేరిలోని జవహర్‌లాల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (జిప్‌మర్) కింది ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ఉద్యోగాలు: హిందీ ట్రాన్స్‌లేటర్లు 3, టెక్నికల్ అసిస్టెంట్లు 3, నర్సింగ్ ఆఫీసర్లు 60, స్టెనోగ్రాఫర్లు 3, ఎంటీఎస్ - కోబ్లర్ 1
- అర్హత: పీజీ, డిగ్రీ, ఇంటర్, పదోతరగతి పూర్తిచేసి ఉండాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: 2019 జనవరి 28
- వెబ్‌సైట్: www.jipmer.edu.in

ఏదైనా కంపెనీ ఉద్యోగాలను భర్తీ చేయాలనుకుంటే నోటిఫికేషన్ జారీ చేయడం, దరఖాస్తులు స్వీకరించడం, ఇంటర్వ్యూ / రాత పరీక్ష నిర్వహించడం వంటి విధానాలను అనుసరిస్తుంది. ఇది అందరూ అనుసరించే సంప్రదాయమైన పద్ధతి. కానీ ప్రస్తుతం ఈ ట్రెండ్ క్రమంగా తగ్గుతోంది. కారణలేమైనా నోటిఫికేషన్స్ వెలువరించకుండా రిఫరెన్స్, జాబ్ లిస్టింగ్ వెబ్‌సైట్స్ వంటి ప్రత్యామ్నాయ మార్గాల్లో ఉద్యోగులను నియమించుకోవడానికి కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఒక జాబ్ సీకర్ 'హిడెన్ జాబ్స్ / అన్‌లిస్టెడ్ జాబ్స్'ను ఏ విధంగా సెర్చ్ చేయాలి. అందుకు ఏయే మార్గాలను అనుసరించాలో చూద్దాం..

తెలివిగా అన్వేషించాలి



ఒక కంపెనీలో ఏదైనా వేకెన్సీ ఉంటే దానికి నోటిఫికేషన్‌ను జారీ చేసి నిర్దేశిత రూపంలో కాకుండా ప్రత్యామ్నాయ విధానాల్లో భర్తీ చేస్తారు. ఇటువంటి జాబ్స్‌ను హిడెన్ జాబ్స్ / అన్‌లిస్టెడ్ జాబ్స్‌గా పేర్కొంటారు. వీటిని తెలివిగా అన్వేషించాలి. ఒక అంచనా మేరకు దాదాపుగా 60 నుంచి 80 శాతం ఉద్యోగాలు ఎటువంటి అడ్వర్‌టైజ్‌మెంట్స్ లేకుండానే ఈ విధానంలో భర్తీ అవుతున్నాయి.

నెట్‌వర్కింగ్

ఇటువంటి హిడెన్ జాబ్స్‌ను తెలుసుకోవడానికి ఉపయోగపడే కీలకమైన సాధనం నెట్‌వర్కింగ్. అంటే పరిచయాలను పెంచుకోవడం, వాటిని ప్రభావవంతంగా వినియోగించుకోవడం. ముందుగా మన ప్రొఫైల్‌ను అనుసరించి సంబంధిత రంగంలోని ప్రొఫెషనల్స్‌తో పరిచయాలు పెంచుకోవాలి. ఈ క్రమంలో నిజాయితీగా వ్యవహరించాలి. ఈ పరిచయాలను నిరంతరం కొనసాగిస్తూనే ఉండాలి. కేవలం జాబ్ లేదా అవసరమైన సందర్భంలోనే కాకుండా ఎల్లప్పుడూ వారితో టచ్‌లో ఉండటానికి ప్రయత్నించాలి. ఈ సందర్భంలో మీరు జాబ్ పట్ల ఎంత నిబద్ధతగా ఉన్నారు? అనే విషయం వారికి తెలిసేలా నడుచుకోవాలి. తద్వారా ఒక రకమైన సానుకూల దృక్పథం ఏర్పడుతుంది. వారి దృష్టిలో ఏదైనా అవకాశం ఉంటే ముందు మీ పేరే స్ఫురణలోకి వస్తుంది.

రెజ్యూమె పంపించడం

కొన్ని కంపెనీలు అభ్యర్థులు నేరుగా రెజ్యూమెను సబ్మిట్ చేయడాన్ని ప్రోత్సహిస్తాయి. కాబట్టి ముందుగా మీ ప్రొఫైల్‌కు సరిపడే కంపెనీలను లిస్టవుట్ చేసుకోవాలి. తరవాత ఆయా కంపెనీల రిక్రూట్‌మెంట్ మేనేజర్ల సమాచారాన్ని వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవాలి. ఇప్పుడు వారిని ఉద్దేశిస్తూ నేరుగా కవర్ లెటర్‌తో కూడిన రెజ్యూమెను ఫార్వర్డ్ చేయాలి. అయితే ఇటువంటి కంపెనీలు ఏటీఎస్ (అప్లికెంట్ ట్రాకింగ్ సిస్టమ్స్) ద్వారా రెజ్యూమెలను షార్ట్‌లిస్ట్ చేస్తుంటాయి. కాబట్టి రెజ్యూమెలోని పదాలు, అర్హతలు, నైపుణ్యాలు వంటివి ఏటీఎస్ విధానానికి అనుగుణంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

మేనేజర్‌తో నేరుగా

ఒక్కోసారి మేనేజర్లను నేరుగా కలవడం ద్వారా కూడా హిడెన్ జాబ్స్‌ను దక్కించుకోవచ్చు. ఇంటర్నెట్ ద్వారా మన ప్రొఫైల్‌కు సరిపడే కంపెనీల హెచ్‌ఆర్ / రిక్రూట్‌మెంట్ మేనేజర్ల సమాచారాన్ని పొందొచ్చు. తరవాత ఈ-మెయిల్ లేదా ఇతర మార్గాల ద్వారా వారిని కలుసుకునేందుకు ముందస్తు అనుమతి తీసుకోవాలి. వారిని కలిసినప్పుడు మన సామర్థ్యాలు అంటే.. అర్హత, అనుభవం, నైపుణ్యాలు వంటి వాటిని ప్రభావవంతంగా వివరించాలి. తద్వారా మనపై ఒక పాజిటివ్ ఇంప్రెషన్ ఏర్పడుతుంది.

అంతేకాకుండా ఏదైనా అవకాశం ఉంటే రిఫర్ చేయమని కూడా రిక్వెస్ట్ చేయవచ్చు. కాబట్టి ఆఫ్‌లైన్, ఆన్‌లైన్, ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్, సోషల్ మీడియా ద్వారా నిత్యం టచ్‌లో ఉండటానికి ప్రయత్నం చేయాలి. ఈ సందర్భంగా ఇచ్చే సలహాలు, సూచలనలకు మీరు ఎంత విలువ ఇస్తున్నారు అనేది వారికి తెలిసేలా వ్యవహరించాలి. తద్వారా అవకాశాలు మెరుగవుతాయి.

జాబ్ లిస్టింగ్ వెబ్‌సైట్స్

జాబ్ లిస్టింగ్ వెబ్‌సైట్స్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవడం మరో మార్గం. కొన్ని కంపెనీలు రిక్రూట్‌మెంట్ విషయంలో ఇటువంటి వెబ్‌సైట్స్ సహాయం తీసుకుంటూ ఉంటాయి. కాబట్టి ఏదైనా ఒక జాబ్ లిస్టింగ్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవడం ప్రయోజనకరం. ఎందుకంటే ఏవైనా నియమాకాలు చేపట్టాలనుకుంటే.. రిక్రూటర్లు జాబ్ లిస్టింగ్ వెబ్‌సైట్‌లోని డేటా బేస్ ఆధారంగా జాబ్ సీకర్స్‌కు నేరుగా కాల్ చేస్తుంటారు. కాబట్టి అర్హతలు, అనుభవం, నైపుణ్యాలు, వంటి అంశాల ఆధారంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. కొన్ని కంపెనీలు సోషల్ మీడియా ద్వారా అప్లికేషన్స్ పరిశీలించి అభ్యర్థులకు నేరుగా కాల్ చేస్తుంటాయి. కాబట్టి సోషల్ మీడియాలో కూడా పాజిటివ్ ప్రొఫైల్‌ను మెయింటెయిన్ చేయాలి.

రిఫరెన్స్

హిడెన్ జాబ్స్ విషయంలో ప్రభావవంతంగా పని చేసేవి రిఫరెన్స్. చాలా మంది హెచ్‌ఆర్ మేనేజర్లు మాజీ ఉద్యోగులు, గతంలో తమతో కలిసి పని చేసిన వారికి అవకాశం కల్పిస్తుంటారు. అంతేకాకుండా సంస్థలోని ఉద్యోగుల రిఫరెన్స్ ద్వారా కూడా కొత్త వారికి అవకాశం ఇస్తారు. ఇటువంటి అంతర్గత రిఫరెన్స్‌కు కూడా కంపెనీలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. సరైన ఉద్యోగిని రిఫర్ చేస్తే బోనస్‌ను కూడా ప్రకటిస్తున్నాయి. కాబట్టి ప్రొఫెషనల్ నెట్‌వర్క్‌ను విస్తరించుకోవడానికి ప్రయత్నించాలి. ఇందుకు సోషల్ మీడియా సరైన వేదిక.

జాబ్ ఫెయిర్స్, జాబ్ అలర్ట్స్

మరో మార్గం.. జాబ్ ఫెయిర్స్, జాబ్ అలర్ట్స్. వివిధ కంపెనీలు నిర్దేశిత సమయాల్లో జాబ్ ఫెయిర్స్ నిర్వహిస్తుంటాయి. వాటి ద్వారా కూడా హిడెన్ జాబ్స్‌ను దక్కించుకోవచ్చు. ఆన్‌లైన్ జాబ్ లిస్టింగ్ వెబ్‌సైట్స్ లేదా సంబంధిత సేవలను ఆఫర్ చేస్తున్న సర్వీస్ ప్రొవైడర్స్ దగ్గర రిజిస్ట్రేషన్ చేసుకుంటే మన ప్రొఫైల్‌కు సరిపడే జాబ్ అలర్ట్స్ వస్తుంటాయి. వాటి ద్వారా కూడా అవకాశాలను మెరుగుపరుచుకోవచ్చు.

ఎల్‌ఐసీ తాత్కాలిక చైర్మన్‌గా హేమంత్ భార్గవ

న్యూఢిల్లీ : భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్‌ఐసీ) తాత్కాలిక చైర్మన్‌గా హేమంత్ భార్గవ నియమితులయ్యారు. ఎల్‌ఐసీ చైర్మన్‌గా ఉన్న వీకే శర్మ.. సోమవారం పదవీ విరమణ చేయటంతో ఆయన స్థానంలో మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న హేమంత్‌ను తాత్కాలిక చైర్మన్‌గా నియమిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఎల్‌ఐసీ రెగ్యులర్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌ను నియమించే ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించినట్లు ప్రభుత్వం తెలిపింది. 2017, ఫిబ్రవరిలో ఎల్‌ఐసీ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులైన హేమంత్ భార్గవ.. సంస్థను సరికొత్తగా తీర్చిదిద్దటంలో కీలక పాత్ర పోషించారు.

భవిష్యత్ బంగారం!

'ఐటీ'కి డిజిటల్ టెక్నాలజీల అండ

అయిదారేళ్ల వరకూ జోరే
నేర్చుకున్నోళ్లకు నేర్చుకున్నంత
2019-20లో లక్ష ఉద్యోగాలు!
టీసీఎస్‌కు హైదరాబాద్ కీలక కేంద్రం
ప్రాంతీయ అధిపతి వి.రాజన్న

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



కొత్త ఏడాదిలోనే కాదు.. కనీసం వచ్చే అయిదారేళ్ల పాటు దేశీయ సాఫ్ట్‌వేర్ రంగం కళకళలాడే అవకాశం ఉంది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) రంగానికి డిజిటల్ టెక్నాలజీలు వెన్నుదన్నుగా నిలవనున్నాయి. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ), కృత్రిమ మేధ (ఏఐ), ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్), వర్చ్యువల్ రియాలిటీ (వీఆర్) వంటి టెక్నాలజీలు ఉద్యోగావకాశాలు కల్పించనున్నాయని, ఈ టెక్నాలజీలను నేర్చుకున్న వారికి ఢోకా ఉండదని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) గ్లోబల్ హెడ్ (టెక్నాలజీ బిజినెస్ యూనిట్), ప్రాంతీయ అధిపతి (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) వి.రాజన్న చెబుతున్నారు. ఖాతాదారులను కంపెనీలు ఆకట్టుకోవాలంటే భిన్నమైన రీతిలో సేవలందించాలి. డిజిటల్ టెక్నాలజీల ద్వారానే అది సాధ్యమైనందున ఈ టెక్నాలజీల్లో పెట్టుబడులు పెడుతున్నాయని వివరించారు. ఐటీ పరిశ్రమ వృద్ధికి ఈ పరిణామం దోహదం చేయగలదన్నారు. కొత్త ఏడాది సందర్భంగా ఐటీ రంగంలో రానున్న ధోరణులు, వచ్చే ఆర్థిక సంవత్సరంలో అదనంగా లభించే ఉద్యోగావకాశాలు, పరిశ్రమ ఆదాయంలో పెరుగుదల మొదలైన అంశాలపై 'ఆంధ్రజ్యోతి బిజినెస్'తో చర్చించారు. ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలు..

హైదరాబాద్, ఆంధ్రజ్యోతి బిజినెస్

భవిష్యత్తులో ఐటీ పరిశ్రమ వృద్ధికి డిజిటల్ టెక్నాలజీలే దోహదం చేస్తాయంటున్నారు. ఏ విధంగానో వివరిస్తారా?

పోటీని అధిగమించి అన్ని రంగాల్లోని కంపెనీలు ఆటోమోషన్, క్లౌడ్ సేవలను వినియోగించుకోవాలని భావిస్తున్నాయి. డిజిటల్ టెక్నాలజీల ద్వారానే ఆటోమేషన్ జరుగుతుంది. ఇప్పటి వరకూ కంపెనీలు చిన్న, చిన్న మొత్తాల్లోనే డిజిటల్ టెక్నాలజీల్లో పెట్టుబడులు పెట్టాయి. వచ్చే కొద్ది సంవత్సరాల్లో కంపెనీలు (ఖాతాదారులు) డిజిటల్ టెక్నాలజీల్లో భారీ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టే వీలుంది. బిలియన్ డాలర్లకు మించిన ప్రాజెక్టులను మెగా డీల్స్ అంటారు. ఇటువంటివి భవిష్యత్తులో ఐటీ కంపెనీలకు బాగా వచ్చే వీలుంది. 2018-19 లో ఇటువంటి ప్రాజెక్టులు టీసీఎస్‌కు మూడు, నాలుగు వచ్చాయి. దేశీయ ఐటీ పరిశ్రమ, కంపెనీలకు ఇది సానుకూల పరిణామం. వచ్చే అయిదారేళ్ల పరిశ్రమ అభివృద్ధికి డిజిటల్ టెక్నాలజీలు దోహదం చేయనున్నాయి.

అవకాశాలను అందిపుచ్చుకునే సామర్థ్యాలు దేశీయ ఐటీ పరిశ్రమకు ఉన్నాయా?

ప్రపంచ ఖాతాదారులకు (కంపెనీలు) భారత్ డిజిటల్ టెక్నాలజీల హబ్ కానుంది. ప్రపంచవ్యాప్తంగా కంపెనీలు డిజిటల్ టెక్నాలజీల్లోకి మారే ప్రక్రియలో భారత్ కీలక పాత్ర పోషిస్తుంది. ప్రాజెక్టులను అమలు చేసే సామర్థ్యాలు మన కంపెనీలకు పటిష్ఠంగా ఉన్నాయి. దేశీయ ఐటీ కంపెనీలు ప్రత్యేక నైపుణ్యాల కోసం ఎక్సలెన్స్ కేంద్రాల్లో (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్) భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. నిపుణులకు డిజిటల్ టెక్నాలజీల్లో నైపుణ్యాలను పెంచడంపైన కూడా ఎక్కువ నిధులు కేటాయిస్తున్నాయి. టీసీఎస్‌నే తీసుకుంటే.. స్వల్ప కాలంలో 3 లక్షల మంది ఉద్యోగులకు డిజిటల్ టెక్నాలజీల్లో శిక్షణ ఇచ్చింది. అన్నింటికీ మించి ఖాతాదారులను అర్థం చేసుకోవడంలో భారత కంపెనీలదీ అందెవేసిన చేయి. కొన్ని సంవత్సరాలుగా వారితో అనుబంధమే ఇందుకు కారణం.

వచ్చే ఆర్థిక సంవత్సరంలో అదనంగా పరిశ్రమలో ఎన్ని ఉద్యోగాలు లభించే వీలుంది?

ఐటీ రంగంలో ప్రస్తుతం 42 లక్షల మంది ఉద్యోగులు ప్రత్యక్షంగా పని చేస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో అదనంగా లక్ష మందికి ఐటీ పరిశ్రమ ఉపాధి అవకాశాలు కల్పించింది. 2018-19, వచ్చే ఆర్థిక సంవత్సరంలో కూడా అదనంగా ఇదే స్థాయిలో ఉద్యోగావకాశాలు లభించే వీలుంది. 2019-20 నియామకాల కోసం ఇప్పటికే టీసీఎస్ మొదటి విడత ప్రాంగణ, ఆఫ్ క్యాంపస్ నియామాలను పూర్తి చేసింది. రెండో విడత ఆఫ్ క్యాంపస్ నియామకాలను ప్రారంభించాం. విద్యార్థులు, నిపుణులు కొత్త టెక్నాలజీలలో నైపుణ్యాలు సంపాదించి, అవకాశాలు అందిపుచ్చుకోవడానికి ఎన్నో అవకాశాలు ప్రస్తుతం ఉన్నాయి. నేర్చుకున్న వారికి నేర్చుకున్నంత. భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 7 శాతం వాటా ఐటీ పరిశ్రమదే. మొత్తం ఎగుమతుల్లో 24 శాతం, సేవల రంగ ఎగుమతుల్లో 40 శాతానికి మించి ఐటీ ఎగుమతులే ఉన్నాయి. దేశంలో అత్యధిక ఉద్యోగావకాశాలను కల్పిస్తున్న ప్రధాన రంగాల్లో ఐటీ ఒకటి.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఐటీ పరిశ్రమ ఆదాయంపై అంచనాలు?

అంతక్రితం ఏడాదితో పోలిస్తే 2017-18లో ఐటీ పరిశ్రమ ఆదాయం 8 శాతానికి పైగా వృద్ధి చెంది 167 బిలియన్ డాలర్లకు (దాదాపు రూ.11.52 లక్షల కోట్లు) చేరింది. ఇందులో 126 బిలియన్ డాలర్లు (75 శాతం) ఎగుమతులు కాగా.. 25 శాతం దేశీయ వాటా. 2018-19లో పరిశ్రమ ఆదాయం 7-10 శాతం మేరకు పెరగడానికి అవకాశాలున్నాయి. మొత్తం ఆదాయంలో డిజిటల్ టెక్నాలజీల వల్ల లభించే ఆదాయం వాటా పెరిగే వీలుంది. టీసీఎస్‌నే తీసుకుంటే ఏడాది క్రితంతో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ఆదాయం దాదాపు 12 శాతం పెరిగింది. అయితే.. డిజిటల్ టెక్నాలజీల ద్వారా లభించిన ఆదాయం ఏకంగా 60 శాతం వృద్ధి చెందింది. మొత్తం ఆదాయంలో డిజిటల్ టెక్నాలజీల వాటా మూడో వంతు ఉంది.

అన్ని రంగాల్లోని కంపెనీలు డిజిటల్ టెక్నాలజీలకు ఎందుకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి?

సినిమా టికెట్ల కొనుగోలు నుంచి షాపింగ్ వరకూ అన్నీ ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. ఖాతాదారులకు భిన్నమైన అనుభవాన్ని కల్పించి ఆకర్షించాలని కంపెనీలు కోరుకుంటున్నాయి. వినియోగదారులకు అదనపు విలువ చేకూర్చాలని భావిస్తున్నాయి. ఐటీ కంపెనీల కోణంలో చూస్తే మరింత మెరుగైన సేవలను తక్కువ ఖర్చుకు ఐటీ కంపెనీలు అందించాలని ఖాతాదారులు కోరుకుంటున్నారు. అందుకే డిజిటల్ టెక్నాలజీలకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. టీసీఎస్ అభివృద్ధి చేసిన 'బిజినెస్ 4.0 థాట్ లీడర్' వ్యూహం పరిశ్రమ మొత్తానికి వర్తిస్తుంది. ఖాతాదారు కంపెనీలు డిజిటల్ టెక్నాలజీల్లోకి మారే ప్రక్రియలో ఎలా పాలుపంచుకోవాలన్న దానిపై ఐటీ కంపెనీలు దృష్టి సారిస్తున్నాయి. ఈ ప్రక్రియలో భాగస్వాములతో చేతులు కలుపుతున్నాయి. ఉదాహరణకు ఒక డిజిటల్ ప్రాజెక్టును అమలు చేయాలంటే.. నెట్‌వర్కింగ్ కంపెనీ, చిప్‌సెట్ తయారీ కంపెనీ మొదలైన రంగాల్లోని కంపెనీల అవసరం ఉంటుంది.

హైదరాబాద్‌లో టీసీఎస్ విస్తరణ ప్రణాళికలు ఏమిటీ?

హైదరాబాద్‌లోని ఆదిభట్లలో అభివృద్ధి చేసిన ప్రాంగణంలో మొత్తం నాలుగు అభివృద్ధి కేంద్రాలను (డెవలప్‌మెంట్ సెంటర్లు) ఏర్పాటు చేయనున్నాం. ఇప్పటికే రెండు కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. వీటిలో 13,000 మంది నిపుణులు పని చేస్తున్నారు. ఆదిభట్ల ప్రాంగణ సామర్థ్యం 25,000 మంది. మూడో డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణంలో ఉంది. 3-4 నెలల్లో పూర్తవుతుంది. నిపుణుల అవసరాలను బట్టి నాలుగో డెవలప్‌మెంట్ సెంటర్ అందుబాటులోకి వస్తుంది. టీసీఎస్‌కు హైదరాబాద్ ఎంతో కీలకం. ఇక్కడ వివిధ విభాగాలకు సాఫ్ట్‌వేర్, ప్రొడక్ట్‌లను అభివృద్ధి చేయగల నిపుణుల లభ్యత, మౌలిక సదుపాయాలు వంటి అన్ని సదుపాయాలు ఉన్నాయి. హైదరాబాద్‌లో టీసీఎస్‌కు మొత్తం మూడు- డెక్కన్ పార్క్, సినర్జీ పార్క్, ఆదిభట్ల ప్రాంగణాలున్నాయి. 2007లో హైదరాబాద్‌లో టీసీఎస్‌కు 4,500 మంది ఉద్యోగులుంటే.. ఇప్పుడు 43,000 మంది నిపుణులు, ఉద్యోగులు పని చేస్తున్నారు. దశాబ్ద కాలంలో నిపుణుల సంఖ్య పదింతలైంది. ప్రపంచ వ్యాప్తంగా టీసీఎస్‌కు హైదరాబాద్ నాలుగో అతిపెద్ద కేంద్రం. టీసీఎస్ వృద్ధి వ్యూహంలో భవిష్యత్తులో కూడా హైదరాబాద్ కేంద్రం కీలకంగా కొనసాగుతుంది. ఇటీవలే విజయవాడలో కూడా టీసీఎస్ ఆన్‌లైన్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ప్రారంభించింది. టీసీఎస్‌లో మొత్తం 4 లక్షల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు.

ఎంఎస్ఎంఈలకు ఊరట!

న్యూఢిల్లీ: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ)కు చెందిన రుణ బకాయిల పునర్వ్యవస్థీకరణ కోసం మంగళవారం నాడు ఆర్‌బీఐ మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ ఏడాది జనవరి 1 నాటికి ఒత్తిడిలో ఉన్న (డిఫాల్ట్ అయినప్పటికీ ఇంకా మొండి బకాయిల్లోకి మళ్లని రుణ ఖాతాలు) ఎంఎస్ఎంఈ రుణాల వన్ టైమ్ రీస్ట్రక్చరింగ్ (పునర్వ్యవస్థీకరణ)కు ఆర్‌బీఐ అనుమతిచ్చింది. రూ.25 కోట్ల లోపు ఎంఎస్ఎంఈ రుణాలకు మాత్రమే ఈ పథకం ద్వారా లబ్ధి పొందే అర్హత కల్పించింది. 2020, మార్చి 31 కల్లా రుణ పునర్వ్యవస్థీకరణను అమలు చేయాల్సి ఉంటుంది. పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీ అమలుతో కుదేలైన ఎంఎస్ఎంఈ రంగానికి ఊరట కల్పించాలని ప్రభుత్వం ఆర్‌బీఐని కోరింది. ఆర్‌బీఐతో ప్రభుత్వ విభేధాలకు ఈ అంశం కూడా ఒక కారణం.

ఏపీలో ఆర్ఓసీ కార్యాలయం ప్రారంభం

పాల్గొన్న దక్షిణ, ఈశాన్య రాష్ట్రాల ప్రాంతీయ ఆర్ఓసీ షా



ఏపీలో ఆర్ఓసీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ షా

విజయవాడ (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఆంధ్రప్రదేశ్ (ఏపీ) రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్ఓసీ) కార్యాలయం ప్రారంభమైంది. ఇప్పటి వరకూ తెలుగు రాష్ట్రాలకు హైదరాబాద్‌లోని ఆర్ఓసీ సేవలందిస్తోంది. సూర్యారావుపేటలో ఏర్పాటు చేసిన ఈ నూతన కార్యాలయాన్ని ఆర్ఓసీ దక్షిణ, ఈశాన్య రాష్ట్రాల ప్రాంతీయ డైరెక్టర్ ఎంపీ షా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఆర్ఓసీ మిశ్రా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఏపీ తొలి ఆర్ఓసీగా డెన్నింగ్ కె బాబు ప్రత్యేక పూజల అనంతరం బాధ్యతలు స్వీకరించారు. తొలి ఏఆర్ఓసీగా సాయి శంకర్ నియమితులయ్యారు. అనంతరం షా మాట్లాడుతూ.. రాష్ట్రంలో దాదాపు 30 వేల కంపెనీలు ఉన్నాయని, వాటిలో 18 వేల కంపెనీలు చురుగ్గా కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి నెలా 1000 కంపెనీలు రిజిస్టర్ అవుతున్నాయని చెప్పారు. తెలంగాణ ఆర్ఓసీ మిశ్రా మాట్లాడుతూ.. కంపెనీలు పెట్టే వారికి ఆర్ఓసీపై అవగాహన కల్పించాలని కోరారు. డెన్నింగ్ కె బాబు మాట్లాడుతూ.. భారతదేశంలో ఏపీ ఆర్ఓసీ ఒక మోడల్‌గా తయారవుతుదన్న ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో షెల్ కంపెనీలు లేకుండా చేస్తామని ఆయన స్పష్టం చేశారు. రాబోయే అయిదేళ్లలో ఇక్కడ 5 లక్షల కంపెనీలు ఏర్పాటయ్యే అవకాశం ఉందన్నారు. కంపెనీలు ఎక్కువగా విజయవాడ, గుంటూరు, రాజమండ్రి, కాకినాడ, వైజాగ్ ప్రాంతాల్లో ఉన్నాయని తెలిపారు.

రూ. 94,726 కోట్లు

డిసెంబరు జీఎస్‌టీ వసూళ్లు

న్యూఢిల్లీ: గత ఏడాది డిసెంబరులో జీఎస్‌టీ వసూళ్లు రూ.94,726 కోట్లుగా నమోదయ్యాయి. నవంబరులో నమోదైన రూ.97,637 కోట్ల వసూళ్లతో పోలిస్తే గణనీయంగా తగ్గాయి. మంగళవారం కేంద్ర ఆర్థిక శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం.. డిసెంబరు 30 నాటికి 72.44 లక్షల సేల్స్ రిటర్నులు (జీఎస్‌టీఆర్-3బీ) దాఖలయ్యాయి. గత ఏడాది ఆగస్టు నుంచి సెప్టెంబరు మధ్య కాలానికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు రూ.11,922 కోట్ల పరిహారం చెల్లించింది. డిసెంబరులో వసూలైన మొ త్తం పన్ను ఆదాయంలో సెంట్రల్ జీఎస్‌టీ రూ.16,442 కోట్లు, స్టేట్ జీఎస్‌టీ రూ.22,459 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.47,936 కోట్లు, లగ్జరీ, హానికారక ఉత్పత్తులపై జీఎస్‌టీకి అదనంగా వసూలు చేసిన సుంకం రూ.7,888 కోట్లుగా నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2018-19)లో కేవలం ఏప్రిల్, సెప్టెంబరు నెలల్లో మాత్రమే జీఎస్‌టీ వసూళ్లు రూ.లక్ష కోట్ల మైలురాయిని అధిగమించగలిగాయి.

కొత్త 'వార్షిక జీఎస్‌టీ ఫారమ్' నోటిఫై

వార్షిక జీఎస్‌టీ రిటర్నుల దాఖలు కోసం కేంద్ర ప్రభుత్వం కొత్త ఫారాన్ని ప్రకటించింది. జీఎస్‌టీ నెట్‌వర్క్‌లో నమోదు చేసుకున్న వ్యాపారస్థులు ఈ ఏడాది జూన్ 30లోగా ఈ వార్షిక జీఎస్‌టీ ఫారాన్ని సమర్పించాల్సి ఉంటుంది. ఈ ఫారమ్‌లో వ్యాపారస్థులు తాము జరిపిన విక్రయాలు, కొనుగోళ్లతోపాటు 2017-18 ఆర్థిక సంవత్సరానికి గాను పొందిన ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ ప్రయోజన వివరాలను పొందుపర్చాల్సి ఉంటుంది.



నాన్ ఫైలర్స్‌కు లేట్ ఫీజు మాఫీ

2017, జూలై నుంచి 2018, సెప్టెంబరు మధ్యకాలానికి సంక్షిప్త, తుది విక్రయాల రిటర్నులను దాఖలు చేయకపోవడంతోపాటు పన్ను చెల్లించని వ్యాపారస్థులకు లేట్ ఫీజును మాఫీ చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. అయితే, వీరు ఈ 15 నెలల కాలానికి సంబంధించిన రిటర్నులను 2019, మార్చి 31లోగా సమర్పించాల్సి ఉంటుందని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇండైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్ (సీబీఐసీ) స్పష్టం చేసింది.

విమాన ఇంధనం పెట్రోల్ కంటే చౌక!

14.7 శాతం తగ్గిన ధర

న్యూఢిల్లీ: విమానాల్లో ఉపయోగించే ఇంధనం ఇప్పుడు పెట్రోల్, డీజిల్ కంటే చౌకగా మారింది. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు గణనీయంగా తగ్గిన నేపథ్యంలో ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ఈనెల 1న విమాన ఇంధన (ఏటీఎఫ్) ధరను 14.7 శాతం తగ్గించాయి. దీంతో, ఢిల్లీలో కిలో లీటరు (1,000 లీటర్లు) ఏటీఎఫ్ ధర రూ.9,900 తగ్గి రూ.58,060.97కు జారుకుంది. ఈ చొప్పున ఒక లీటరు విమాన ఇంధనం సుమారు రూ.58కే లభించనుంది. మంగళవారం నాడు ఢిల్లీలో లీటరు పెట్రోల్ ధర రూ.68.65, డీజిల్ రూ.62.66గా నమోదైంది. ఈ లెక్కన విమాన ఇంధనం పెట్రోల్, డీజిల్ కంటే తక్కువకు లభించనుందన్నమాట.

నత్తనడకే..!

న్యూఢిల్లీ: దేశీయ వాహన తయారీ రంగానికి 2018 ముగింపు నిరాశనే మిగిల్చింది. డిసెంబరులోనూ వాహన విక్రయాలు మందకొడిగానే సాగాయి. ప్రధాన సంస్థల్లో కొన్నింటి అమ్మకాలు స్వల్ప వృద్ధిని నమోదు చేసుకోగా.. మరికొన్ని క్షీణతను కనబర్చాయి. సంవత్సరాంతర డిస్కౌంట్ ఆఫర్లు కూడా కార్ సేల్స్‌కు పెద్దగా ఊతమివ్వలేకపోయాయి. కొనుగోలుదారుల్లో సెంటిమెంట్ బలహీనపడటంతోపాటు మార్కెట్లో ద్రవ్య కొరత ఇందుకు ప్రధాన కారణమైంది. గత నెలలో మారుతి సుజుకీ, హ్యుం డయ్ మోటార్స్, హోండా కార్స్, టాటా మోటార్స్ సేల్స్ సింగిల్ డిజిట్‌కు పరిమితం కాగా.. మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్ ఎం) వాహన విక్రయాలు తగ్గుముఖం పట్టాయి. కొత్త ఏడాదిలో పరిస్థితులు మళ్లీ మెరుగుపడవచ్చని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ మార్కెట్ నుంచి వాహనాలకు డిమాండ్ పెరగవచ్చని వారు ఆశాభావంతో ఉన్నారు.



డిసెంబరులో వాహన విక్రయాలు

కంపెనీ	2018	2017	వృద్ధి /క్షీణత(%)
కార్లు			
మారుతి సుజుకీ	1,21,479	1,19,286	1.8
హ్యుండయ్ మోటార్స్	42,093	40,158	4.6
హోండా కార్స్	13,139	12,642	4.0
టాటా మోటార్స్	14,260	14,180	1.0
ఎం అండ్ ఎం	15,091	15,543	-3.0
ద్విచక్ర వాహనాలు			
రాయల్ ఎన్‌ఫీల్డ్	56,026	65,367	-14.0
ట్రాక్టర్లు			
మహీంద్రా	17,404	18,488	-6.0
ఎస్కార్ట్స్	4,212	3,476	27.5
వాణిజ్య వాహనాలు			
వీఈ కమర్షియల్ వెహికిల్స్	6,236	6,087	2.4

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం	వెండి	రూపాయి డాలర్	ముడి చమురు
36254.57 ▲ 186.24	10910.10 ▲ 47.55	31,660 ▼ 50	38,245 ▼ 5	69.43 ▲	53.80 ▲

ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)

పామాయిల్‌పై దిగుమతి సుంకం కోత

న్యూఢిల్లీ: ఆసియాన్ దేశాల నుంచి దిగుమతి చేసుకునే ముడి పామాయిల్, రిఫైన్డ్ పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని ప్రభుత్వం తగ్గించింది. ఈ నిర్ణయం తక్షణం అమల్లోకి వస్తుంది. ఆగ్నేయాసియా దేశాలతో ఉన్న ప్రాధాన్యతా వాణిజ్య ఒప్పందాలకు అనుగుణంగానే ఈ చర్య తీసుకున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. మలేషియా నుంచి దిగుమతి చేసుకునే పామాయిల్‌పై సుంకాన్ని 54 శాతం నుంచి 45 శాతానికి, ఇండోనేషియా, ఇతర ఆసియాన్ సభ్య దేశాల నుంచి దిగుమతి చేసుకునే పామాయిల్‌పై సుంకాన్ని 44 శాతం నుంచి 40 శాతానికి తగ్గించినట్టు కేంద్ర పరోక్ష పన్నుల బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. భారత దిగుమతి చేసుకునే వంటనూనెల్లో పామాయిల్ వాటాయే అధికం.

అరబిందో
రక్తపోటు ఔషధం రీకాల్

న్యూఢిల్లీ: అధిక రక్తపోటు తద్వారా గుండె పోటు నివారణకు ఉపయోగించే 80 లాట్లతో కూడిన టాబ్లెట్లను అరబిందో ఫార్మా అమెరికా విభాగం స్వచ్ఛందంగా రీకాల్ చేసింది. ఎన్-నిట్రోసోడైమిథైలమైన్ పేరిట మార్కెట్లో ఉన్న ఆ టాబ్లెట్లలో కొన్ని మలినాలున్నట్టు గుర్తించామంటూ ఇచ్చిన సమాచారం ఆధారంగా తాము వాటిని ఉపసంహరించుకున్నట్టు యూఎస్ ఎఫ్‌డీఎకు తెలిపింది. అమ్లోడిపిన్ వల్సర్టాన్, వల్సర్టాన్ హెచ్‌సీటీజెడ్, వల్సర్టాన్ పేరిట అరబిందో మార్కెటింగ్ చేస్తోంది. రీకాల్ చేసిన లాట్లలోని టాబ్లెట్లు ఇప్పటికే కొనుగోలు చేసిన వారు వాటిని ఉపయోగించవద్దని తెలిపింది.

శుభారంభం



10900 ఎగువన నిఫ్టీ

ముంబై: కొత్త సంవత్సరం తొలి రోజున స్టాక్ మార్కెట్లు లాభాలతో ముగిసాయి. మంగళవారం ట్రేడింగ్ ఆరంభంలో సూచీలు తీవ్ర ఆటుపోట్లకు లోనైనా చివరి గంటలో కోలుకుని లాభాల బాటపట్టాయి. కొనుగోళ్ల మద్దతుతో సెన్సెక్స్ 186.24 పాయింట్ల లాభంతో 36254.57 పాయింట్ల దగ్గర, నిఫ్టీ 47.55 పాయింట్ల లాభంతో 10910.10 వద్ద ముగిశాయి. మొండి బకాయిల భారం నుంచి బ్యాంకింగ్ రంగం కోలుకుంటోందన్న ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ వ్యాఖ్యలు బ్యాంకింగ్ షేర్లకు టానిక్‌లా పని చేశాయి. అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు, డాలర్‌తో రూపాయి మారకం రేటు మరింత పుంజుకోవడం దేశీయ స్టాక్ మార్కెట్లకు కలిసొచ్చింది. అయితే నిధుల లభ్యత (లిక్విడిటీ), వచ్చే వారం నుంచి వెలువడనున్న కంపెనీల ఆర్థిక ఫలితాలు రానున్న రోజుల్లో మార్కెట్ గమనాన్ని నిర్దేశిస్తాయని బీఎన్‌పీ పారిబా అనుబంధ సంస్థ 'షేర్‌ఖాన్' అడ్వైజరీ హెడ్ హేమాంగ్ జానీ అంచనా వేస్తున్నారు. వాణిజ్య యుద్ధ భయాలు, నిరసిస్తున్న అంతర్జాతీయ ఆర్థిక వృద్ధి, చమురు ధరలపై కొనసాగుతున్న అనిశ్చితి, లోక్‌సభ ఎన్నికలు, డాలర్‌తో రూపాయి ఆటుపోట్లు ఈ ఏడాది మార్కెట్లను తీవ్ర ఆటుపోట్లకు లోను చేసే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

బ్యాంకింగ్, ఫైనాన్షియల్, టెలికాం, ఐటీ, ఆటోమొబైల్, ఫార్మా కంపెనీల షేర్లు మంగళవారం చురుగ్గా ట్రేడయ్యాయి. సెన్సెక్స్ షేర్లలో భారతి ఎయిర్‌టెల్ షేరు అత్యధికంగా 2.76 శాతం లాభపడింది. కొనుగోళ్ల మద్దతుతో హెచ్‌డీఎఫ్‌సీ, యెస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, హీరో మోటోకార్ప్, టాటా మోటార్స్, సన్ ఫార్మా, బజాజ్ ఫైనాన్స్, టీసీఎస్, పవర్‌గ్రిడ్, ఐటీసీ, బజాజ్ ఆటో, మారుతి, కోల్ ఇండియా, ఎల్ అండ్ టీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు లాభాల బాట పట్టాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా స్టీల్, ఓఎన్‌జీసీ, హెచ్‌యూఎల్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎన్‌టీపీసీ, ఏషియన్ పెయింట్స్, వేదాంత, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ కంపెనీల షేర్లు మాత్రం అమ్మకాల ఒత్తిడితో 3.75 శాతం వరకు నీరసించాయి.

భారీ లాభాల్లో అతుల్ ఆటో షేరు

రాజ్‌కోట్‌కు చెందిన అతుల్ ఆటో కంపెనీ షేరు మంగళవారం బీఎస్‌ఈలో భారీ లాభాలతో ట్రేడయింది. ఈ కంపెనీ షేరు సర్క్యూట్ బ్రేక్ రేసు తాకి 19.99 శాతం లాభంతో రూ.348.20 దగ్గర ముగిసింది. డిసెంబరులో ఈ కంపెనీ విక్రయాలు 49.90 శాతం పెరగడం ఇందుకు ప్రధాన కారణం.

లాభాల్లో ట్రేడింగ్ కార్పొరేషన్ షేరు

విశాఖపట్నం కేంద్రంగా పనిచేసే ట్రేడింగ్ కార్పొరేషన్ షేరు మంగళవారం పరుగులు తీసింది. బీఎస్‌ఈలో ఒక దశలో 8.44 శాతం లాభపడిన ఈ కంపెనీ షేరు చివరికి 6.64 శాతం లాభంతో రూ.470.45 దగ్గర స్థిరపడింది.

రుణపత్రాల ఈటీఎఫ్‌లకే ప్రభుత్వ కంపెనీల మొగ్గు



న్యూఢిల్లీ: మూలధన పెట్టుబడి అవసరాల కోసం పాక్షికంగా నిధుల సమీకరణకు రుణపత్రాల ఈటీఎఫ్ రూపంలో నిధులు సమీకరించుకునేందుకు 12కి పైగా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు ఆసక్తిని ప్రదర్శిస్తున్నాయి. ట్రిపుల్ ఎ, డబుల్ ఎ రేటింగ్ గల సీపీఎస్ఈలను తొలుత ఈటీఎఫ్ బాటలో బాండ్లు జారీ చేయడానికి తొలుత అనుమతించనున్నట్టు ఆర్థిక శాఖ అధికారి ఒకరు తెలిపారు. గతంలో జారీ చేసిన సీపీఎస్ఈ ఈటీఎఫ్, భారత్-22 ఈటీఎఫ్‌లు సాధించిన విజయాన్ని పరిశీలించిన ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ డెట్ ఈటీఎఫ్‌లకు కూడా అనుమతించనున్నట్టు 2018-19 బడ్జెట్ సందర్భంగా ప్రకటించారు.

ప్రభుత్వ రంగ బ్యాంకులు కూడా డెట్ ఈటీఎఫ్‌ల ద్వారా నిధులు సమీకరించుకోవచ్చునని ఆర్థిక శాఖ ప్రకటించింది. డెట్ ఈటీఎఫ్‌లతో ఇన్వెస్టర్ల పరిధి విస్తరించడంతో పాటు నిధుల సమీకరణలో పారదర్శకత ఉంటుందంటున్నారు. దేశంలో కార్పొరేట్ బాండ్ల మార్కెట్ పరిమాణం జీడీపీలో 13 శాతం మాత్రమే ఉంది. అందులో ప్రభుత్వ బాండ్ల మార్కెట్ వాటా 30.4 శాతం ఉంది.

10900 పైన ముగింపు నిలకడ

టెక్ వ్యూ

మార్కెట్ కరెక్షన్‌లోనే ప్రారంభమై 10800 వరకు దిగజారినా సుదీర్ఘ కన్సాలిడేషన్ అనంతరం చివరి సెషన్‌లో నిలకడగా కోలుకుని పాజిటివ్‌గా క్లోజయింది. డే గరిష్ఠ స్థాయి 10900 కన్నా పైన క్లోజ్ కావడం మరింత పాజిటివ్ ట్రెండ్ ఉంటుందనేందుకు సంకేతం. అలాగే 10, 20 డిఎంఎల కన్నా పైనే క్లోజ్ కావడం కూడా సానుకూలతను సూచిస్తోంది.

బుధవారం స్థాయిలివే...

నిరోధం: 11000 మద్దతు: 10800

- మరింత అప్‌ట్రెండ్ కోసం మైనర్ నిరోధం 10960 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 11000. ఆ పైన కనీసం రెండు రోజుల పాటు బలంగా క్లోజయినప్పుడే ర్యాలీ మరింతగా కొనసాగుతుంది.
- మైనర్ మద్దతు స్థాయి 10860 కన్నా దిగువన ట్రేడయితే ఇంట్రాడే బలహీనతలో పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 10800. అంతకన్నా దిగజారితే మరింత కరెక్షన్ తప్పదు.
- బ్యాంక్ నిఫ్టీ ఇంట్రాడే మైనర్ కరెక్షన్ అనంతరం బలమైన రికవరీతో ఇటీవల ఏర్పడిన గరిష్ఠ స్థాయిల కన్నా పైన క్లోజయింది. ఇది ట్రెండ్‌లో సానుకూలతను సూచిస్తోంది.

■ వి.సుందర్ రాజా

ప్రథమార్ధం మెరుగు

ఆస్ట్రో వ్యూ

తిథి: మార్గశిర బహుళ ద్వాదశి
నక్షత్రం: అనూరాధ

భరణి, పుబ్బ, పూర్వాషాఢ నక్షత్ర జాతకులు, ధనుస్సు, మేష రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ: 10910.10 (47.55)
ట్రెండ్ మార్పు వేళలు: 9.37

ధోరణి: నిఫ్టీ ఫ్యూచర్స్ 9.50 వరకు నిస్తేజంగా ట్రేడయి ఆ తర్వాత 11.40 వరకు మెరుగ్గాను, 11.40 నుంచి 1.10 మధ్యన నిలకడగాను ట్రేడ్ కావచ్చు. 1.10 నుంచి చివరి వరకు బలహీనంగా మారవచ్చు.

ట్రేడింగ్ వ్యూహం: నిఫ్టీ ఫ్యూచర్స్ 10 గంటల సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 11.45 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 1.15 తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయంలో క్లోజ్ చేసుకోవలసి ఉంటుంది.

నిరోధం: 10950, 10985
మద్దతు స్థాయిలు: 10870, 10735


ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

గమనిక: ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinanciala strologer.blogspot.in

టెక్నికల్స్ సానుకూలమే..

సరైన సమయంలో సరైన షేర్ల కొనుగోలు వ్యూహం మంచిది



2019

స్టాక్ మార్కెట్‌కు రానున్న రోజులు సానుకూలంగానే ఉంటాయి. నెలవారీ చార్టుల ప్రకారం గత మూడు నెలల కాలంలో నిఫ్టీ కన్సాలిడేషన్ ధోరణిలో నడిచింది. 2018 అక్టోబరు నెలలో దీర్ఘకాలిక మద్దతు స్థాయి 10000 వద్ద మద్దతు తీసుకుని నవంబరులో ఎగువకు బలమైన రివర్సల్ సాధించింది. చార్టుల ప్రకారం డిసెంబరు నెల అంతా స్థూల నిలకడ ధోరణిని ప్రదర్శించింది. అలాగే 20 నెలల చలన సగటు వద్ద (చార్టులో ఎర్రగా కనిపిస్తున్న రేఖ) కూడా మద్దతు తీసుకుంది. అలాగే 10 నెలల చలన సగటు వద్ద (చార్టులో నీలంగా కనిపిస్తున్న రేఖ) నిలదొక్కుకుంటోంది. ఇవన్నీ సానుకూలతకు సంకేతాలు. దీన్ని బట్టి చూస్తే సాధారణ పరిస్థితుల్లో కొత్త సంవత్సరం కదలికలు సానుకూలంగానే ఉండవచ్చు. ఆర్ఎస్ఐ సూచీ 50 స్థానాలు దిగువకు రావడం కూడా సానుకూలత సంకేతం. గత మూడు నెలల కదలికలను గమనిస్తే 11000 వద్ద టాప్ ఏర్పడింది. ఇక్కడే నిలదొక్కుకోలేకపోతోంది. మరింత అప్‌ట్రెండ్‌లో పురోగమించాలంటే ఇక్కడ బ్రేకౌట్ తప్పనిసరి. టెక్నికల్స్ ప్రకారం 2019లో మార్కెట్ అప్‌ట్రెండ్‌లో పురోగమించే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. కాని మార్కెట్లో పెట్టుబడి నియమాలను మాత్రం ఇన్వెస్టర్లు గుర్తుంచుకుని తీరాలి. ఫండమెంటల్స్ పటిష్ఠంగా ఉన్న కంపెనీలు, ధరలు కనిష్ఠంగా ఉన్న షేర్ల కొనుగోలు, షేర్ల కదలికలు నిరంతరం ట్రాక్ చేయటం మంచిది. వరుసగా కొద్ది నెలలుగా ఆటుపోట్లకు లోను కాకుండా నిలకడగా ట్రేడవుతున్న కంపెనీలను ఫండమెంటల్స్ పటిష్ఠంగా ఉండడంతో పాటు భవిష్యత్‌లో వృద్ధి అవకాశాలు గలవిగా పరిగణించాలి. మార్కెట్లో కరెక్షన్ వచ్చినప్పుడల్లా తక్కువ ధరకు అందుబాటులో ఉన్న మంచి కంపెనీల షేర్లు కొనుగోలు చేయాలి. షేరులో ఏ మాత్రం బలహీనత కనిపించినా వైదొలగడానికి సంసిద్ధులు కావాలి.

ఏడాదంతా ఎగుడు దిగుడులే..

2018 సంవత్సరం మొత్తంలో మార్కెట్ తీవ్ర ఆటుపోట్లతో సైడ్‌వేస్ ధోరణిలో నడిచింది. ఏడాది మొత్తానికి 10860 వద్ద ముగిసింది. 2017 ముగింపు 10530 పాయింట్ల కన్నా స్వల్పంగా పైన క్లోజయింది. ఆగస్టులో 10500 నుంచి మంచి ర్యాలీ సాధించి 1300 పాయింట్ల మేరకు లాభపడి 11800 వరకు వెళ్లగలిగింది. కాని సెప్టెంబరు నుంచి తిరిగి బేర్ల పట్టులోకి జారుకుని 1800 పాయింట్ల మేరకు నష్టపోయింది. తిరిగి గత రెండు నెలలుగా మందకొడిగా రికవరీ సాధిస్తూ 10870 వద్ద నిలిచింది. ప్రస్తుతం మార్కెట్ ఆరు నెలల కాలవ్యవధి ఉండే బలమైన స్వల్పకాలిక సైకిల్‌లో ఉంది.

\- వి.సుందర్ రాజా

ఉక్కు విక్రయాల్లో 29% వృద్ధి

వైజాగ్ స్టీల్ సీఎండీ పీకే రథ్



సమావేశంలో మాట్లాడుతున్న పీకే రథ్

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): డిసెంబరు చివరి నాటికి రూ.14,687 కోట్ల విలువైన ఉక్కు ఉత్పత్తులను విక్రయించినట్లు రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్, వైజాగ్ స్టీల్) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పీకే రథ్ వెల్లడించారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2017తో పోల్చితే అమ్మకాల్లో 29 శాతం (రూ.11,395 కోట్లు) వృద్ధిని సాధించినట్లు చెప్పారు. నిర్వహణాపరంగా వైజాగ్ స్టీల్ 20 శాతం వృద్ధిని సాధించిందని అన్నారు. హాట్ మెటల్ తయారీలో పల్వనైజ్డ్ కోల్ ఇంజెక్షన్‌ను ఉపయోగించాలని, టన్నుకు 100 కిలోలు ఉపయోగిస్తే ఏడాదికి రూ.1,500 కోట్లు ఆదా అవుతుందన్నారు. ఈ దిశగా సాంకేతిక నిపుణులు దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు రాయ్ చౌదరి, వేణుగోపాల రావు, కేసీ దాస్ పాల్గొన్నారు.

అంచనాలను మించి పెట్టుబడుల ఉపసంహరణ!

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ (సీపీఎస్‌యూ)ల్లో పెట్టుబడుల ఉపసంహరణ (డిజిన్వెస్ట్‌మెంట్) ఈ ఆర్థిక సంవత్సరం కూడా నిర్దేశిత లక్ష్యాన్ని దాటే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ.80,000 కోట్లు సమీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గత ఏడాది జనవరి నుంచి డిసెంబరు వరకు ప్రభుత్వ ఖజానాకు రూ.77,417 కోట్లు సమకూరాయి. హెచ్‌పీసీఎల్ ఈక్విటీలో ప్రభుత్వానికి ఉన్న 51.10 శాతం వాటాలను ఓఎన్‌జీసీ రూ.36,915 కోట్లకు కొనుగోలు చేయడం ఇందుకు బాగా కలిసొచ్చింది. ఈ సంవత్సరం మార్చి నాటికల్లా హెలికాప్టర్ సేవల కంపెనీ పవన్ హన్స్ ఈక్విటీలో ఉన్న 51 శాతం వాటాలను విక్రయించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికితోడు ఓఎన్‌జీసీ, ఐఓసీ, ఆయిల్ ఇండియా, ఎన్ఎల్‌సీ, బీహెచ్ఈఎల్, నాల్కో వంటి 10 సీపీఎస్‌యూల్లో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ.12,000 కోట్లు సమకూరతాయని అంచనా. ఇవికాకుండా పీఎఫ్‌సీలో ఆర్ఈసీ విలీనం, ఎన్‌టీపీసీలో ఎస్‌జేవీఎన్ విలీనం ద్వారా మరో రూ.21,000 కోట్లు సమకూరే అవకాశం ఉంది.

బీఎస్‌ఈలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు (BSE)

ACI INFOCOM .58(.58)8
ADITYA SPIN. 7.84(7.89)1000
AGRO TECH FO 611.5(604.75)2148
AISHWARYA TE 2.67(2.55)5000
ALPHAGEO (I) 479.95(474.8)271
ALU FLUORIDE 123.85(123.1)685
AMAR RAJA BA 739.65(742.75)7307
ANDHRA BANK 29.75(29.3)64011
ANDHRA CEMEN 5.96(5.95)2771
ANDHRA PETRO 58.2(57.4)37525
ANJANI PORTL 130(130)159
ASTRA MICRO 78.55(77.35)26527
AUROB.PHARMA 731.7(730.95)55537
AVANTEL LTD 226.55(230.25)1960
AVANTI FEEDS 389(385.55)11863
B.N.RATHI SE 27(27.35)100
BALAJI AMINE 459.5(459.35)1958
BAMBINO AGRO 199.2(191.35)334
BARTRONICSIN 7.22(7.39)856
BCG 2.71(2.68)26262
BHAGIRA.CHEM 443.7(449.45)1390
BHAGYA INL 31.35(32.3)2663
BHARATFIN 1011.95(1012.7)333714
BNR UDYOG 14.48(14.2)15
CAMBRIDGE 41.2(41.6)404
CCHHL 7.44(7.43)3169
CCL PRODUCTS 271.9(270.25)110
CELESTIAL 8.67(8.74)10507
CIL SECURITS 17.8(16.5)1023
COROM INTER 450.5(450.05)870
CUBEX TUBING 14.6(14.5)70
CYBERMATE 2.43(2.33)61646
CYIENT 618.2(619.05)864
DANLAW TECH. 104.9(106.15)920
DECAN CEMENT 400.25(419.5)76
DHAN ROTO SP 29(30.5)610
DIVI'S LAB. 1478.55(1482.2)11618
DIVYA.GRANIT 90.4(90.4)151
DQ ENT 8.15(7.85)361
DR.REDDY'S 2610.8(2617)16782
EMPEE SUGARS 1.27(1.33)295
EVEREST ORG. 103.85(103.5)961
FACOR ALLOYS 2.14(2.11)59187
GATI LTD. 86.3(86.9)36027
GAYATRI BIO 3.38(3.22)772
GAYATRI PROJ 179.05(175.85)6687
GENNEX LAB 3.7(3.81)42011
GMR INFRASTR 16.45(16.4)533265
GODAVARI DRU 23.2(23.5)757
GOLDSTONE EN 16.8(16.7)3004
GRANULES (I) 90.8(89.65)44471
GVK POWERINF 8.03(7.75)284283
HBL P SYS 28.85(28.8)6893
HERITGFOOD 528.75(527.6)1723
HIND.FLUROCA 17.25(17.3)250
IKF TECHNO .31(.31)35382
INCAP LTD. 43.1(42.4)348
IPAPPM 447.4(444.15)7072
IVRCL LTD 1.04(1)82115
KAKATIYA CEM 201.3(202.9)5826
KALLAM 18.4(18.2)1351
KAVERI SEED 576.1(574.25)19704
KCP LTD 92(92.35)351
KERNEX MICRO 23.2(23.9)4466
KNR CONST 210.4(213.5)6069
KREBS BIOCHM 109.45(108.25)15
LOKESH MACH 47.45(48.05)3934
LOTUS CHOC 24.4(24.45)1463
MADHUCON PRJ 6.62(6.66)19164
MOSCHIP SEMI 25.15(25.8)7302
MSR INDIA 11.85(12.35)7290
N C L IND. 139.05(135.75)829
NACLIND 27.5(27.7)204
NATCO PHARM 696.95(680.8)21454
NCC 88.85(88.1)483394
NEHA INTER. 4.68(4.89)5016
NETTLINX LTD 50.7(50)34162
NEULAND LAB. 471.9(459)97
NIHAR INFO 14.33(13.65)500
NILE LTD. 385(385.65)1472
NTL 1(1)230
OIL COUNTRY 17.5(16.58)7395
OLECTRA 230.45(233.45)18186
PADMALAYA TE 2.33(2.44)1765
PALRED 48.35(40.3)13219
PANYAM CEMEN 13.51(13.4)1010
PENNAR STEEL 36.9(36.4)23794
PFL INFOTECH 8.5(8.5)100
PHYTOCHEM I. 48.5(49)1228
PITTIENG 72.4(72.85)12905
POKARNA LTD 163.05(166.45)326
PRAJAY ENGS. 8.95(8.88)1188
PREMIER EXPL 240.8(240.25)866
PRSMJOHNSN 89.6(88.9)15113
RAIN 135.95(134.25)60090
RAJ PACKAGIN 30(28.05)437
REG.CERAMIC 3.21(3.06)1
RESTILE CER. 4(4.19)170
SAGAR CEM. 695.6(683.25)48
SAMKRG PIST. 191.7(192.5)3398
SAMPRE NUTRI 40.5(39)50
SANGHI IND. 60.2(60.65)19856
SATVAH.ISPAT 10(9.98)2610
SAVEN TECHNO 23.4(22.3)17676
SIBAR AUTO 39(38)65
SMPL .37(.37)100
SREE RAYALA 157.3(155.95)549
STEEL EXCH 14.7(15.4)7995
SUJANA INDUS .34(.33)10252
SURANATP 4.51(4.6)100
SURYACHAKRA .37(.36)1210
SURYAMBA SP 69.05(66)3986
SURYAVA SPIN 4.53(4.53)4989
SURYLAK.COTT 42.55(42.1)57
SUVEN LIFE S 232.35(227.35)20795
TAJ GVK HOTL 178.5(175.4)2833
TANLA 30.7(30.55)6611
TRANSCORP IN 22.15(22.4)309
TRANSGENE BI 3.26(3.32)7500
TRANSPORT CO 283.7(286.35)436
USHER AGRO 2.5(2.55)2440
VICEROY HOTE 5.3(5.15)11164
VIJAY TEXTIL 42.9(43.9)1510
VIMTA LABS 319.1(314.25)7965
VIRAT CRANE 33.1(33)252
VIRINCHI 83.45(82.8)4271
VISAKA IND. 436.9(430.2)1071
VISTA PHARMA 29.35(29)3943
VIVIMED LABS 36.95(36.85)10399
VST INDUS. 3280(3279.2)59
WATERBASE 164.5(164.5)39056
XLENERGY .99(.95)15150
ZENOTECH 37.3(37.85)1101

ఎన్ఎస్ఈ-500 (NSE)
షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా

AARTIDRUGS 575.65(576.65)3283
AARTIIND 1448.6(1443.7)13244
ABAN 74.5(74.75)412633
ABB 1319.2(1336.75)66089
ABFRL 199.55(202.5)680668
ABGSHIP 2.05(2.1)22830
ACC 1488.8(1508.1)840791
ADANIENT 157.25(161)4726656
ADANIPORTS 389(387.7)1233249
ADANIPOWER 50.85(50.95)6302024
ADANITRANS 200.5(198.4)66954
AEGISCHEM 204(204.1)98426
AHLUCONT 324.8(326.5)25217
AIAENG 1674.4(1677.15)9131
AJANTPHARM 1181.7(1185.7)114936
AKZOINDIA 1769.55(1749.3)8460
ALBK 46.7(46.1)3600205
ALLCARGO 107.75(108.5)38570
ALOKTEXT 4.05(3.9)1334718
AMARAJABAT 738.8(742.85)189588
AMBUJACEM 222.9(225.1)1594627
ANANTRAJ 36.8(36.35)792327
ANDHRABANK 29.75(29.4)871331
APARINDS 665.6(660.25)2470
APLLTD 586.85(599.7)24980
APOLLOHOSP 1266.4(1258.3)292677
APOLLOTYRE 234.4(235.95)1125991
ARVIND 98.4(97.8)1507945
ASHIANA 118.45(121.2)42251
ASHOKA 124.95(124.4)68820
ASHOKLEY 102.5(102.5)13384173
ASIANPAINT 1371.55(1373.05)664707
ASTRAL 1128.8(1127.5)5383
ASTRAZEN 1443.6(1451.6)2448
ATUL 3443.2(3436.95)12907
AUROPHARMA 733.15(732.95)1340165
AXISBANK 627.3(619.9)12179223
BAJAJ-AUTO 2726.65(2720.15)304150
BAJAJCORP 373.4(369.15)25730
BAJAJELEC 513.55(504.5)322326
BAJAJFINSV 6521.95(6476.95)141821
BAJAJHIND 9(8.7)1855586
BAJAJHLDNG 2949.95(2950)56276
BALKRISIND 928.85(923.9)597058
BALLARPUR 5.45(5.5)218014
BALMLAWRIE 202.7(203.3)43325
BALRAMCHIN 103.4(102)1612055
BANKBARODA 123.3(118.8)23311973
BANKINDIA 106.35(104.1)11779714
BASF 1550.3(1539.45)7328
BATAINDIA 1126.05(1134.3)314687
BBTC 1323.9(1324.1)44727
BEML 903.35(905.2)1644698
BERGEPAINT 332.5(330.3)277826
BFUTILITIE 221.45(216.5)1018213
BGRENERGY 61.75(61.15)43839
BHARATFIN 1011.85(1012.7)143507
BHARATFORG 510.95(508.7)639790
BHARTIARTL 319.5(312.5)5513123
BHEL 73.8(73.1)6440421
BIOCON 625.8(629.05)750924
BIRLACORPN 593.65(600.2)65788
BLISSGVS 163(165)597113
BLUEDART 3413.75(3371.45)3533
BLUESTARCO 625.55(622.9)7084
BOMDYEING 115.75(113.75)740191
BOSCHLTD 19576.5(19611.2)4603
BPCL 367.2(362.75)1552711
BRFL 8.9(8.5)150444
BRIGADE 221(217.95)85328
CADILAHC 350.05(348.45)692062
CANBK 281.5(275.05)5419071
CARERATING 980.1(986.7)21965
CASTEXTECH 1.2(1.25)74768
CASTROLIND 151.15(151.25)293473
CCL 269.8(269.4)6114
CEATLTD 1293.6(1306.4)294382
CENTRALBK 37.2(36.65)938962
CENTURYPLY 176.45(177.85)138994
CENTURYTEX 922.4(922.95)315496
CERA 2367.5(2373.3)4377
CESC 671.3(668.35)263788
CHAMBLFERT 147.25(148.2)52242
CHENNPETRO 290.55(296.5)486310
CHOLAFIN 1255.15(1259.7)97211
CIPLA 523.05(519.5)1361809
CLNINDIA 417.1(419.25)4848
COALINDIA 241.5(240.75)2227003
COLPAL 1323.9(1343.55)534537
COROMANDEL 451.05(450.25)39632
CORPBANK 29.45(28.9)350749
COX&KINGS 164.1(166.3)16390
CRISIL 1619.4(1613.55)1390
CUB 193.8(195.05)151344
CUMMINSIND 848.45(849.7)244269
CYIENT 618.3(620)20880
DABUR 421.85(430.65)1617567
DBCORP 171.2(169.3)14570
DBREALTY 31.05(28.3)3130843
DCBBANK 169.25(169.25)1068407
DCMSHRIRAM 343.05(338.4)39705
DEEPAKFERT 149.4(148.65)167802
DELTACORP 251.7(253.6)783921
DEN 70.5(70.3)26730
DENABANK 18(17.1)4763349
DHANUKA 445.1(464.75)52200
DHFL 246.35(249.4)5893712
DISHTV 38.05(38.25)1943158
DIVISLAB 1475.45(1482.65)254899
DLF 180.3(177.55)6246700
DREDGECORP 469.75(440.8)11083307
DRREDDY 2607.05(2616.5)338757
DYNAMATECH 1490.6(1503)971
ECLERX 1075.15(1074.35)1352
EDELWEISS 183.15(182.2)374378
EICHERMOT 23195.1(23158.35)44434
EIDPARRY 206.3(206.65)15953
EIHOTEL 195.6(197.95)90567
ELECTCAST 21.35(21.65)61658
ELGIEQUIP 259.25(261.25)37006
EMAMILTD 418.05(420.1)99409
ENGINERSIN 126.65(125)623948
EROSMEDIA 87.15(87.75)441492
ESCORTS 719.8(706.1)3301665
ESSDEE 22.1(21.05)9872
ESSELPACK 109.4(109.7)289955
EVEREADY 185.9(187.6)43692
EXIDEIND 267.5(267.95)735215
FCONSUMER 45.9(45.55)680837
FDC 173.05(172.1)72715
FEDERALBNK 93(93.25)6000894
FINCABLES 454.6(454.2)14766
FINPIPE 548.95(544.55)5814
FLFL 407.05(420.95)39719
FORTIS 140.2(140.5)624458
FSL 48.6(46.9)2201383
GAIL 362.15(360.3)2134503
GATI 86.45(86.95)285852
GDL 125.1(129.5)525291
GEPIL 821.3(835.1)9597
GESHIP 314.35(315.75)5539
GET&D 298.7(292.65)33544
GILLETTE 6467.7(6498.95)1326
GLAXO 1498(1515.35)4785
GLENMARK 692.15(693.05)436483
GLOBOFFS 14.4(14.3)706
GMDCLTD 90.45(89.2)44084
GMRINFRA 16.4(16.4)5340382
GODFRYPHLP 879.8(887.05)98177
GODREJCP 807.35(810.65)297709
GODREJIND 543.6(546.45)254615
GODREJPROP 660.3(652.7)288266
GPPL 102.35(102.65)33291
GRANULES 90.8(89.75)747168
GREAVESCOT 119.25(118.55)159481
GREENPLY 139.15(138)65591
GRINDWELL 559.25(561.1)10666
GRUH 322.15(316.05)330120
GSFC 116.3(116.2)2192797
GSKCONS 7571.55(7645.25)6702
GSPL 175.4(175.85)35780
GUJFLUORO 904.2(908.85)10176
GUJGASLTD 669.05(670.05)6422
GULFOILLUB 804.95(821.2)5632
GVKPIL 8(7.75)2290965
HATHWAY 30.75(30.8)175411
HAVELLS 694.8(691.5)413338
HCC 13.5(13.1)46287397
HCL-INSYS 25.55(25.05)536651
HCLTECH 959.85(964.35)358734
HDFC 2009(1968.35)1305443
HDFCBANK 2148.1(2121.7)1593360
HDIL 26.5(26.3)9111893
HEIDELBERG 152.95(151.15)47929
HEROMOTOCO 3127.6(3104.25)344239
HEXAWARE 332.3(332.9)470450
HFCL 21.3(21.2)1583059
HIMATSEIDE 215.45(213.35)28986
HINDALCO 222.75(226.2)5015702
HINDCOPPER 52.1(52.45)978575
HINDPETRO 256.7(253.25)2829660
HINDUNILVR 1801.1(1819.65)807345
HINDZINC 277.85(278.65)151753
HMT 20.45(20.95)2047
HMVL 126.2(128.5)3040
HONAUT 21885.8(21995.65)153
HOTELEELA 15.25(15.45)392242
HSIL 236.25(234.8)50582
HTMEDIA 39.85(39.8)163597
IBREALEST 88.5(87.45)2029550
IBULHSGFIN 844.75(853.85)3102007
ICICIBANK 363.75(360.15)7759872
ICRA 3196.45(3198.7)237
IDBI 61.45(61.25)1127959
IDEA 37.75(37.75)8804237
IDFC 43.45(43.6)1293347
IFBIND 853.95(845.6)1376
IFCI 15.05(14.95)10846028
IGARASHI 565.85(568.4)6236
IIFL 499.9(504.2)40446
IL&FSTRANS 13.3(13.95)695827
INDHOTEL 146(147.7)363842
INDIACEM 96(96.1)2222552
INDIANB 251.35(243.55)2285555
INDOCO 217.95(216.55)3850
INDUSINDBK 1595.6(1599.3)4043870
INEOSSTYRO 696.45(691.75)2069
INFRATEL 262.25(259)799064
INFY 665.05(658.95)2943390
INGERRAND 614.05(604.75)32685
INOXLEISUR 246.2(247.35)80509
INOXWIND 77.1(76.8)26338
INTELLECT 228.9(224.6)271005
IOB 15(14.95)1497222
IOC 137.7(137.05)4059229
IPAPPM 446.8(443.35)75580
IPCALAB 816.35(802.1)63581
IRB 164.85(164.15)880517
ITC 282.7(281.65)2490548
J&KBANK 38.6(37.7)430485
JAGRAN 115.05(116.75)45195
JAICORPLTD 117.1(111.3)4183947
JBCHEPHARM 311.25(305.9)18282
JBFIND 22.5(22.45)98272
JCHAC 1811.75(1820.75)1263
JETAIRWAYS 280.8(277.45)7699462
JINDALPOLY 234.4(232.4)7824
JINDALSTEL 162.9(164.9)6180841
JISLJALEQS 69(69.8)3122895
JKCEMENT 719.25(713.55)14952
JKIL 132.75(132.95)32660
JKLAKSHMI 311.4(293)335718
JKTYRE 103.8(103.7)371151
JMFINANCIL 92.8(93.85)199302
JPASSOCIAT 7.75(7.7)19506581
JPINFRATEC 3.9(3.8)873313
JPPOWER 2.1(2.05)5148897
JSWENERGY 69.75(68.65)697008
JSWHL 2291.95(2305.6)239
JUBILANT 712.15(710.6)85141
JUBLFOOD 1250.85(1252)882074
JUSTDIAL 500.1(501.8)942954
JYOTHYLAB 211.4(213.7)128957
KALPATPOWR 391.25(392.2)68471
KANSAINER 493.45(490.75)72670
KEC 302.4(301.45)126562
KESORAMIND 86.8(86.65)167203
KIRLOSENG 204.8(205.55)7342
KITEX 111.1(111.05)57114
KOLTEPATIL 260.95(238.4)1365114
KOTAKBANK 1250.45(1256.5)1202580
KPIT 217.1(218.1)376838
KRBL 280.25(281.65)51202
KSCL 576.3(574.65)234335
KSK 1.6(1.55)470331
KTKBANK 113.25(112.2)1464911
KWALITY 8.25(8.25)792126
L&TFH 153.15(152.6)3050999
LAKSHVILAS 86.85(87.15)278906
LAOPALA 218.75(219.95)15631
LAXMIMACH 5761.15(5738.8)2173
LICHSGFIN 486.55(488.7)639604
LT 1441.9(1437.55)786846
LUPIN 841.45(844.3)1122895
M&M 773.35(803.85)3442903
M&MFIN 471.8(473.65)596121
MAGMA 110.5(110)10572
MAHINDCIE 255.1(257)287078
MAHLIFE 405.7(390.15)29547
MANAPPURAM 92.5(93)993993
MANPASAND 88.55(88.85)225680
MARICO 372.3(373.4)877238
MARKSANS 28.2(27.85)812491
MARUTI 7476.8(7465.5)625360
MAYURUNIQ 398.75(388.4)8858
MCLEODRUSS 115.75(118.55)168795
MERCK 3156.65(3078.7)45932
MHRIL 213.2(211.95)78008
MINDACORP 148(147.7)72915
MINDTREE 863.4(864.5)399996
MMTC 30.9(30.9)1990963
MOIL 170.85(171.15)60585
MONSANTO 2611.35(2621.7)256
MOTHERSUMI 165.45(166.85)1687361
MOTILALOFS 661.75(670.15)34238
MPHASIS 1005.6(1018.45)114361
MRF 66801.2(66984.7)4193
MRPL 75.05(75.5)745220
MTNL 19.4(16.2)26959611
MUTHOOTFIN 512.5(516)573931
NATCOPHARM 694.35(680.05)112551
NATIONALUM 65.55(65.8)2170269
NAUKRI 1439(1440.65)76834
NAVKARCORP 56.9(56.7)264308
NCC 88.9(88.15)6101362
NETWORK18 40.3(40.8)165073
NHPC 25.95(26)1377350
NIITTECH 1151.5(1149.3)332711
NITINFIRE 1.85(1.8)39222
NLCINDIA 69.25(69.65)157646
NMDC 95.75(96.85)1265237
NTPC 148.7(149.05)3342569
OBEROIRLTY 454.7(440.85)312694
OFSS 3729.45(3707.75)11336
OIL 175.75(174.8)381570
OMAXE 213.6(213.75)350449
ONGC 148.5(149.9)4496586
ORIENTBANK 97.7(95.65)4090452
ORIENTCEM 84.55(81.35)39834
ORISSAMINE 984.35(976.9)32812
PAGEIND 24847.2(25238.85)33677
PARSVNATH 7.55(7.35)53659
PCJEWELLER 85.9(86.2)7520834
PEL 2395.3(2381.75)282866
PERSISTENT 626.1(622.65)51296
PETRONET 229(224.15)1537547
PFC 107.4(107.35)7046635
PFIZER 2871.55(2854.35)19306
PFS 17.45(17.35)175180
PGHH 9903.75(9884.1)3305
PHOENIXLTD 576.45(563.6)6667
PIDILITIND 1101.95(1107.85)191084
PIIND 864.2(862.45)77264
PNB 79.8(78.1)18609031
POWERGRID 200(198.65)2228415
PRAJIND 111.2(109.7)516424
PRESTIGE 235.7(219.9)1267018
PRSMJOHNSN 89.2(88.6)78288
PTC 92.9(92.85)723910
PUNJLLOYD 4.15(4.2)606256
PURVA 74.35(72.5)186898
PVR 1594.6(1604.55)154865
RADICO 402.5(400.45)332521
RAIN 135.5(133.9)317403
RAJESHEXPO 572.15(571)180116
RALLIS 180.5(178.65)151059
RAMCOCEM 641.25(639.9)55468
RAMCOSYS 279.2(274.75)20300
RATNAMANI 947.25(943.2)1333
RAYMOND 842.95(844.75)186250
RCF 64.3(64)728982
RCOM 14.35(14.4)45185360
RECLTD 120.65(122.15)5399911
REDINGTON 88.55(88.65)23614
RELAXO 738.65(732.8)8473
RELCAPITAL 230.4(229.55)3713975
RELIANCE 1121(1121.25)4455850
RELINFRA 316.6(316.2)2010745
RENUKA 11.05(10.7)578774
REPCOHOME 400.7(399.15)189946
RIIL 350.9(338.3)782258
RKFORGE 530.85(537.6)5391
RNAVAL 14(13.95)681192
ROLTA 8.35(8.4)2487935
RPOWER 28.85(28.65)7266908
RTNPOWER 3.45(3.45)671112
RUCHISOYA 8.55(8.95)6055900
SADBHAV 210.6(211.2)23560
SADBHIN 99.6(99.6)1261
SAIL 55.75(56.35)9872769
SANOFI 6339.95(6370.5)1412
SBIN 299.6(295.9)11837127
SCHAEFFLER 5646.2(5697.75)841
SCHNEIDER 101.2(101.35)33168
SCI 48.05(48.15)350156
SHARDACROP 303.75(302.25)3660
SHILPAMED 392.6(385.55)27369
SHK 171.55(171.8)21859
SHOPERSTOP 532.55(540.2)26405
SHREECEM 16973.25(17236.1)12171
SHRIRAMCIT 1591.3(1589.85)1044
SIEMENS 1062.65(1046.9)1089418
SIMPLEXINF 199.8(197.65)12699
SINTEX 12(11.8)1941589
SITINET 11.2(11)178847
SJVN 25.6(25.55)380029
SKFINDIA 1906.4(1907.25)2994
SMLISUZU 673.3(664.5)49969
SNOWMAN 35.2(34.95)139606
SOBHA 461.15(455.3)68167
SOMANYCERA 329.85(328.7)34929
SONATSOFTW 302.45(302.65)36231
SOUTHBANK 15.65(15.55)7548684
SPARC 189.25(188.05)773652
SREINFRA 36(36.2)1341074
SRF 1989(1999.65)854122
SRTRANSFIN 1229.75(1239.95)545844
STAR 466.15(461)709205
STCINDIA 144.55(146.4)1040929
SUNDARMFIN 1420.4(1438.7)8727
SUNDRMFAST 544.6(534.9)74793
SUNPHARMA 433.55(430.5)8487116
SUNTV 607.85(607.75)1393145
SUPREMEIND 1151.6(1174.75)35673
SUVEN 232.2(226.55)222176
SUZLON 5.45(5.4)9806032
SWANENERGY 100.1(101.2)267114
SYMPHONY 1182(1166.65)10101
SYNDIBANK 39.8(39.3)2970372
SYNGENE 557.45(560.2)9079
TAKE 149.55(148.95)47533
TATACHEM 705.3(706.7)348294
TATACOFFEE 98.75(97.3)469198
TATACOMM 522.25(524.3)173228
TATAELXSI 1026.75(1020.4)671934
TATAGLOBAL 219.1(219.4)716275
TATAMOTORS 173.45(172.7)6715543
TATAMTRDVR 93.1(92.65)1368683
TATAPOWER 76.7(76.8)2153622
TATASPONGE 848.45(857.7)60329
TATASTEEL 515.75(521.05)4128173
TATASTLBSL 39.95(39.65)1171246
TBZ 65.9(66.55)59102
TCS 1902.8(1893.05)1094883
TECHM 719.1(723.15)815535
TEXRAIL 59.4(59.05)179833
THERMAX 1130.7(1120.25)12198
THOMASCOOK 233.85(234.2)28638
TIDEWATER 5402.1(5435.1)576
TIMKEN 610.9(581)68617
TITAN 928(931)2064502
TNPL 257.2(257.4)14964
TORNTPHARM 1775.55(1771.4)40853
TORNTPOWER 259.5(261.8)537488
TREEHOUSE 4.65(4.7)14493
TRIDENT 68.2(66.4)1356003
TRITURBINE 109.25(110.5)11967
TTKPRESTIG 7488.85(7488.45)721
TTML 4.05(4)413403
TV18BRDCST 38.4(38.2)1826922
TVSMOTOR 564.55(571.25)525625
TVSSRICHAK 2502.8(2506.45)1758
TVTODAY 373.55(372.95)6421
UBL 1362.7(1377)304025
UCOBANK 22.7(20.3)14040027
UFLEX 280.9(283.3)42340
ULTRACEMCO 4009.2(3990.95)92921
UNICHEMLAB 191.6(191.3)19507
UNIONBANK 88.3(85.9)9352838
UNITECH 2.1(2.05)1120579
UPL 753.5(758.25)1610248
VAIBHAVGBL 723.9(714.6)3486
VAKRANGEE 34.95(33.3)5335533
VEDL 202.1(202.2)3947501
VIDEOIND 3.35(3.25)59088
VIJAYABANK 50.85(50.05)472368
VINATIORGA 1631.7(1653.4)6912
VIPIND 515.65(516.4)113157
VOLTAS 555.45(553.5)547086
VRLLOG 292.75(293.05)21429
VSTIND 3276.35(3272.85)880
VTL 1104.85(1114)8686
WABAG 260.95(259.2)75068
WABCOINDIA 6874.8(6965.8)617
WELCORP 139.85(139.3)716987
WELSPUNIND 60.5(59.8)377138
WHIRLPOOL 1404.6(1390.55)29846
WIPRO 326.65(330.85)1513704
WOCKPHARMA 528.75(523.25)1817409
WONDERLA 272.1(269.95)6499
ZEEL 480.25(476.45)2203533
ZEELEARN 36.05(35.75)23701
ZYDUSWELL 1366.5(1360.45)2907

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	32,640	32,600	---	32,380	31,670
క్రితం ముగింపు	32,590	---	32,710	32,450	31,630
22 క్యారెట్లు	30,220	30,050	---	30,050	30,210
క్రితం ముగింపు	30,170	---	30,090	30,110	30,170
వెండి (కిలో)	39,500	39,700	---	39,400	41,500
క్రితం ముగింపు	39,300	---	39,500	39,400	41,500

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 5.00 — నెక్ (100 గుడ్లు)

హైదరాబాద్	439	చిత్తూరు	438
వరంగల్	441	చెన్నై	445
విజయవాడ	453	నమక్కల్	430
గోదావరి	453	బెంగళూరు	445
విశాఖపట్నం	458	ముంబై	494

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	92	విజయవాడ	94
కరీంనగర్	92	గుంటూరు	95
వరంగల్	92	ఒంగోలు	96
మహబూబ్‌నగర్	92	చిత్తూరు	99
కర్నూలు	92	నెల్లూరు	99
విశాఖపట్నం	85	అనంతపురం	98
గోదావరి	92		



కొత్తగా ప్రారంభించిన కోర్టు హాలులో హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్, న్యాయమూర్తులతో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, సీఎం చంద్రబాబు

ఇదో చారిత్రక ఘట్టం!



కొత్త చరిత్ర ఆరంభం..

- సీఎం డైనమిజంతో ముందుకెళ్తాం
- యాక్టింగ్ సీజే ప్రవీణ్‌కుమార్ వెల్లడి
- జడ్జీలు, లాయర్లకు సీఎం విందు

అమరావతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హైకోర్టు ఏర్పాటుతో కొత్త చరిత్ర ప్రారంభమైందని హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ప్రస్తుతం పరిమిత వనరులే ఉన్నాయని, ప్రారంభంలో ఇబ్బందులూ ఉంటాయని, అయినా వాటిని ఎదుర్కొని పనిచేయడానికి సిద్ధపడ్డామని తెలిపారు. తన సహచర న్యాయమూర్తులతో కలిసి హైకోర్టు ఔన్నత్యాన్ని కాపాడేలా ముందుకు సాగుతానని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉన్నతస్థానానికి చేరుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. రాష్ట్ర కొత్త రాజధానిని 16 వేల గ్రామాల నుంచి పవిత్ర జలాలు, మట్టితో ప్రారంభించారన్నారు. రాజధాని ఎకో ఫ్రెండ్లీగా నిర్మితమవుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 28 సంవత్సరాలకే మంత్రి అయ్యారని, ఆయన డైనమిక్ విజన్ అందర్నీ ముందుకు సాగేలా చేస్తుందని వ్యాఖ్యానించారు. అనంతరం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గగోయ్ సందేశాన్ని ఆయన చదివి వినిపించారు. ఆ తరువాత ఉండవల్లి ప్రజావేదికలో న్యాయమూర్తులు, న్యాయవాదులకు ముఖ్యమంత్రి చంద్రబాబు విందు ఇచ్చారు.

మీ పాదముద్రలు చరిత్రలో నిలుస్తాయి
62 సంవత్సరాలకు తీరిన ఆంధ్రా కల

- ఆరంభ ఇబ్బందులను అధిగమించాలి
- న్యాయవాదులు ప్రజలకు న్యాయం చేయాలి
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రమణ



అమరావతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కొత్త రాష్ట్రానికి ప్రత్యేక హైకోర్టును ప్రారంభించుకోవడం చారిత్రక ఘట్టమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ వ్యాఖ్యానించారు. ఆయన తన ప్రసంగం ప్రారంభంలో స్థానికతను గుర్తుచేసేలా 'దేశమును ప్రేమించుమన్నా. మంచియన్నది పంచుమన్నా. దేశమంటే మట్టి కాదోయ్. దేశమంటే మనుషులోయ్' అనే గురజాడ వ్యాఖ్యలను ఉటంకించారు. తనకు మాతృభాషలోనే ప్రసంగించడం ఇష్టమని, కానీ తనది ఇక్కడ సుప్రీంకోర్టు సీజే జస్టిస్ రంజన్ గగోయ్ తరపున ద్విపాత్రాభినయం (డ్యూయెల్ రోల్) కాబట్టి ఆంగ్లంలో మాట్లాడాల్సి వస్తోందని చెప్పారు. బెజవాడ బార్ అసోసియేషన్‌లో ప్రాక్టీసుతో జీవితం ప్రారంభించిన రోజులను గుర్తుచేసుకున్నారు. ఈనెల 25కల్లా హైకోర్టు భవనం పూర్తవుతుందని ముఖ్యమంత్రి చెప్పారని, దాని ప్రారంభానికి వచ్చేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. "ఇదో చారిత్రక కార్యక్రమం. రాష్ట్రానికి గర్వకారణమైన సందర్భం. సుదూర ఆలోచనలు, కలల సాకారంలో ప్రత్యేక హైకోర్టు ఏర్పాటు కీలక మలుపు అవుతుంది. 1954 జూలై 5న రాష్ట్ర హైకోర్టు గుంటూరులో మొట్టమొదటిసారిగా ఏర్పాటైంది. అనంతరం పునర్విభజనతో 1956 నవంబరు 1న హైదరాబాద్‌కు తరలివెళ్లింది. 62 సంవత్సరాల్లో మూడు ప్రదేశాలకు ఉన్నత న్యాయస్థానం మారింది" అని ఆయన వివరించారు.

పిన్న వయసే అయినా..

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు దేశంలో పిన్న వయసు కలిగిన న్యాయస్థానం అని జస్టిస్ రమణ అన్నారు. అయినా సమర్థవంతంగా పనిచేసి దేశంలో ఉత్తమంగా నిలవాలని ఆకాంక్షించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు ప్రజలకు న్యాయం చేయడం కోసం కృషి చేయాలన్నారు. ఎన్నో ఆశలు, స్ఫూర్తితో సాగే జీవనానికి... పరిమితమైన న్యాయం అందించడం సరిపోదని వ్యాఖ్యానించారు. సమాజంలో సవాళ్లు ఉన్నప్పుడే మరింత బలోపేతం అవుతామని అభిప్రాయపడ్డారు. 'రోమ్ నగరం ప్రపంచంలో అందర్నీ ఆకర్షిస్తుంది. కానీ రోమ్‌ను ఒక్కరోజులో నిర్మించలేదు' అని వ్యాఖ్యానించారు. "ఏపీకి ఇది కీలక ఘట్టం. మీ పాదముద్రలు చరిత్రలో మిగిలిపోతాయి" అని న్యాయమూర్తులు, న్యాయవాదులను ఉద్దేశించి అన్నారు. కొత్త రాష్ట్రంలో ప్రారంభ ఇబ్బందులుంటాయని, వాటిని అధిగమిస్తూ కష్టపడి పనిచేయాలని కోరారు.

జస్టిస్ రమణ నోట తొలి సీజే మాట

గుంటూరులో తొలిసారి హైకోర్టు ప్రారంభమైనప్పుడు, అప్పటి చీఫ్ జస్టిస్ కోకా సుబ్బారావు ఓ పత్రికకు వ్యాసం రాశారని జస్టిస్ రమణ తెలిపారు. ఆ వ్యాసం సారాంశాన్ని ఆయన చదివి వినిపించారు. "ప్రత్యేక హైకోర్టు కావాలన్నది ఏపీ ప్రజల కల. అయితే కోర్టు ఏర్పడినంత మాత్రాన కర్తవ్యం తీరిపోయినట్లు కాదు. దీనికి అర్హులమని నిరూపించుకోవాల్సిన బాధ్యత ఉంది. హైకోర్టు విధానాలు క్లిష్టంగా, సున్నితంగా ఉంటాయి. ప్రజల జీవన్మరణ సమస్యల గురించి నిర్ణయాలు చేయాల్సి ఉంటుంది. ప్రజల ప్రాథమిక హక్కులు కాపాడాలి. చాటుమాటుగాగానీ, బహిరంగంగా గానీ న్యాయస్థానాలు, న్యాయమూర్తుల గురించి పరుషంగా మాట్లాడటం తగదు. న్యాయస్థానాలను విమర్శించే పదవులు, సంస్థలు, ప్రతిష్ఠ నేలపాలవుతుంది. కోర్టుల శక్తిని బలహీనపరిచే ప్రయత్నం చేయకూడదు"



విభజన సంపూర్ణం

హైకోర్టు రాకతో అన్నీ వచ్చాయి: సీఎం

అమరావతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు రాకతో రాష్ట్ర విభజన సంపూర్ణమైందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆర్థిక వ్యవహారాలు తప్ప ఇక విభజన జరగాల్సినవి ఏవీ లేవని పేర్కొన్నారు. బెజవాడ హైకోర్టు భవనాలను ప్రారంభించిన అనంతరం.. ఆయన న్యాయమూర్తులు, న్యాయవాదులను ఉద్దేశించి మాట్లాడారు. న్యాయవాదులతో విజయవాడ కళకళలాడుతోందన్నారు. హైకోర్టు విభజన కొంత బాధ, కొంత ఆనందం కలిగించిందని చెప్పారు. ఇదో చారిత్రక అంశం అన్నారు. హైదరాబాద్‌లో 60ఏళ్లు ఉన్నామని, 62ఏళ్ల తర్వాత సొంత ప్రాంతంలో న్యాయ పరిపాలనకు శ్రీకారం చుట్టామని చెప్పారు. కొత్త రాష్ట్రం కాబట్టి కొన్ని ఇబ్బందులు ఉన్నాయని, వీలైనంతమేర ఇబ్బందుల్లేకుండా చూస్తామని న్యాయమూర్తులు, న్యాయవాదులకు తెలిపారు. తక్కువ సమయం ఉన్నప్పటికీ కార్యక్రమానికి ఇబ్బందుల్లేకుండా చూడాలని అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. ఇదే విషయం ఫోన్‌చేసి సీజేకు చెప్పానని, తాము కూడా మానసికంగా వాటికి సిద్ధపడ్డామని ఆయన అన్నారని తెలిపారు. అందరి సహకారంతో అమరావతిని చారిత్రక నగరంగా నిర్మిస్తామన్నారు. కొత్త రాష్ట్రానికి తాను తొలి ముఖ్యమంత్రినని, నరసింహన్ తొలి గవర్నర్ అని, తొలి సీజే ప్రవీణ్‌కుమార్ అని అన్నారు. ఇది అత్యంత తక్కువ వయసు కలిగిన హైకోర్టు అని, కానీ దేశంలోనే ఎక్కువ పేరుప్రఖ్యాతులు సాధించేలా అందరం కలిసి కృషి చేద్దామని కోరారు. జనవరి 1న ఏర్పడిన హైకోర్టు ఇదేనని, తేదీ గుర్తుంచుకోవడం కూడా సులభం అని సరదాగా అన్నారు. చరిత్రలో నూతన మలుపునకు ఇది నాంది అని పేర్కొన్నారు.

నవ్యాంధ్ర చరితపై సువర్ణ తీర్పు

(మొదటి పేజీ తరువాయి)

ప్రవీణ్‌కుమార్, మరో 13 మంది న్యాయమూర్తులు ప్రమాణస్వీకారం చేయడంతో లాంఛనంగా ఏపీ హైకోర్టు అందుబాటులోకి వచ్చింది. మంగళవారం విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో గవర్నర్ ఇ.ఎస్.ఎల్. నరసింహన్ తొలుత తాత్కాలిక చీఫ్ జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌తో ప్రమాణం చేయించారు. అనంతరం న్యాయమూర్తులు ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో న్యాయవాదులు హాజరయ్యారు. ముందుగా ముఖ్యమంత్రి చంద్రబాబు వేదికపైకి చేరుకుని గవర్నర్, న్యాయమూర్తులకు స్వాగతం పలికారు. హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ సీ మానవేంద్రనాథ్‌రాయ్ రాష్ట్రపతి నోటిఫికేషన్ ప్రొసీడింగ్స్‌ను చదివి వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పునేఠా కార్యక్రమాన్ని ప్రారంభించిన వెంటనే, ప్రమాణస్వీకార ప్రక్రియను పూర్తి చేయించారు.

శాస్త్రోక్తంగా తొలి అడుగు

ఉత్సాహ ఉల్లాస వాతావరణంలో తాత్కాలిక కోర్టు భవనాలు ప్రారంభమయ్యాయి. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ ముఖ్య అతిథిగా పాల్గొని, సీఎంతో కలిసి ఈ భవనాలను ప్రారంభించారు. యాక్టింగ్ సీజే జస్టిస్ ప్రవీణ్‌కుమార్ రిబ్బన్ కట్ చేశారు. ఈ కార్యక్రమాన్ని వేద పండితులతో పూర్తి శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ప్రమాణం చేసిన న్యాయమూర్తులు

జస్టిస్ ఎస్వీ భట్, జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, జస్టిస్ ఎం.సీతారామమూర్తి, జస్టిస్ దుర్గాప్రసాదరావు, జస్టిస్ సునీల్ చౌదరి, జస్టిస్ మల్లవోలు సత్యనారాయణ మూర్తి, జస్టిస్ జి.శ్యాంప్రసాద్, జస్టిస్ జె.ఉమాదేవి, జస్టిస్ ఎన్.బాలయోగి, జస్టిస్ రజని, జస్టిస్ సోమయాజులు, జస్టిస్ కొంగర విజయలక్ష్మి, జస్టిస్ మంతోజు గంగారావు



తాత్కాలిక చీఫ్ జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌తో ప్రమాణస్వీకారం చేయిస్తున్న గవర్నర్ నరసింహన్

కొత్త కొత్తగా.. కోలాహలం

రాష్ట్ర హైకోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమం మంగళవారం బెజవాడలో పండగ వాతావరణంలో కోలాహలంగా సాగింది. ఆ విశేషాలు..

జనవరి ఫస్ట్ స్పెషల్..

కొత్త సంవత్సరం తొలిరోజునే నూతన హైకోర్టు రావడంపై న్యాయవాదుల్లో హర్షం వ్యక్తమయింది. ఇలాంటి ఘట్టం దేశంలోనే తొలిసారి చోటుచేసుకొన్నదని పలువురు పేర్కొన్నారు.

అన్నింటికీ అదే ఆది..!

విజయవాడ సూర్యారావుపేటలోని నీటిపారుదల శాఖ కార్యాలయం.. నగర చరిత్రలోనే కాదు, రాష్ట్ర చరిత్రలోనూ పలు అపూర్వ ఘట్టాలకు వేదికగా నిలిచింది. హైదరాబాద్ నుంచి పరిపాలనను విజయవాడకు మార్చిన సమయంలో సీఎం చంద్రబాబు ఈ కార్యాలయాన్ని తన క్యాంపు కార్యాలయంగా చేసుకొన్నారు. ఆయన వెలగపూడిలోని సచివాలయానికి మారినా, ఇది సీఎం క్యాంపు కార్యాలయంగానే కొనసాగుతోంది. తాజాగా ఇక్కడ తాత్కాలిక హైకోర్టును ఏర్పాటు చేయడంతో న్యాయపాలనకూ ఇక్కడి నుంచే శ్రీకారం చుట్టినట్టయింది. ప్రస్తుతం ఇక్కడ పదికోర్టు హాళ్లు ఏర్పాటు చేశారు. మంగళవారం సెలవు కావడంతో ప్రారంభోత్సవంతోనే సరిపెట్టారు. బుధవారం నుంచి పూర్తిస్థాయిలో హైకోర్టు పనిచేయనుంది.

కేసులకు నంబరింగు..

హైకోర్టులో కేసుల లిస్టింగ్, రిజిస్ట్రేషన్ బుధవారం నుంచి ప్రారంభమవుతాయి. తాత్కాలిక హైకోర్టులో ప్రస్తుతానికి 10కోర్టు హాళ్లు ఏర్పాటు చేశారు. వాటిలో వాదనలో వినాల్సిన కేసుల జాబితాలను ఒకరోజు ముందుగా తయారు చేస్తారు. అదే సమయంలో హైకోర్టులో దాఖలైన కేసులకు నంబర్లు కేటాయించే ప్రక్రియకూ బుధవారం నుంచే శ్రీకారం చుడతారు.



తాత్కాలిక చీఫ్ జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న సీఎం

కొత్తలోనే తొలి విరమణ

జస్టిస్ ఎన్.బాలయోగి హైకోర్టు న్యాయమూర్తుల్లో ఒకరు. నవ్యాంధ్రలో హైకోర్టు ఏర్పడిన తర్వాత తొలి వీడ్కోలు అందుకోనున్న న్యాయమూర్తి. ఈనెల 4వ తేదీన ఆయన పదవీ విరమణ చేయనున్నారు. వచ్చేనెలలో జస్టిస్ టీ సునీల్ చౌదరి పదవీవిరమణ చేస్తారు.

ఆర్ అండ్ బీ నుంచి పాలన

హైకోర్టు కార్యకలాపాలకు సంబంధించిన పరిపాలనా విభాగాన్ని ఎంజీ రోడ్డులోగల రోడ్లు, భవనాల శాఖ భవనంలో ఏర్పాటు చేశారు. హైకోర్టు రిజిస్ట్రార్, మినిస్టీరియల్ సిబ్బంది ఈ విభాగంలో ఉంటారు.

తెలంగాణ న్యాయవాదుల సందడి

న్యాయమూర్తులు ప్రమాణస్వీకారం చేసే కార్యక్రమానికి తెలంగాణకు చెందిన హైకోర్టు న్యాయవాదులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. హైదరాబాద్ నుంచి మొత్తం 250మంది న్యాయవాదులు నాలుగు బస్సుల్లో విజయవాడకు తరలివచ్చారు.

కొత్త సంవత్సరం బహుమతి

"నూతన సంవత్సరంలో నవ్యాంధ్రకు హైకోర్టు రూపంలో మంచి కానుక లభించింది. హైదరాబాద్ నుంచి లక్షలాది కేసులు ఇక్కడికి బదిలీ అవుతాయి. హైకోర్టు సొంతరాష్ట్రానికి రావడంవల్ల ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయి.

- నర్రా శ్రీనివాసరావు, హైకోర్టు న్యాయవాది

- విజయవాడ, ఆంధ్రజ్యోతి

ఒకేరోజు.. రెండు ఘట్టాలు

- విజయవాడలో ప్రారంభమయిన హైకోర్టు, రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్

ఒకే రోజున రెండు కొత్తసంస్థలు బెజవాడ గడ్డపై కొలువుదీరాయి. సీఎం క్యాంపు కార్యాలయంలో తాత్కాలిక హైకోర్టు మంగళవారం ప్రారంభమైంది. కంపెనీలను గుర్తించే ఆర్వోసీ (రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్) రాష్ట్ర ప్రధాన కార్యాలయం ఇదే రోజున ప్రారంభమైంది. కొత్త రాష్ట్రాల చరిత్రలో ఆర్వోసీ ఏర్పాటు ఏపీలో త్వరతగతిన జరిగిందని సంస్థ ఉద్యోగులు పేర్కొన్నారు. 2000లో ఏర్పడిన ఉత్తరాఖండ్‌కు ఇప్పటివరకు ఆర్వోసీ లేదన్నారు.

కొన్ని ఇబ్బందులున్నా..

ఇప్పుడు కాకపోయినా ఎప్పటికైనా హైకోర్టు సొంత రాష్ట్రానికి రావాల్సిందే. అయితే హైదరాబాద్ నుంచి నవ్యాంధ్రకు రావడానికి కొంత సమయం కోరి ఉంటే బాగుండేది. ఆ విధంగా అఫిడవిట్‌లో పేర్కొంటే సరిపోయేది. కొత్తగా ఒక పని చేయాలనుకున్నప్పుడు కొన్ని ఇబ్బందులు ఉండడం సహజం. వాటిని నెమ్మదిగా సర్దుబాటు చేసుకోవాలి"

- పీ.ప్రసాద్, మాజీ జడ్జీ, హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు

బుల్లెట్ రైళ్లకు ప్రాధాన్యం

- ప్రయాణికుల భద్రతకు పెద్దపీట
- రైల్వేబోర్డు కొత్త చైర్మన్ వీకే యాదవ్ వెల్లడి



రైల్వే బోర్డు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న వినోద్‌కుమార్ యాదవ్

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): భారతీయ రైల్వే వ్యవస్థలో అత్యున్నత స్థానమైన రైల్వే బోర్డు చైర్మన్‌గా వినోద్‌కుమార్ యాదవ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు దక్షిణ మధ్య రైల్వే జీఎంగా ఉన్న ఆయన.. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలోనే కొత్త బాధ్యతలు స్వీకరించడం గమనార్హం. ఆ వెంటనే ఆయన ఢిల్లీకి పయనమయ్యారు. రైల్వే బోర్డు చైర్మన్‌గా తాను హైస్పీడ్ బుల్లెట్ రైళ్ల ప్రాజెక్టుకు ప్రాధాన్యమిస్తానని ఈ సందర్భంగా మీడియాకు తెలిపారు. ప్రయాణికుల భద్రతకు పెద్దపీట వేస్తానని వ్యాఖ్యానించారు. ప్రయాణికులకు ప్రపంచ స్థాయి సౌకర్యాలు కల్పించడమే రైల్వే ప్రధాన లక్ష్యమన్నారు. అంతకు ముందు ఆయన దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

దక్షిణమధ్య రైల్వే ఇన్‌చార్జి జీఎంగా కుల్‌శ్రేష్ఠ



హైదరాబాద్‌సిటీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే ఇన్‌చార్జి జనరల్ మేనేజర్‌గా కుల్‌శ్రేష్ఠ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని రైల్వే శాఖల్లో పనిచేసిన అనుభవం కలిగిన కుల్‌శ్రేష్ఠ గతంలో విజయవాడ అడిషనల్ డివిజనల్ రైల్వే మేనేజర్‌గా రెండేళ్లపాటు పనిచేశారు. అలాగే ఖరగ్‌పూర్ డీఆర్‌ఎంగా రెండున్నరేళ్లపాటు సేవలందించారు.

11న ఓటర్ల తుది జాబితా

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఓటు నమోదు ప్రక్రియను వేగవంతం చేసిన రాష్ట్ర ఎన్నికల కమిషన్.. ఈ నెల 11న తుది జాబితాను ప్రచురించనుంది. ఎలాంటి తప్పులు లేని పారదర్శక జాబితా సిద్ధం చేయాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారులను ఆదేశించింది. 13 జిల్లాల్లో నమోదైన ఓటర్ల తుది జాబితాను(ఫస్ట్ సప్లిమెంటరీ) ప్రచురించనుంది. తమ పేర్లు ఉన్నదీ, లేనిదీ ఓటర్లు చూసుకోవడానికి ఎలక్షన్ కమిషన్ సైట్‌లోనూ, ఎన్నికల రిటర్నింగ్ అధికారుల(ఈఆర్వో) వద్ద తుది జాబితాను అందుబాటులో ఉంచనుంది. రాజకీయ పార్టీలకూ వీటి కాపీలను ఇవ్వనుంది. తద్వారా తుది జాబితాలో తమ పేర్లు లేకపోయినా, ఏవైనా తప్పులు దొర్లినా ఓటర్లు మళ్లీ తమ ఓటును నమోదు చేసుకోవచ్చునని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సిసోడియా 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.




ప్రమాణస్వీకారం చేస్తున్న జస్టిస్ ఎస్వీ భట్, జస్టిస్ శేషసాయి, జస్టిస్ సీతారామమూర్తి, జస్టిస్ దుర్గా ప్రసాదరావు, జస్టిస్ సునీల్ చౌదరి, జస్టిస్ సత్యన్నారాయణ మూర్తి, జస్టిస్ శ్యామ్ ప్రసాద్, జస్టిస్ ఉమాదేవి, జస్టిస్ బాలయోగి, జస్టిస్ రజనీ, జస్టిస్ సోమయాజులు, జస్టిస్ విజయలక్ష్మి, జస్టిస్ గంగారావు

నరేంద్ర మోదీ చర్చకు రా

(మొదటి పేజీ తరువాయి)

వెళ్లిపోతున్నారు. దేశంలో ప్రగతి రేటు పడిపోయింది. ప్రజల ఆదాయం క్షీణించిపోయింది. మోదీ ఆర్థిక, పాలనా విధానాలు దేశాన్ని ఇరవై ఏళ్లు వెనక్కి తీసుకెళ్లాయి. ప్రతిపక్ష కూటమి విఫలం కాలేదు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చి వారి నమ్మకం నిలుపుకోవడంలో మోదీ, ఎన్డీఏ కూటమే విఫలమయ్యాయి' అని ఆయన అన్నారు. శ్వేత పత్రం విడుదల కోసం మంగళవారమిక్కడ ప్రజా వేదిక భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ప్రతిపక్ష కూటమి, ఫెడరల్ ఫ్రంట్, కేసీఆర్, టీడీపీలపై మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వ్యాఖ్యలు ప్రస్తావనకు వచ్చాయి. వాటిపై చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. ఫెడరల్ ఫ్రంట్ మోదీ గూటి చిలకేనని స్పష్టం చేశారు. 'ప్రతిపక్షాలు రెండు కూటములుగా చీలిపోయాయని, ఫెడరల్ ఫ్రంట్‌లో బెంగాల్ సీఎం మమతా బెనర్జీ చేరారని బీజేపీ నేతలు చెబుతున్నారు. ఆ ఫ్రంట్‌లో చేరామని మమత, నవీన్ పట్నాయక్ ఎక్కడైనా చెప్పారా? వాళ్లు చెప్పకుండానే ఫెడరల్ ఫ్రంట్‌కు వీళ్లెందుకు ప్రచారం చేస్తున్నారు? దీనినిబట్టే ఆ ఫ్రంట్ ఎవరిదో తెలిసిపోతోంది. ఉనికిలోనే లేని ఫ్రంట్‌కు ప్రచారం కల్పించాలని మోదీ, జైట్లీ తాపత్రయపడుతున్నారు. ప్రతిపక్షాలు చీలిపోయాయని ప్రజలను నమ్మించగలిగితే తమకు లాభం వస్తుందని లెక్కలు వేసుకుని ఆ ఫ్రంట్‌ను ప్రోత్సహిస్తున్నారు. ఉన్నవి రెండే కూటములు. ఒకటి బీజేపీ అనుకూల కూటమి.. రెండోది బీజేపీ వ్యతిరేక కూటమి. మమత బీజేపీకి వ్యతిరేకంగానే ఉన్నారు' అని తేల్చిచెప్పారు.



అంతమంది ప్రచారం చేస్తే ఒక్కటేనా?

తెలంగాణలో టీఆర్ఎస్ గెలిస్తే బీజేపీ నేతలకు ఆనందం ఎందుకని చంద్రబాబు ప్రశ్నించారు. 'ప్రధాని రెండుసార్లు, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ఏడు సార్లు తెలంగాణలో పర్యటించారు. వారితోపాటు 17 మంది కేంద్ర మంత్రులు, ఏడుగురు ముఖ్యమంత్రులు కూడా ప్రచారం చేస్తే బీజేపీకి కేవలం ఒకటే సీటు వచ్చింది. ప్రధానిని సన్నాసి, ఫాసిస్ట్, గాడు అని కేసీఆర్ విమర్శించినా బీజేపీ నేతలు మాట్లాడడం లేదు. దీనినిబట్టే వారి మధ్య లాలూచీ తెలిసిపోతోంది. ప్రజలను అన్నిసార్లూ మోసం చేయలేరు' అని తేల్చిచెప్పారు.

దాడులతో భయభ్రాంతుల్ని చేస్తారా?

పది పార్టీలు కలిసి తనపై పోరాడుతున్నాయని మోదీ చేస్తున్న వ్యాఖ్యల్లో ఏ మాత్రం నిజం లేదని చంద్రబాబు అన్నారు. పైగా కేంద్రంలోని పది సంస్థలతో ఆయనే అన్ని ప్రతిపక్షాలపై.. ఆ పార్టీల నేతలపై దాడులు చేయిస్తున్నారని ధ్వజమెత్తారు. 'ఎంతమందిపై దాడులు చేస్తారు? మీకెవరిచ్చారీ అధికారం. ఇంత దుర్మార్గం ఇదివరకెవరైనా చేశారా? దాడులతో బలహీనపరచాలనుకుంటున్నారా? భయభ్రాంతుల్ని చేస్తారా' అని విరుచుకుపడ్డారు. సామాన్యుడి చేతిలోని ఫోన్‌కు కూడా రక్షణ లేకుండా పోయిందని, వాటినీ ట్యాపింగ్ చేస్తున్నారని విమర్శించారు.

పవన్ రాకూడదన్నది జగన్ బాధ..

జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ రాజకీయ వైఖరిపై విలేకరుల సమావేశంలో ఆసక్తికర చర్చ జరిగింది. విలేకరుల ప్రశ్నలకు చంద్రబాబు సమాధానాలు ఇలా ఉన్నాయి.

మీరూ... పవన్ భాగస్వాములని, కలుస్తారని జగన్ చెబుతున్నారు. మీరేమంటారు?

ఒకవేళ కలిసి పోటీచేస్తే ఆయనకు బాధేంటి? ముందు జగన్ తన సంగతి చెప్పాలి. ఆయన బీజేపీతో కలుస్తాడా లేదా? దేశంలో ఆయన ఎక్కడ ఎవరితో ఉంటారో అది చెప్పాలి. పవన్ రాకూడదన్నది ఆయన బాధ. ఈ మధ్య నేను కూడా చూస్తున్నా. పవన్ కల్యాణ్‌ను తిడుతున్నాడు. జగన్ ఇతరుల గురించి కాదు. ముందు తన సంగతి చెప్పాలి.

మోదీ, జగన్, కేసీఆర్ కూటమి గురించి మీరు మాట్లాడుతున్నారు గానీ పవన్ గురించి మాట్లాడడం లేదు?

బీజేపీకి వ్యతిరేకంగా నిలబడాలని, దాని తీరుపై పోరాడాలని మేం పవన్‌కు చెబుతున్నాం.

పవన్ మీవైపు వస్తే స్వాగతిస్తారా?

ఊహాజనిత ప్రశ్నలకు సమాధానం చెప్పను.

కేసీఆర్‌కు ఇక్కడ సామంత రాజులు ఉండాలి

ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో బలహీన సామంత రాజులు ఉండాలన్నది తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కోరిక అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'విభజనలో 48 శాతం జనాభా.. 54 శాతం ఆదాయం తెలంగాణకు వెళ్లాయి. మనకు ఎక్కువ జనాభా, తక్కువ ఆదాయం వచ్చాయి. అయినా మన తెలివితేటలు, శ్రమతో పరిస్థితిని మెరుగుపరచుకుంటున్నాం. ఇదే ఊపు కొనసాగితే వచ్చే పదేళ్లలో దేశంలోనే మొదటి స్థానంలో నిలబడతాం. కష్టపడలేని వాళ్లకు ఇది నచ్చడం లేదు. ఇక్కడ పని చేయలేని బలహీన ప్రభుత్వం ఉంటే వాళ్లకు ఇబ్బంది ఉండదు. పని చేయకపోయినా తాము గొప్పగా ఉన్నామని చెప్పుకోవచ్చు. పనిచేసే మన లాంటి వాళ్లు ఉంటే వాళ్లకు ఇబ్బంది. అందుకే ఆంధ్ర రాజకీయాల్లో తలదూర్చాలని చూస్తున్నారు. పనిగట్టుకుని ఈ రాష్ట్రంలోని పత్రికల్లో ఫుల్ పేజీ ప్రకటనలు ఇచ్చి రెచ్చగొట్టాలని, మనల్ని అవమానించాలని చూస్తున్నారు. మనం సరఫరా చేసిన విద్యుత్ బకాయిల కింద ఇవ్వాల్సిన రూ.5 వేల కోట్లు ఇవ్వరు. పత్రికల్లో ప్రకటనలు మాత్రం ఇస్తారు. ప్రజల దృష్టిని మరల్చే కుట్ర ఇది' అని దుయ్యబట్టారు.

చంద్రబాబుది ఆక్రోశం

(మొదటి పేజీ తరువాయి)



ఎన్నికల్లో ఆయన ఆశలు అడియాశలు అయ్యాయో అందరికీ తెలుసు. ఆ బాధతో ఏదో అంటే నేనేమీ చేయలేను" అని చంద్రబాబుకు చురకలు అంటించారు.

ఎందుకీ కూటమి...

అసలు మహా కూటమి ఎందుకని ప్రధాని మోదీ ప్రశ్నించారు. తెలంగాణలో బీజేపీ వ్యతిరేక మహా కూటమి పూర్తిగా విఫలమైందని తెలిపారు. కశ్మీర్, అసోం స్థానిక ఎన్నికల్లోనూ కూటమికి ఓటమే ఎదురైందన్నారు. "మహా కూటమి, మహా కూటమి... ఇది ఎందుకు? ఐదేళ్లయిపోయింది. కాంగ్రెస్‌ను వ్యతిరేకించి బయటకు వచ్చిన వారు, కాంగ్రెస్‌ను ఆది నుంచీ ఆది నుంచీ ద్వేషిస్తున్న వారు కూటమి అంటున్నారు. వారంతా ఎక్కడైనా, ఎప్పుడైనా వారు ఒకచోట కూర్చుని, ఒక్కమాట మీద ఉన్నారా? ఆర్థిక అంశాలు, దేశ సమస్యలపై ఈ ఐదేళ్లలో ఏకాభిప్రాయంతో ఒక్కసారైనా మాట్లాడారా? పది మంది నేతలు పది రకాలుగా దూషిస్తున్నారు. వీళ్లంతా ఎవరిని వారు కాపాడుకునేందుకు బరిలోకి దిగారు. వారందరి లక్ష్యం మోదీయే! మోదీని అది చేయాలి, మోదీని అది చేయాలి అంటారు. కానీ, దేశంకోసం ఏం చేస్తామన్నది ఎవ్వరూ చెప్పరు!" అని విమర్శించారు. 'మోదీ తప్ప మరెవరైనా సరే అని కూటమి నేతలు చెబుతున్నారు. ఈ ఎన్నికల్లో ఇదే ప్రధానాంశం అవుతుందా' అని ప్రశ్నించగా... దేశ ప్రజలే ఎన్నికల అజెండాను నిర్ణయిస్తారని మోదీ స్పష్టం చేశారు. "తమ ఆకాంక్షలవెంట ఎవరున్నారు, వ్యతిరేకంగా ఎవరున్నారనేదే ప్రజలే గమనిస్తారు. కూటములు కాదని... సామాన్యుడి విజ్ఞతే ప్రధానమని పొలిటికల్ పండితులకు పదే పదే చెబుతుంటాను. జనం విజ్ఞతమీద నాకు నమ్మకముంది. 'ఈ ఎన్నికలు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన వారికీ, వారి నమ్మకాన్ని వమ్ము చేసిన వారికీ మధ్య జరుగుతాయి. ఈ పోరులో జనం మావెంటే ఉంటారు" అని ధీమా వ్యక్తం చేశారు.

మాతోనే మిత్రులు...

2014కంటే ఎక్కువగా పార్టీలు ఎన్డీయేతో ఉన్నాయని ప్రధాని మోదీ తెలిపారు. బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి ఎన్డీయే కూటమిలో చేరతారా అనే ప్రశ్నకు సూటిగా సమాధానం ఇవ్వలేదు. "ఎవరు వస్తారు, ఎవరు రారు అనేది టీవీల ముందు బహిరంగంగా నేను చెప్పలేను. కానీ... కూటమికి తిరస్కారం మాత్రం తథ్యం. కశ్మీర్‌లో పంచాయతీ ఎన్నికలు బహిష్కరించాలని అంతా పిలుపునిచ్చారు. కానీ, 74 శాతం ఓటింగ్ నమోదైంది. త్రిపురలోనూ ఇదే కూటమి! ఓటమి పాలైంది. నేతలు తమను తాము కాపాడుకోవడానికి పైస్థాయిలో కలిసినంత మాత్రాన... ప్రజలంతా మద్దతుగా నిలుస్తారని భావించవద్దు. అసలు కూటమి గురించి మాట్లాడటమే అనవసరం" అని తెలిపారు.

బెజవాడ నుంచే జనసేన

- ఎన్నికల ప్రచారం ప్రారంభం.. కొత్త ఏడాది తొలినాడే శ్రీకారం



జనసేన పార్టీ సింబల్ గ్లాసును ఆవిష్కరిస్తున్న పవన్ కల్యాణ్

అమరావతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ బెజవాడ నుంచి ఎన్నికల ప్రచారం మొదలు పెడుతున్నట్లు ప్రకటించారు. మరో 100 రోజుల్లో రానున్న ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నూతన సంవత్సరం నాడు ఈ మేరకు ఆయన కీలక ప్రకటన చేశారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం నూతన సంవత్సర వేడుకల్లో పవన్ పాల్గొన్నారు. రెండు రాష్ట్రాల తెలుగు ప్రజలకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. "2019 ఎన్నికల ప్రచారానికి ఈ రోజు నుంచే శ్రీకారం చుడుతున్నాం. రాష్ట్ర పునర్నిర్మాణంలో మన పార్టీ కీలక పాత్ర పోషించాలి. మనందరం కష్టపడి పనిచేద్దాం. జనసేనను గెలిపించుకుందాం" అని అన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలనుంచి వచ్చిన జనసేన నేతలు, పవన్ అభిమానులు తమ అధినేతకు శుభాకాంక్షలు తెలిపారు. "ఈ ఏడాది సామాన్యుడే రాజై వెలగాలి. మానవీయ పాలనకు, నవ చరిత్రకు ఇది శ్రీకారం కావాలని ఆకాంక్షిస్తున్నాను" అని తెలిపారు.

రైతులు ఇప్పుడు గుర్తుకొచ్చారా?: రఘువీరా

మడకశిర, జనవరి 1: నాలుగున్నరేళ్లుగా రైతుల గురించి ఆలోచన చేయని కేంద్ర ప్రభుత్వానికి.. మూడు రాష్ట్రాల ఎన్నికల ఓటమితో ఇప్పుడురైతులు గుర్తుకొచ్చారా అని పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి విమర్శించారు. మంగళవారం ఆయన మడకశిరలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ మూడు రాష్ట్రాల్లో విజయం సాధించి రైతుల రుణాలు మాఫీ చేయడంతో, బీజేపీ ప్రభుత్వానికి ఇప్పుడు కనువిప్పు అయినట్లుందన్నారు. రైతుల రుణాలు మాఫీ చేయాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేయడంతో ప్రధానమంత్రి భయపడి ఆ దిశగా ఆలోచన చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నా పుస్తకం అదృష్టం చేసుకుంది: రాజమోహన్‌గాంధీ

- 30వ విజయవాడ పుస్తక మహోత్సవం ప్రారంభం

విజయవాడ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): 'నేను రచించిన పుస్తకం విజయవాడలోని ప్రముఖుల మధ్య ఆవిష్కృతం కావడం చాలా ఆనందంగా ఉంది. నా పుస్తకం నిజంగా అదృష్టం చేసుకుంది.' అని ప్రముఖ చరిత్రకారుడు రాజమోహన్ గాంధీ వ్యాఖ్యానించారు. విజయవాడలో మంగళవారం 30వ విజయవాడ పుస్తక మహోత్సవం ప్రారంభమైంది. ఎన్టీఆర్ ట్రస్ట్, సాంస్కృతిక శాఖ, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ సంయుక్తంగా ఈ నెల 11 వరకు నిర్వహించనున్న ఈ పుస్తక మహోత్సవానికి పీడబ్ల్యూడీ గ్రౌండ్స్ వేదికగా నిలిచింది. ఈ సందర్భంగా రాజమోహన్ గాంధీ రాసిన 'మోడరన్ సౌత ఇండియా' పుస్తకాన్ని ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆర్పీ సిసోడియా, కలెక్టర్ లక్ష్మీకాంతం, నగర మేయర్ కోనేరు శ్రీధర్, రాజమోహన్ గాంధీ సతీమణి ఉషా గాంధీతోపాటు, ఎమెస్కో అధినేత విజయకుమార్, ఆచార్య కొలకలూరి ఇనాక్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



పుస్తక మహోత్సవాన్ని ప్రారంభిస్తున్న రాజమోహన్‌గాంధీ

నాటి ముడుపు.. నేడు కుదుపు

- 8 మంది భారత అధికారులకు ముడుపులు?
- మళ్లీ తెరపైకి టైటానియం మైనింగ్ స్కాం!
- ఫిర్తాష్ సంస్థతో 2007లో ఏపీ ప్రభుత్వ ఎంఓయూ
- కేవీపీ నిందితుడిగా ఉన్న కేసులో తాజాగా బయటపడ్డ నిజాలు

న్యూఢిల్లీ, జనవరి 1: "భారత్‌లో బ్యూరోక్రాటిక్ స్థాయిలో జరిగే ప్రక్రియలన్నింటినీ గౌరవించాలి. ఇందులో అధికారులకు ముడుపులు కూడా ఒకటి"

---- ఇది ఓ ఉక్రెయిన్ వ్యాపార దళారీ సంస్థ- బోయింగ్ విమానయాన సంస్థకు చేసిన సూచన.

ఈ ముడుపులు అందుకున్నది 8 మంది భారత అధికారులు!

అందించినది స్విట్జర్లాండ్‌కు చెందిన వ్యాపార సంస్థ బొట్లి ట్రేడ్ ఏజీ

ఉక్రెయిన్‌లో పుట్టి బ్రిటిష్ వర్జిన్ దీవుల కేంద్రంగా పనిచేసే డీఎఫ్ గ్రూప్ అధినేత దిమిత్రో ఫిర్తాష్‌కు చెందినదీ సంస్థ. ఆయనతో ఒప్పందం కుదుర్చుకున్నది బోయింగ్ విమానయాన సంస్థ. ముడుపుల బాగోతంలో నిందితుడు కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్రరావు. ఈ వ్యవహారం గతంలోనే బయటపడినా ఇందుకు సంబంధించిన వివరాలేవీ బయటకు పొక్కలేదు. తాజాగా బోయింగ్ కోసం పనిచేసిన వ్యాపార సలహా సంస్థ- మెకిన్సే అండ్ కంపెనీ ఆనాడు ఇచ్చిన నివేదికలో కొన్ని భాగాలు ఇపుడు బయటకొచ్చాయి.

అసలేం జరిగింది?

2006లో బోయింగ్ ప్రారంభించదల్చుకున్న డ్రీమ్‌లైనర్ విమానాలకు తేలికపాటి టైటానియం స్పేర్‌పార్టుల కొరత ఏర్పడింది. అప్పట్లో టైటానియం ధరలు విపరీతంగా ఉండడం, విమానాల ప్రారంభతేదీ దగ్గరపడుతుండడంతో.. బోయింగ్.. మెకిన్సేను ఆశ్రయించింది. వాణిజ్యపరమైన వివరాలందివ్వడమే కాదు, ప్రభుత్వాలకు ఎలా గాలం వేసి ఒప్పందాలు కుదుర్చుకోవచ్చో చెప్పడంలో మెకిన్సేది అందెవేసిన చెయ్యి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లోని చాలా మండలాల్లో టైటానియం నిక్షేపాలున్నట్లు అప్పటికే గుర్తించడం జరిగింది. వీటిని వెలికితీస్తే తమకు లాభదాయకమవుతుందని బోయింగ్ అంచనా. ఏటా 500 మిలియన్ డాలర్లు (రూ 3487 కోట్లు) వ్యాపారం, ఆదాయం దీని ద్వారా జరుగుతుందని ఆ సంస్థ ఆనాడు అభిప్రాయపడింది. అక్రమమార్గాలలో ఒప్పందాలు కుదుర్చుకోవడంలో దిట్ట అయిన దిమిత్రో ఫిర్తాష్‌ను ఇందుకోసం ఎన్నుకుంది. ఆనాడు 8 మంది భారతీయ కీలక అధికారులకు ముడుపులు చెల్లించిన మాట వాస్తవమని మెకిన్సే నివేదిక ద్వారా తెలుస్తోంది. అయితే ఆ పేర్లను న్యూయార్క్ టైమ్స్ ప్రచురించలేదు. ఆంధ్రప్రదేశ్‌లో అప్పట్లో అధికారంలో ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో అన్నింటికీ కేంద్రబిందువు అయిన కేవీపీ ద్వారా ఈ కథ నడిచినట్లు వెల్లడయింది. లైసెన్సుల మంజూరు, ఏయే అధికారులకు ఎంతెంత ఇవ్వాలన్నది కేవీపీ ద్వారానే ఖరారైందని.. ఆయనతో పెరియసామి సుందరలింగం అనే దళారీ సంప్రదింపులు జరిపాడనీ అమెరికాలోని ఇల్లినాయి నార్దర్న్ డిస్ట్రిక్ట్ కోర్టులో సాగిన ఓ కేసులో ఫెడరల్ జ్యూరీ ఆరోపించింది. ఫిర్తాష్, కేవీపీ, సుందరలింగం సహా ఏండ్రాస్ నాప్, సురెన్ గెవర్గాన్, గజేంద్ర లాల్ అనే ఎన్ఆర్ఐలు ఈ కేసులో దోషులని పేర్కొంది. మైనింగ్ ప్రాజెక్టు అంతిమంగా 2014లో రద్దయినప్పటికీ నాటి ముడుపుల బాగోతం వెన్నాడుతూనే ఉంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు ఫిర్తాష్ సన్నిహితుడు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ప్రచార సారథిగా పనిచేసిన పాల్ మన్‌ఫోర్ట్‌కు కూడా సన్నిహితుడు. 2016 అధ్యక్ష ఎన్నికల్లో రష్యా ప్రమేయముందని, ట్రంప్‌కు రష్యన్ గూఢచార సంస్థలు సహకరించాయని, డెమోక్రాట్ల వ్యూహాల లీక్‌లో పుతిన్ టీమ్ హస్తం ఉందని ఆరోపణలు రావడం, వాటిపై రాబర్ట్ మ్యూలర్ ఆధ్వర్యంలో విచారణ సాగుతుండడం తెలిసిందే. ఆనాడు ట్రంప్ రష్యా లింకుల్లో ఫిర్తాష్ ఓ కీలక వారధి అని ఎఫ్‌బీఐతో పాటు అమెరికా రాజకీయ సంస్థలు అనుమానిస్తున్నాయి. బోయింగ్ అక్రమ వ్యవహారాల కేసులో ఫిర్తాష్‌ను తమకు అప్పగించాలని షికాగోలోని ఓ కోర్టు కోరుతోంది. ఓస్ట్‌కెమ్ హోల్డింగ్ ఏజీ అనే సంస్థ అక్రమ లావాదేవీలపై ఫిర్తాష్‌ను ఆస్ట్రియా ప్రభుత్వం నిర్బంధించి 174 మిలియన్ డాలర్ల పూచీకత్తుపై విడుదల చేసింది. ఆ సొమ్ము ఏర్పాటుచేసినది పుతిన్‌కు సన్నిహితుడైన మరో వ్యాపారవేత్త. భారత్‌లో (ఏపీలో) లంచాలు ఎరవేసి ఓ ప్రాజెక్టును సాధించడానికి ఫిర్తాష్ ప్రయత్నించాడని, ఆయన చాలా ప్రమాదకారి అనీ ఆస్ట్రియా ప్రభుత్వానికి ఈమెయిల్ సందేశం రావడంతో ఆయనను దేశం విడిచిపోనివ్వకుండా కట్టడి చేసింది.

చిక్కులున్నా చక్కబెట్టాం!

- ప్రతికూలతలను దాటి..ఆర్థికంగా ముందంజ
- రుణభారం నుంచి రెండంకెల వృద్ధి రేటుకు
- శ్వేతపత్రం విడుదలచేసిన ప్రభుత్వం

అమరావతి, జనవరి1 (ఆంధ్రజ్యోతి): అశాస్త్రీయ విభజన అనంతరం ఎదురైన ఆర్థిక, సామాజిక ప్రతికూలతలను అధిగమించి అనేక కష్టనష్టాలకు ఎదురొడ్డి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అభివృద్ధిపథంలోకి తీసుకొచ్చామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. విభజనతో భారీ రుణాలు, తీవ్రమైన రెవెన్యూ లోటును ఇచ్చినా పరిమిత వనరులతో అద్భుత ఫలితాలను సాధించామని పేర్కొంది. ఇప్పటికే రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ)లో 11.22% వృద్ధిరేటు సాధించామని, 2022 నాటికే ఆంధ్రప్రదేశ్ సుస్థిర లక్ష్యాలను సాధిస్తుందని ఆశాభావం వ్యక్తంచేసింది. ఈ మేరకు మంగళవారం ఆర్థికరంగంపై శ్వేతపత్రం విడుదల చేసింది. తక్కువ వడ్డీకి రుణాల సమీకరణ, రుణాల పునర్వ్యవస్థీకరణతో ఆర్థిక ఆటంకాలను అధిగమిస్తున్నామని పేర్కొంది. శ్వేతపత్రంలోని కీలకాంశాలివీ..

వ్యవసాయమే జీవనాడి..

విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ వ్యవసాయంపైనే ఆధారపడింది. ఉమ్మడి రాష్ట్రంలో ఈ రంగం వాటా 2013-14లో 23 శాతంగా ఉంటే విభజన సమయంలో ఇది 30.2 శాతంగా ఉంది. 2017-18నాటికి 34.4 శాతానికి చేరింది. ప్రస్తుతం ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం వాటా 34.4 శాతంగా ఉంది. పారిశ్రామిక రంగం వాటా 22.1%, సేవలం రంగం 43.5%గా ఉంది. గత నాలుగేళ్లలో రుతుపవనాలు అనుకూలంగా లేనప్పటికీ.. జాతీయ సగటు వృద్ధి 2.4 శాతం ఉండగా నవ్యాంధ్ర వ్యవసాయం, అనుబంధ రంగాల్లో సగటు వృద్ధిరేటు 11 శాతంగా కనిపిస్తోంది. ప్రస్తుత ధరల్లో వ్యవసాయ, అనుబంధ రంగాల ఆదాయ వృద్ధి 2013-14లో రూ.1.28 లక్షల కోట్ల నుంచి 2017-18 నాటికి 2.53 లక్షల కోట్లకు గణనీయంగా పెరిగింది. పారిశ్రామిక రంగంలో ఆదాయ వృద్ధి 2013-14లో రూ.1.07 లక్షల కోట్ల నుంచి 2017-18లో రూ.1.62 లక్షల కోట్లకు.. సర్వీసు రంగంలో 2013-14లో 1.90 లక్షల కోట్ల నుంచి 2017-18 నాటికి రూ.3.20 లక్షల కోట్లకు గణనీయంగా పెరిగింది.

సంస్కరణలతో విజయాలు

నవ్యాంధ్రలో విభజన సమస్యలను అధిగమించడంతోపాటు అనేక సంస్కరణలను తీసుకురావడంతో ఎన్నో విజయాలు వరించాయి. ట్రెజరీల పనితీరులో మార్పు వల్ల ప్రజలు, వినియోగదారులు వాటిని సందర్శించాల్సిన అవసరం లేకుండా పోయింది. రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులకు 10వ వేతన సవరణ సంఘం 29 శాతం ఫిట్‌మెంట్‌ను సిఫారసు చేయగా 2015 సవరించిన వేతన స్కేలులో వేతన నిర్ణయం కోసం మూలవేతనంలో 43 శాతం ఫిట్‌మెంట్‌ను అనుమతించారు. 29వేల ఖాళీ ఉద్యోగాల భర్తీకి అనుమతిచ్చారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల పారితోషికాన్ని భారీగా పెంచారు.



ఆర్థికరంగంపై శ్వేతపత్రం విడుదల చేస్తున్న సీఎం చంద్రబాబు

తెలంగాణ కంటే మెరుగ్గా..

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య జనాభాను 58.32: 41.68 నిష్పత్తిలో విభజించారు. అయితే జీఎస్‌డీపీ వాటా 50.7:49.3 దామాషాలో ఉంది. రెండు ఆర్థిక వ్యవస్థల మధ్య వ్యత్యాసం రూ.12,692 కోట్లు (1.4 శాతం). గత నాలుగేళ్లలో ప్రస్తుత ధరలలో సగటు వృద్ధిరేటు 14.72 శాతంతో ఆంధ్రప్రదేశ్ స్థిరమైన పనితీరు కారణంగా 2017-18లో జీఎస్‌డీపీ వాటా 52.3:47.7 దామాషాలో ఉంది. స్థాపిత రాజధాని, ఉపాధికల్పన, ఆదాయ సమీకరణ, హైదరాబాద్ వంటి ప్రయోజనాలను కోల్పోయినా.. తెలంగాణ కంటే అధిక వృద్ధిరేటును సాధించాం.

కేంద్రం సహాయ నిరాకరణ..

విభజన హామీల అమలుకు కేంద్రం ఏమాత్రం ఆసక్తిచూపడం లేదు. ప్రతికూలతలు ఉన్నా.. సంక్షోభాన్ని అవకాశంగా మలుచుకుని సవాళ్లను అధిగమించాం. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ఏడు మిషన్‌లు, ఐదు గ్రిడ్‌లు, 5 ప్రచారాలు చేపట్టాం. ప్రతి రంగం కింద వెలికితీయని వనరులను గుర్తించి ఉపయోగించుకున్నాం. 2014-15లో జీఎస్‌డీపీ వృద్ధి రేటు 9.2 శాతం ఉంటే 2017-18 నాటికి 11.22 శాతం సాధించాం. గత నాలుగేళ్లలో అఖిల భారత సగటు వృద్ధిరేటు 7.3 శాతం, తెలంగాణ సగటు వృద్ధి 9.7 శాతం కాగా.. నవ్యాంధ్ర 10.52 శాతం సగటు వృద్ధిని సాధించింది. ఆదాయ వృద్ధి నాలుగేళ్లలో నికర పెరుగుదల రూ.3.4 లక్షల కోట్లు.

వాస్తవ రెవెన్యూలోటు రూ.20,582 కోట్లు

ఆంధ్రప్రదేశ్ సహా 11 రాష్ట్రాలకు 14వ ఆర్థిక సంఘం రెవెన్యూలోటు గ్రాంటును సిఫారసు చేసింది. నవ్యాంధ్రకు రూ.22,113 కోట్ల మొత్తం(11.53 శాతం) గ్రాంటు రూపంలో ఇచ్చారు. వాస్తవికంగా ఇంకా రూ.20,582 కోట్ల రెవెన్యూ లోటు ఉంది. 2015-16లో రూ.13,911 కోట్లు, 2016-17లో రూ. 22,161 కోట్లుగా ఉన్న లోటు 2017-18లో రూ.20,582 కోట్లుగా ఉంది. కేంద్రం నుంచి గ్రాంటు అందాక కూడా ఈ లోటు కొనసాగుతోంది. రాష్ట్రం తన రెవెన్యూ రాబడులు, జీఎస్‌డీపీ, మూలధన వ్యయాన్ని పెంచుకోగలిగినప్పటికీ కొత్తగా ఏర్పాటైన రాష్ట్రానికి చాలా నిధులు అవసరమవుతాయి. ఇందుకోసం తన ఆర్థిక వనరులను పెంచుకోవలసి ఉంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకపోవడం వల్ల రెవెన్యూ, ద్రవ్యలోటు పెరిగింది. 13 విభాగాల్లో ఆయా శాఖలు తీసుకున్న మొత్తం రుణం రూ.35,768 కోట్లుగా ఉంది.

అందరికీ సంక్షేమం

- తలసరి ఆదాయం పెంచాం
- పేదోడి కోసం ఎంతైనా చేస్తా
- ప్రతి ఇంట్లో పారిశ్రామికవేత్త: సీఎం

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): విభజనతో ఆర్థికంగా నష్టపోయినా, అన్నీ కోల్పోయి వచ్చినా, ఆదాయం అంతంతే ఉన్నా... నాలుగేళ్లలో పరిస్థితిని క్రమంగా కొంతమేర నిలబెట్టగలిగామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆర్థికంగా కష్టాల్లో ఉన్నా సంక్షేమ పథకాల అమలులో రికార్డు సృష్టించామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మంగళవారం ఉండవల్లిలోని ప్రజావేదికలో ముఖ్యమంత్రి శ్వేతపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డబ్బున్న రాష్ట్రాలు చేయలేనంత సంక్షేమం, అభివృద్ధి చేశామన్నారు. ఉన్న నిధులను సమర్థంగా వినియోగించడం ద్వారా ఆ పనిచేశామన్నారు. పేదలను తక్షణం ఆదుకునేందుకు రేషన్, పండగ కానుకలు ఇచ్చామని, పింఛను ఐదురెట్లు పెంచామని, అందరికీ 2022 కల్లా ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు. కసితో, పట్టుదలతో పని చేసి కష్టాల్లో ఉన్న రాష్ట్రాన్ని నిలబెట్టామని చెప్పారు. భవిష్యత్తులోనూ పేదోడికి ఎంతైనా చేసేందుకు సిద్ధమన్నారు. ఇంకా ఏం చేయాలన్నది చర్చించి వాటిని కూడా చేస్తామన్నారు. అయితే పేదలకు సాయం చేయాలంటే సంపద సృష్టి జరగాలన్నారు. ప్రతిఇంట్లోనూ ఒకరిని పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలన్నది లక్ష్యమన్నారు. విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ కోలుకోవాలంటే విభజన చట్టంలోని అంశాలు అమలుచేయడంతోపాటు ప్రత్యేకహోదా కూడా ఇవ్వాలని నాడు పేర్కొన్నా... మోదీ ప్రభుత్వం విభజన హామీలు అమలుచేయలేదని చంద్రబాబు విమర్శించారు. అయినా సొంతకాళ్లపై నిలబడుతున్నామన్నారు.

సాక్ష్యాల ధ్వంసంలో కుట్ర?

- కావాలనే అప్పీలు సంగతి దాచారు!
- ఆ విషయం జడ్జికి చెప్పని ఉద్యోగులు
- ఆపై కోర్టు అనుమతితో సాక్ష్యాలు ధ్వంసం
- ఆయేషా కేసులో నిగ్గు తేల్చిన సీబీఐ

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఆయేషా మీరా హత్య కేసులో సాక్ష్యాలను ధ్వంసం చేసిందెవరో తేలిపోయింది. విజయవాడలోని కోర్టు కేంద్రంగా సాగిన ఈ కుట్రలో ముగ్గురు ఉద్యోగుల పాత్రపై ఆధారాలు సేకరించింది. ఈ ఘటనలో ఒక మహిళా ఉద్యోగితోపాటు ముగ్గురు కుట్రదారులుగా ఉన్నట్లు కోర్టుకు సమర్పించిన రహస్య నివేదికలో స్పష్టం చేసింది. విశ్వసనీయ వర్గాల కథనం మేరకు ఆ నివేదికలోని అంశాలు ఇలా ఉన్నాయి. 'ఆయేషా మీరా హత్యకేసులో సత్యంబాబుకు శిక్ష పడిన 3 నెలలు (2010 డిసెంబరు 10) తర్వాత మహిళా కోర్టు జూనియర్ అసిస్టెంట్ టి. కుమారి కమిటల్ కోర్టు (4వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు, విజయవాడ)కు సాక్ష్యాలను పంపారు. కమిటల్ కోర్టులో అప్పటి ప్రాపర్టీ క్లర్క్ కె. జయలక్ష్మి వాటిని తీసుకుని వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేశారు. నాలుగేళ్ల తర్వాత (2014 సెప్టెంబరు 7)ఈ కేసులో సాక్ష్యాలను ధ్వంసం చేసేందుకు అనుమతి కోరుతూ కమిటల్ కోర్టు మెజిస్ట్రేట్ కె. శివరామకృష్ణ ముందు అప్పటి కోర్టు ప్రాపర్టీ క్లర్క్ పి.వెంకట కుమార్ ఫైలు పెట్టారు. కోర్టు ఇన్‌స్పెక్షన్ ఉన్నందున ధ్వంసానికి అనుమతివ్వాలని కోరడంతో న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సాక్ష్యాలను ధ్వంసం చేశారు' అని నివేదికలో పేర్కొన్నారు. కేసుల్లో అప్పీలు వేశారా? అప్పీలు గడువు ముగిసిందా? హైకోర్టులో ఏం జరిగింది? అనేవి చూశాకే సాక్ష్యాల ధ్వంసంపై న్యాయస్థానాలు నిర్ణయం తీసుకుంటాయి. ఆయేషా మీరా హత్య కేసులో హైకోర్టులో అప్పీలు పెండింగ్ ఉందన్న విషయాన్ని ప్రాపర్టీ క్లర్క్ వెంకట కుమార్ కోర్టు అనుమతిలో ఎక్కడా ప్రస్తావించలేదు. నిరంతరం టీవీల్లో, పత్రికల్లో వస్తోన్న ఈ విషయం గురించి ఆయనకు తెలియదనుకోవడం లేదని పేర్కొంటూ కుట్రదారుల జాబితాలో ఏ-3గా వెంకట కుమార్ పేరును చేర్చింది. విజయవాడ మహిళా కోర్టు సీనియర్ అసిస్టెంట్ సుబ్బారెడ్డికి హైకోర్టులో అప్పీలు చేసిన విషయం 2011 జనవరిలోనే తెలిసింది. అప్పటికే సాక్ష్యాలు కమిటల్ కోర్టుకు వెళ్లిపోయాయి. అయినా ఆ విషయాన్ని ఆయన విజయవాడ కోర్టుకు తెలియజేయలేదు. దీంతో సీబీఐ ఆయన్ను రెండో నిందితుడిగా చేర్చింది.

కీలక పాత్రధారి కుమారి?

సాక్ష్యాలను ధ్వంసం చేసేముందు అప్పీలు విషయం చూసుకోవాల్సిన క్లర్క్ టి.కుమారి ఆ విషయాలనే పట్టించుకోలేదని సీబీఐ పేర్కొంది. నాన్ వాల్యుబుల్స్ వెనక్కి ఇస్తున్నానని జడ్జికి చెప్పి ఉత్తర్వులు పొందడలో కుట్ర ఉందని సీబీఐ అనుమానిస్తోంది. అందుకే ఈ కేసులో ఆమెను ప్రధాన నిందితురాలిగా చేర్చినట్లుగా కోర్టుకు తెలిపింది. అయితే జడ్జి వద్దకు నాన్ వాల్యుబుల్స్ ధ్వంసం అనుమతి ఫైలు పెట్టే ముందు హైకోర్టు అప్పీలు గురించి పేర్కొనలేదు గనుక ఇందులో సదరు న్యాయమూర్తికి ఎలాంటి సంబంధం లేదని సీబీఐ తేల్చింది. అదే విధంగా నిబంధనల మేరకు వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసినందున జయలక్ష్మి పాత్ర కూడా లేదని దర్యాప్తు సంస్థ స్పష్టం చేసింది.

నాతోనే జనం.. నాదే ప్రభంజనం

ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ ఉద్ఘాటన

కాంగ్రెస్ ప్రథమ కుటుంబం బెయిల్‌పై!

అయోధ్య తీర్పునకు ఆ పార్టీ అడ్డంకులు

కోర్టు తేల్చిన తర్వాతే ప్రభుత్వ బాధ్యత

సర్జికల్ స్ట్రైక్స్ సమయంలో టెన్షన్



న్యూఢిల్లీ, జనవరి 1: "మోదీ ప్రభంజనం ముగిసింది' అనేవారు ఎప్పుడూ ఉంటారు. కానీ.. ప్రజలు నాతోనే ఉన్నారు' అని ప్రధాని నరేంద్ర మోదీ తేల్చిచెప్పారు. 2019 ఎన్నికలను ప్రజలకు, మహాకూటమికి మధ్య జరగనున్న పోరుగా అభివర్ణించారు. కాంగ్రెస్ పార్టీ తనపై బురద జల్లినా సరే రాఫెల్ యుద్ధవిమానాలపై ముందుకే వెళ్తామని స్పష్టం చేశారు. రాఫెల్ డీల్‌పై గగ్గోలు పెట్టేవారు దేశ రక్షణ దళాలను బలహీనం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రామమందిరంపై న్యాయప్రక్రియ పూర్తయ్యాకే.. రాజ్యాంగపరిధిలో నిర్మిస్తామని వివరించారు. కొత్త సంవత్సరం తొలి రోజునే ఇంటర్వ్యూ రూపంలో మోదీ ప్రజల ముందుకు వచ్చారు. సర్జికల్ స్ట్రైక్స్, రుణమాఫీ నుంచి శబరిమల, ట్రిపుల్ తలాక్, ఉర్జిత్ పటేల్ రాజీనామా దాకా పలు అంశాలపై మాట్లాడారు. 2018 విజయవంతంగా ముగిసిందని.. అందులో ఎన్నికలు ఒక అంశమని పేర్కొన్నారు. మూడు రాష్ట్రాల్లో అధికారం కోల్పోవడాన్ని తేలిగ్గా తీసుకున్న ఆయన.. కాంగ్రెస్ ప్రథమ కుటుంబం బెయిల్‌పై బయట ఉందంటూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీ సైతం కాంగ్రెస్ సంస్కృతి నుంచి బయటపడాలన్నారు. ఏఎన్ఐ ఎడిటర్ స్మితా ప్రకాశ్ అడిగిన ప్రశ్నలకు ప్రధాని సవివరంగా సమాధానాలు ఇచ్చారు. ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలు ఇవి...



సర్జికల్ స్ట్రైక్స్... రిస్క్ అని తెలుసు!

"కశ్మీర్‌లోని ఉడీలో సైనిక స్థావరంపై ఉగ్రవాదులు దాడి చేశారు. మన జవాన్లు 20 మంది సజీవ దహనమయ్యారు. నా మనసుకు చాలా కష్టమనిపించింది. దీనికి గట్టిగా బదులు చెప్పాలని ఆర్మీ అధికారులు భావించారు. 'సరే' అంటూ వారికి స్వేచ్ఛ ఇచ్చాం. అప్పుడు... సర్జికల్ స్ట్రైక్ ఆలోచన పుట్టింది. 2016 సెప్టెంబరు 28న మన కమెండోలు నియంత్రణ రేఖ దాటి పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో మెరుపుదాడులు చేశారు. నిజానికి... అంతకుముందు రెండుసార్లు ఈ తేదీని నిర్ణయించి, మనవాళ్ల భద్రత దృష్ట్యా మళ్లీ వాయిదా వేశాం. ఇదిపెద్ద రిస్క్ అని నాకూ తెలుసు. దేశం కోసం ప్రాణత్యాగం చేసేందుకూ మన సైనికులు వెనుకాడరు. కానీ.. ఈ ఆపరేషన్‌లో వారికి ఎలాంటి హాని కలగొద్దని నా ఉద్దేశం. మిషన్ విఫలమైనా నేను పట్టించుకోను... కానీ, మీరు మాత్రం సూర్యోదయ సమయానికి క్షేమంగా వెనుతిరిగి వచ్చేయండి అని కమెండోలకు స్పష్టంగా చెప్పాను. మనవాళ్లు ఎల్‌వోసీని దాటారు. ఆ క్షణం నుంచి ఉత్కంఠ మొదలైంది. వెళ్లిన వాళ్లంతా క్షేమంగా తిరిగి వచ్చారని నిర్ధారణ అయ్యేదాకా నా మనసు మనసులో ఉండదని స్పష్టం చేశాను. ఆపరేషన్ విజయవంతమైంది. ఆర్మీ అధికారులే దేశానికి, పొరుగు దేశానికీ (పాక్) తెలియచేశారు. దురదృష్టవశాత్తూ కొన్ని పార్టీలు మాత్రం సర్జికల్ స్ట్రైక్స్‌పై సందేహాలు లేవనెత్తాయి. అలా సందేహాలు వ్యక్తం చేయడం, అసలేమీ జరగలేదని చెప్పడం పాకిస్థాన్‌కు అవసరం! కానీ... పాక్ మాటలనే ఇక్కడి వాళ్లు మాట్లాడారు.





● 'మోదీ మ్యాజిక్' తగ్గుతోందా!

'మోదీ మ్యాజిక్' అంటూ ఒకటుందని అంగీకరించినందుకు వారికి ధన్యవాదాలు. 'మోదీ ప్రభంజనం ముగిసింది' అంటూ కొందరు వ్యక్తులు ప్రతిసారీ చెబుతూనే ఉంటారు. ఒకరిద్దరు ఎక్కువ, తక్కువ కావచ్చు కానీ... ఆ 'కొందరు' అలాగే ఉంటారు. 2014 ఎన్నికల ముందు కూడా ఇదే చెప్పారు. బీజేపీకి 200 సీట్లు కూడా రావన్నారు. ఇప్పుడూ అదే అంటున్నారు. వారెవరో మీకూ తెలుసు. తమ ఆకాంక్షలు, కలలను నెరవేరుస్తారనే విశ్వాసం నుంచే 'ప్రభంజనం' పుడుతుంది. అలాంటి విశ్వాసం ఇప్పుడు దేశ యువతలో కనిపిస్తోంది. సామాన్య ప్రజలకు అన్నీ తెలుసు!

● 'మందిరం'పై ముందు కోర్టు తేల్చనీ...

అయోధ్యలో రాజ్యాంగ ప్రక్రియకు లోబడి రామమందిరం నిర్మిస్తామని బీజేపీ మేనిఫెస్టోలో హామీ ఇచ్చాం. ప్రస్తుతం ఈ అంశం సుప్రీంకోర్టు పరిధిలో ఉంది. కాంగ్రెస్ న్యాయవాదులు అడ్డంకులు సృష్టిస్తుండటంతో విచారణ ప్రక్రియ ఆలస్యమవుతోంది. అంతలోనే... ఆర్డినెన్స్ జారీపై బయట చర్చ జరుగుతోంది. అయితే... ముందు న్యాయ ప్రక్రియ పూర్తి కానివ్వండి! ఆ తర్వాతే మందిర నిర్మాణం కోసం ప్రభుత్వ బాధ్యతగా చేయాల్సిన అన్ని ప్రయత్నాలు చేస్తాం.

● ఓడింది ఛత్తీస్‌గఢ్‌లోనే...

ఇటీవలే ఐదు రాష్ట్రాల ఎన్నికలు జరిగాయి. తెలంగాణ, మిజోరాంలో ఎవరూ బీజేపీకి ఏమాత్రం అవకాశమివ్వలేదు. రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో వచ్చింది హంగ్ అసెంబ్లీ మాత్రమే. అక్కడ ప్రభుత్వ వ్యతిరేకత కూడా కనిపించింది. ఇక... మాకు ఘోర పరాజయం ఎదురైంది ఛత్తీస్‌గఢ్‌లో మాత్రమే. అదే సమయంలో... త్రిపుర, హరియాణాలలో జరిగిన స్థానిక సంస్థల ఉప ఎన్నికలు, జమ్మూ కశ్మీర్ పంచాయతీ ఎన్నికల్లో మాకు లభించిన విజయాన్ని కూడా గుర్తించాలి. హరియాణాలోని మొత్తం మునిసిపల్ కార్పొరేషన్లలో గెలిచాం. త్రిపురలో 90-95 శాతం సొంతం చేసుకున్నాం. కశ్మీర్‌లో మా పార్టీ తరఫున 30 నుంచి 35వేల మంది గెలిచారు. గెలుపోటములు మాత్రమే అన్నింటికీ కొలబద్ధ కాదు.

● కాంగ్రెస్‌కు స్వీయ ముక్తి అవసరం!

కాంగ్రెస్ ముక్త్ భారత్ గురించి గతంలో చాలాసార్లు మాట్లాడాను. కాంగ్రెస్ అనేది ఒక 'సంస్కృతి'. కులతత్వం, కుటుంబ రాజకీయం, అవినీతి, అప్రజాస్వామ్యం... ఇవన్నీ కాంగ్రెస్ సంస్కృతిలో భాగం. కాంగ్రెస్ ముక్త్ భారత్ అంటే... ఈ సంస్కృతి లేని భారత్‌ను సాధించడమే. ఇంకా చెప్పాలంటే... కాంగ్రెస్ సంస్కృతి నుంచి కాంగ్రెస్ పార్టీ కూడా ముక్తి పొందాలి. విపక్షంగా కాంగ్రెస్ పార్టీ విఫలమైంది. అది ఒక కుటుంబ పార్టీ! నాలుగు తరాలు దేశాన్ని ఏలిన 'ఫస్ట్ ఫ్యామిలీ' వారిది. 2జీ, కామన్ వెల్త్ స్కామ్, నేషనల్ హెరాల్డ్ ఇలా అనేక కుంభకోణాలకు పాల్పడి... బెయిలుపై బయట స్వేచ్ఛగా తిరుగుతున్నారు. ఇది చాలా పెద్ద విషయం!

● అనిల్ అంబానీ కోసం దసో, ఫ్రాన్స్‌పై ఒత్తిడి

ఈ ఆరోపణలు నాపై కాదు! మా ప్రభుత్వంపై చేస్తున్నారు. ఈ ఆరోపణలు దేశ రక్షణ బలగాలను బలహీనపరుస్తున్నాయి. ఈ ఆరోపణల గురించి నేను పట్టించుకోను. నన్ను వ్యక్తిగతంగా నిందిస్తున్నారని బాధపడుతూ కూర్చోవాలా... లేక దేశ భద్రతా అవసరాలు తీర్చడంపై దృష్టి సారించాలా? రాఫెల్ విమానాలను వీలైనంత త్వరగా సమకూర్చుకునేందుకు ప్రయత్నిస్తాం. వాళ్లు అలా నాపై ఎంత బురద చల్లినా సరే... నేను నిజాయితీ మార్గంలోనే ప్రయాణిస్తాను. మన సైనికులను గాలికి వదిలేయను. ఆరోపణలు వచ్చినా సరే... సైన్యానికి అవసరమైనవన్నీ సమకూర్చి తీరుతాం.

తలాక్, శబరిమల వేర్వేరు...

ఇవి రెండూ వేర్వేరు అంశాలు! ప్రపంచంలోని అనేక ఇస్లామిక్ దేశాలే ట్రిపుల్ తలాక్‌ను నిషేధించాయి. పొరుగున ఉన్న పాకిస్థాన్ కూడా నిషేధించింది. అంటే... ఇది మతపరమైన విశ్వాసం, సంప్రదాయం కానే కాదు. నిజంగా అది మత విశ్వాసమై ఉంటే... తక్షణ తలాక్‌పై ఆ దేశాలు నిషేధం విధించేవి కాదు. తలాక్ రద్దు... సామాజిక న్యాయం, లైంగిక సమానత్వానికి సంబంధించినది. అందరికీ సమాన న్యాయం జరగాలన్నది భారత స్వాభావిక ధర్మం! ఇక... శబరిమల అంశం సంప్రదాయానికి సంబంధించినది. మన దేశంలో కొన్ని ఆలయాల్లోకి పురుషులకు ప్రవేశం లేదు. పురుషులు అక్కడికి వెళ్లలేరు. శబరిమలపై ఒక మహిళా న్యాయమూర్తి కూడా తీర్పులో కొన్ని వ్యాఖ్యలు చేశారు. మహిళగా ఆమె కొన్ని సూచనలు ఇచ్చారు. వాటిపై చర్చ జరగాలి.



పెద్దనోట్ల రద్దు 'షాక్' కాదు!

పెద్ద నోట్ల రద్దు ప్రజలకు ఆకస్మికంగా ఇచ్చిన 'షాక్' కానేకాదు. నల్లధనం, దాని నియంత్రణ గురించి అంతకు ముందు ఏడాది నుంచే మాట్లాడుతున్నాం. నల్లధనం ఉంటే బయటపెట్టాలని, జరిమానాలు కడితే ఎలాంటి సమస్య ఉండదని చెప్పాం. చాలా కొద్దిమంది మాత్రమే స్పందించారు. మిగిలిన వాళ్లు... 'మోదీ కూడా అందరిలాగా మాటలు చెబుతున్నాడులే' అనుకున్నారు. నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ దేశాన్ని వదిలి ఎందుకు పారిపోయారనుకున్నారు? పెద్దనోట్ల రద్దు వల్లే! అలా పారిపోయిన వాళ్లందరినీ తిరిగి తీసుకొస్తాం! ఈరోజు కాకుంటే... రేపు! ఇది జరిగి తీరుతుంది. భారతదేశ సొమ్మును దోచుకున్న వాళ్ల నుంచి ప్రతి పైసా కక్కించి తీరుతాం.

వ్యవస్థల గురించి కాంగ్రెస్ మాట్లాడటమా

సీబీఐ, ఆర్బీఐ, ఈడీ వంటి వ్యవస్థలను దెబ్బతీస్తున్నట్లు మమ్మల్ని విమర్శిస్తున్నారు. కాంగ్రెస్‌కు దీని గురించి మాట్లాడే హక్కు లేదు. ప్రధాని కార్యాలయాన్ని తోసిరాజంటూ సోనియా నేతృత్వంలో జాతీయ సలహా మండలిని ప్రవేశపెట్టారు. కేంద్ర కేబినెట్ తీర్మాన ప్రతిని విలేకరుల సమావేశంలో రాహుల్ గాంధీ ముక్కలుగా చించేశారు. న్యాయవ్యవస్థలోనూ వేలు పెట్టారు. సీనియర్ జడ్జిలను కాదని... తమకు అనుకూలమైన జూనియర్‌లకు పదవులిచ్చారు. ఆర్బీఐ గవర్నర్లకు ఎన్నోసార్లు ఉద్వాసన పలికారు. ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్‌ను జోకర్‌గా అభివర్ణించారు. వాళ్లు మమ్మల్ని విమర్శించడమేమిటి! సొహ్రాబుద్దీన్ కేసు తీర్పులో ఏం చెప్పారో చూడండి. వ్యవస్థలను కాంగ్రెస్ ఎలా దుర్వినియోగం చేసిందో తెలుస్తుంది. అగస్టా వెస్ట్‌ల్యాండ్ కేసులో దళారీ మిచెల్‌ను దుబాయ్ నుంచి తీసుకొస్తే... ఆయన తరఫున కాంగ్రెస్ న్యాయవాది వాదించడం ఎందుకు? మా విషయానికి వస్తే... సీబీఐలో ఇద్దరు ముఖ్య వ్యక్తుల మధ్య విభేదాలు వచ్చినప్పుడు... ఆ సంస్థ ప్రతిష్ఠను దృష్టిలో పెట్టుకుని ఇద్దరినీ సెలవులో పంపించారు. ఇక... ఆర్బీఐ గవర్నర్ పదవికి వ్యక్తిగత కారణాలవల్లే రాజీనామా చేసినట్లు ఉర్జిత్ పటేల్ స్పష్టంగా చెప్పారు. ఆయనపై రాజకీయ ఒత్తిళ్ల సమస్యే లేదు. మొట్టమొదటిసారి ఈ విషయం బయటపెడుతున్నాను. ఉర్జిత్ పటేల్ ఆరేడు నెలల కిందటే నన్ను కలిశారు. వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేస్తున్నట్లు లేఖ కూడా ఇచ్చారు.

- నరేంద్ర మోదీ

రుణ మాఫీలు.. రాజకీయ స్టంట్లు

- వాటితో మెజారిటీ రైతులకు లబ్ధి జరగదు
- బ్యాంకుల్లో అప్పులున్నది తక్కువ మందికే
- మెజారిటీ రైతుల రుణం అప్పులోళ్ల నుంచే
- రుణ మాఫీ కాదు.. సాధికారతే లక్ష్యం: మోదీ

న్యూఢిల్లీ, జనవరి 1: మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌ల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఇచ్చిన రుణ మాఫీ హామీలను 'పొలిటికల్ స్టంట్లు'గా ప్రధాన మంత్రి మోదీ అభివర్ణించారు. 'తప్పుదోవ' పట్టించే ఇటువంటి ప్రకటనలతో మెజారిటీ రైతులకు లబ్ధి జరగదని చెప్పారు. ఎందుకంటే, వాళ్లు రుణాలు తీసుకునేది బ్యాంకుల నుంచి కాదని, అప్పులోళ్ల నుంచని తెలిపారు. "అబద్ధాలు చెప్పడం.. తప్పుదోవ పట్టించడాన్నే నేను లాలీపాప్‌లు అని అన్నాను. 'వ్యవసాయ రుణాలన్నీ మేం మాఫీ చేసేశాం' అని చెబుతున్నారు. వాస్తవానికి అలా జరగడం లేదు. ఇందుకు, వాళ్లు జారీ చేసిన ఉత్తర్వులనే చూడండి. వాళ్లు తప్పుదోవ పట్టించకూడదు. మరీ ముఖ్యంగా, బాధ్యతాయుతమైన రాజకీయ పార్టీ ఇటువంటి పని చేయకూడదు" అని హితవు పలికారు. రైతుల సమస్యలకు ఒకే ఒక్క పరిష్కారం వారికి సాధికారత కల్పించడమని, విత్తనాల నుంచి మార్కెట్ వరకూ అన్ని సౌకర్యాలనూ వారికి అందించడమని అన్నారు. అందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కట్టుబడి ఉందన్నారు. "రుణ మాఫీ ఆదుకుంటుందని అనుకుంటే, చేసి తీరాల్సిందే. కానీ, గతంలో చాలా ప్రభుత్వాలు రుణ మాఫీ చేశాయి. 2009లో ఎన్నికల విజయమూ దాని ఫలితమే. మన వ్యవస్థలో లోపం ఏమిటంటే.. రైతులు అప్పుల ఊబిల్లో కూరుకుపోతున్నారు. 'ఎన్నికలు-రుణ మాఫీలు' అనే విష వలయాన్ని పార్టీలు మళ్లీ మళ్లీ హామీ ఇస్తున్నాయి" అని తప్పుబట్టారు. రైతులకు ఉద్దేశించిన వంద పథకాలను కోల్డ్ స్టోరేజీలో పెట్టారని, తాము వాటిని మళ్లీ ప్రారంభించామని తెలిపారు. "రైతుకు అప్పు అవసరం లేని పరిస్థితిని మనం తీసుకురావాలి. స్వామినాథన్ కమిటీ నివేదికను 2007లోనే అమలు చేసి ఉంటే.. రైతులకు ఇప్పుడు అప్పులే అవసరం ఉండేది కాదు. దాని బదులు, ఎన్నికల్లో గెలుపు మార్గాలను వాళ్లు అన్వేషించారు. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునే రైతులు పరిమితమే. మెజారిటీ రైతులు అప్పులోళ్ల నుంచే తీసుకుంటారు. రుణ మాఫీ ప్రకటిస్తే.. ఈ రైతులు లబ్ధిదారులు కాబోరు. ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతులంతా ఈ పరిధికి బయట ఉన్నవారే" అని వివరించారు. అయినా, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు రుణ మాఫీని అమలు చేస్తుంటే.. తామేమీ వాటిని అడ్డుకోవడం లేదని చెప్పారు. బ్యాంకులను లూటీ చేసిన వాళ్లు ఆ సొమ్మును తిరిగి చెల్లించేలా కేంద్రం చట్టాలు చేసిందని, ఇప్పటికే 3 లక్షల కోట్లు తిరిగి వచ్చాయని తెలిపారు.



మోదీ ఇంటర్వ్యూపై ఎవరేమన్నారంటే

- నోట్ల రద్దు, జీఎస్టీ, కుంభకోణాలు, రైతుల కష్టాల గురించి వదిలేసి ఇంటర్వ్యూ మొత్తం 'నేను, నాది, నేనే' ఈ పదాలతోనే సాగింది.
  -కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సూర్జేవాలా
- బూటకపు ఇంటర్వ్యూ ద్వారా ప్రజలను మోసం చేయలేరు. దేశ అభివృద్ధి, సమస్యలపై పార్లమెంటులో, ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడాలి
  -కాంగ్రెస్ సీనియర్ నేత ఆనంద్ శర్మ
- ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని మోదీ ఒకే ఇంటర్వ్యూతో తిప్పికొట్టారు. దేశంలోని అభివృద్ధి, సమస్యలపై సమగ్రంగా మాట్లాడారు.
  -బీజేపీ అధికార ప్రతినిధి నళిన్ కోహ్లీ
- ప్రస్తుత బీజేపీ ప్రభుత్వమే రామాలయాన్ని నిర్మిస్తుందని ప్రజలు భావిస్తున్నారు
  -ఆరెస్సెస్
- నరేంద్ర మోదీ దృష్టిలో రాముడు చట్టం కంటే గొప్పవాడు కాదు.
  -సంజయ్ రౌత్, శివసేన
- కొద్ది రోజుల్లో దిగిపోయే ప్రధాని మాటలు ఏమంత ప్రభావం చూపవు. ఇంటర్వ్యూలో సోనియాను విమర్శించడానికి బదులు ప్రజలకు ఇచ్చిన హామీల గురించి మాట్లాడితే బాగుండేది. రైతుల సమస్యలను ప్రస్తావిస్తే బాగుండేది.
  -సంజయ్ సింగ్, ఆప్ నేత

మహాకూటమి.. మహా భయం!

అదో విఫల ప్రయోగం.. తెలంగాణ ఎన్నికల్లో రుజువైంది

- కేంద్రంలోనూ అదే ఫలితం..!
- ప్రధానిగా మోదీ కావాలా? వద్దా?
- లోక్‌సభ ఎన్నికల్లో ఇదే రెఫరెండం
- కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ



న్యూఢిల్లీ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీని ఎదుర్కొనేందుకు ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి ఏర్పాటు చేయతలపెట్టిన మహాకూటమి 'ప్రయత్నించి, పరీక్షించి, తిరస్కరించినది' అని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ చెప్పారు. మహాకూటమి ఆలోచన దేశాన్ని భయపెట్టేదన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికలు 'ప్రధానిగా మళ్లీ మోదీ కావాలా? వద్దా?' అన్న ఒక్క విషయంపైనే రెఫరెండంగా ఉంటాయని స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో మోదీ, 'ఎవ రో ప్రతిపాదిస్తున్న అస్పష్టమైన ఆలోచన'ల మధ్య పోరు ఉంటుందని తెలిపారు. తెలంగాణలో లాగానే జాతీయ స్థాయిలోనూ మహాకూటమి విఫల ప్రయోగం అవుతుందని జైట్లీ చె ప్పారు. దేశంలో కూటములపై ప్రయోగాలు జరిగాయని, విఫలమయ్యాయని, అదో తిరస్కరించిన ఆలోచన అని మంగళవారం ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. అధ్యక్ష ఎన్నికల తరహా లో లోక్‌సభ ఎన్నికల పోటీ కూడా మోదీ, రాహుల్ గాంధీ మధ్యే ఉంటే సంతోషమన్నారు.

ఆర్థిక పరిపుష్టి ఉంటే రుణమాఫీకి ఓకే..

ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా ఆర్థికంగా బలంగా ఉండి రైతులకు రుణమాఫీ చేస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదని జైట్లీ స్పష్టం చేశారు. పంజాబ్, కర్ణాటక రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో రుణమాఫీ 'ప్రకటన'గానే మిగిలిపోయిందన్నారు. ఇలాంటి సమయాల్లో రైతులు తీసుకున్న రుణాలను చెల్లించరని, దీంతో నిరర్థక ఆస్తులు పెరిగిపోతాయని తెలిపారు. ఫలితంగా వచ్చే పంటకు రుణం ఇచ్చే సామర్థ్యం బ్యాంకులకు ఉండదని వివరించారు. తెలంగాణ, యూపీ, మహారాష్ట్ర మాత్రమే రుణమాఫీ హామీని నెరవేర్చాయని చెప్పారు.

టీడీపీ కాంగ్రెస్‌తో.. తృణమూల్‌తో టీఆర్ఎస్

జాతీయ స్థాయిలో ఏర్పాటు చేయతలపెట్టిన కూటమిలోనే విభిన్న ఆలోచన లు ఉన్నాయని జైట్లీ ఎద్దేవా చేశారు. మ హాకూటమి ఆలోచనే రెండు భిన్న సిద్ధాంతాలుగా విడిపోయిందని గుర్తుచేశారు. కాంగ్రెస్, డీఎంకే, కొన్ని కమ్యూనిస్టు పార్టీ లు, టీడీపీ కలిసి కూటమి ఏర్పాటుకు ప్రయత్నిస్తుండగా తెలంగాణ సీఎం కేసీఆర్ నేతృత్వంలోని టీఆర్ఎస్ మరో కూటమికి యత్నించడమే దీనికి నిదర్శనమన్నా రు. కేసీఆర్ టీఎంసీ అధ్యక్షురాలు మమత, బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్‌లతో చర్చలు జరుపుతున్నారన్నారు.

మాయా.. మజాకా..!

- దిగొచ్చిన రాజస్థాన్, ఎంపీ ప్రభుత్వాలు

లఖ్‌నవూ, జనవరి 1: గత ఏడాది ఏప్రిల్ 2న భారత్‌బంద్ సందర్భంగా అమాయకులు, నిర్దోషులపై పెట్టిన అన్ని కేసులను ఉపసంహరించాలని, లేదంటే ప్రభుత్వాలకు మద్దతు ఉపసంహరిస్తామని మాయావతి సోమవారం మధ్యప్రదేశ్, రాజస్థాన్ ప్రభుత్వాలను హెచ్చరించారు. దీనికి స్పందించిన మధ్యప్రదేశ్‌లోని కమల్‌నాథ్ సర్కారు.. గతంలో బీజేపీ ప్రభుత్వం రాజకీయ దురుద్దేశంతో అమాయకులపై పెట్టిన కేసులను, 15 ఏళ్ల బీజేపీ పాలనలో రాజకీయ కోణంలో పెట్టిన కేసులన్నీ ఎత్తివేస్తామని ఎంపీ న్యాయశాఖ మంత్రి పీసీ శర్మ తెలిపారు. ఇక రాజస్థాన్‌లో మాత్రం భారత్ బంద్ సందర్భంగా నమోదైన కేసులు పరిశీలించిన తర్వాతే ఉపసంహరిస్తామని సీఎం అశోక్ గెహ్లోట్ తెలిపారు.

ఎన్నికల్లో పోటీ చేస్తున్నా: ప్రకాశ్‌రాజ్

బెంగళూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల బరిలోకి దిగనున్నట్లు ప్రముఖ నటుడు ప్రకాశ్‌రాజ్ నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మంగళవారం ప్రకటించారు. ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలని భావిస్తున్నానని, ఏనియోజకవర్గం అనేది నిర్ణయించుకోలేదన్నారు.

బీజేపీ 'దళిత' కిచిడీ..

న్యూఢిల్లీ, జనవరి 1: దళిత ఓటర్లకు గాలం వేసేందుకు బీజేపీ సరికొత్త ప్రయోగాలు చేస్తోంది. వీటిలో భాగంగా ఆదివారం ఇక్కడి రామ్‌లీలా మైదానంలో నిర్వహించే భీమ్ మహాసంగమ్ ర్యాలీలో మూడు వేల కేజీల కిచిడీ వండనుంది. ఈ కిచిడీ తయారీలో వాడే వస్తువులన్నింటినీ దళితుల వద్ద నుంచే సేకరించనున్నారు. ఈ 'సమరసతా కిచిడీ' గిన్నిస్ రికార్డు సృష్టిస్తుందని బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు మోహన్‌లాల్ గిహారా పేర్కొన్నారు.

తెలంగాణలో సం'గ్రామం'

- మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు
- 12,732 సర్పంచ్‌లు, 1,13,170 వార్డులు
- ఈ నెల 7, 11, 16 తేదీల్లో నోటిఫికేషన్లు
- ఈ నెల 21, 25, 30వ తేదీల్లో పోలింగ్
- పోలింగ్ రోజునే లెక్కింపు, ఫలితాలు

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలకు నగారా మోగింది. రాష్ట్రంలోని 12732 సర్పంచ్ పదవులకు, 1,13,170 వార్డు సభ్యుల పదవులకు మూడు విడతలుగా ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) సోమవారం షెడ్యూల్ జారీ చేసింది. 2019 నూతన సంవత్సరం ఆరంభం రోజునే వెలువడిన ఈ షెడ్యూల్ ప్రకారం జనవరి నెలలోనే పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ముగియనుంది. పంచాయతీల పాలకమండళ్ల గడువు ముగిసిన దాదాపు ఆరు నెలల తరువాత కొత్త పాలకమండళ్లు కొలువుదీరబోతున్నాయి. ఎస్ఈసీ కమిషనర్ నాగిరెడ్డి సోమవారం సాయంత్రం తన కార్యాలయంలో ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు. దీంతో రాష్ట్రంలో ఎన్నికల నియమావళి (కోడ్) అమలులోకి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. దాదాపు 1.50 కోట్ల మంది ఓటర్లు పంచాయతీ ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. కాగా తొలి విడత పంచాయతీ ఎన్నికల కోసం నోటిఫికేషన్‌ను ఈ నెల 7న, రెండో విడత కోసం 11న, మూడో విడత కోసం 16న నోటిఫికేషన్‌లు జారీ చేయనున్నారు. ఇక పోలింగ్ మొదటి విడత ఈ నెల 21న, రెండో విడత ఈ నెల 25న, మూడో విడత 30న జరగనుంది. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. ఆ వెంటనే ఓట్ల లెక్కింపు చేపట్టి.. ఫలితాలు వెల్లడిస్తారు. తొలుత వార్డులకు లెక్కింపు జరిపిన అనంతరం సర్పంచ్ ఓట్లు లెక్కిస్తారు. ఫలితాలు వెలువడిన వెంటనే చేతులెత్తే పద్ధతిన ఉప సర్పంచ్‌ను ఎన్నుకుంటారు. ఏదైనా కారణంగా ఉప సర్పంచ్‌ను ఎన్నుకోని పక్షంలో తదుపరి ప్రత్యేక సమావేశంలో ఎన్నుకునే వీలుంది. కాగా, రాష్ట్రంలోని 19 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగడం లేదు. ఇందులో 17 గ్రామ పంచాయతీలకు పాలకమండళ్ల గడువు ఇంకా ముగియలేదు. మరో రెండు పంచాయతీల ఎన్నికలను కోర్టు కేసుల కారణంగా నిలిపేశారు.

బ్యాలెట్ పేపర్లతోనే ఎన్నికలు

గ్రామ పంచాయతీ ఎన్నికలను ఎప్పటిలాగే బ్యాలెట్ పేపర్లపైనే నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్రంలో 3.50 కోట్ల బ్యాలెట్ పత్రాలను గుర్తులతో ముద్రించి ఎస్ఈసీ సిద్ధం చేసుకుంది. పంచాయతీ పోలింగ్ కోసం వాడే బ్యాలెట్ పత్రాలపై అభ్యర్థుల పేర్లు, ఫొటోలు ఉండవు. కేవలం గుర్తులు మాత్రమే ఉంటాయి. అభ్యర్థులను కేటాయించిన గుర్తుల చివర నోటా ఉంటుంది. ఈ గుర్తులకు ఎదురుగా ఉన్న గడిలో స్వస్తిక్ ముద్రను వేయడం ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంటుంది. సర్పంచ్ అభ్యర్థుల కోసం తెలుపు రంగు బ్యాలెట్, వార్డు సభ్యుల కోసం గులాబీ రంగు బ్యాలెట్ పత్రాలను వినియోగిస్తారు.

ఎన్నికల వ్యయ పరిమితి పెంపు

పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వ్యయ పరిమితిని భారీగా పెంచారు. గతంలో 10 వేలకు పైగా జనాభా కలిగిన పంచాయతీకి సర్పంచ్ అభ్యర్థులు రూ.80 వేలు, వార్డు సభ్యులు రూ.10 వేల వరకు ఖర్చు చేసేలా పరిమితి ఉంది. 10 వేలలోపు జనాభా కలిగిన పంచాయతీల్లో సర్పంచ్ అభ్యర్థులకు రూ.40 వేలు, వార్డు సభ్యులకు రూ.5 వేలు మాత్రమే వ్యయ పరిమితి ఉండేది. ప్రస్తుత ఎన్నికల్లో ఈ వ్యయ పరిమితిని భారీగా పెంచారు. జనాభా పరిమితిలోనూ మార్పు తెచ్చారు.

భారత టెన్నిస్‌కు ఏఐటీఏ చేసిందేమిటి?

పుణె: భారత్‌లో టెన్నిస్ పురోగతికి గత మూడు దశాబ్దాలుగా చేసిందేమిటో చెప్పాలని మాజీ ఆటగాడు సోమ్‌దేవ్ దేవ్‌వర్మన్ ఏఐటీఏని ప్రశ్నించాడు. రూ. 20 కోట్ల వ్యయంతో నిర్మించదలచిన సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు కేవలం రూ. 10 కోట్లే కేటాయిస్తామని ఇప్పుడు చెప్పడాన్ని సోమ్‌దేవ్ తప్పుపట్టాడు. రూ. 10 కోట్లు ఏ మాత్రం సరిపోవని చెప్పిన సోమ్‌దేవ్ ఆ ప్రాజెక్ట్ నుంచి తప్పుకొన్నాడు. ప్రాజెక్ట్ పూర్తయితే దానికి సోమ్‌దేవ్ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించాల్సివుంది.



సోమ్‌దేవ్



ఈ ఏడాది అద్భుతంగా సాగాలి

న్యూఢిల్లీ: నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ సోషల్ మీడియా ద్వారా అభిమానులకు శుభాకాంక్షలు తెలిపాడు. 'భారత్‌తోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి ఒక్కరికీ ఆస్ట్రేలియా నుంచి న్యూ ఇయర్ విషెస్ చెబుతున్నాం. ఈ ఏడాది మీకు మరింత అద్భుతంగా సాగాలని కోరుకుంటున్నాం' అని ట్వీట్ చేశాడు కోహ్లీ. అలాగే.. సిడ్నీ వీధుల్లో భార్య అనుష్క శర్మతో కలిసి దిగిన ఫొటోను విరాట్ పోస్ట్ చేశాడు. విరాట్‌తో పాటు మహిళల వన్డే కెప్టెన్ మిథాలీ రాజ్, మాజీలు వీరేంద్ర సెహ్వాగ్, వీవీఎస్ లక్ష్మణ్ సహా మరికొందరు క్రీడా ప్రముఖులు అభిమానులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

'క్రికెట్ ఆస్ట్రేలియా' వన్డే కెప్టెన్ విరాట్

మెల్‌బోర్న్: గతేడాది అన్ని ఫార్మాట్లలోనూ అద్భుతంగా రాణించిన టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీకి క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) అరుదైన గౌరవాన్ని అందించింది. 2018కి గాను తాము ప్రకటించిన వన్డే అత్యుత్తమ జట్టుకు కెప్టెన్‌గా విరాట్‌ను ఆసీస్ క్రికెట్ బోర్డు ఎంపిక చేసింది. ఈ జట్టులో భారత ఓపెనర్ రోహిత్ శర్మకు కూడా చోటు కల్పించింది. మరో ఓపెనర్‌గా ఇంగ్లండ్ బ్యాట్స్‌మన్ జానీ బెయిర్‌స్టోకు స్థానం దక్కింది. ఇక, బౌలింగ్ పరంగా భారత్ నుంచి కుల్దీప్ యాదవ్, జస్‌ప్రీత్ బుమ్రాను సీఏ తీసుకుంది. వీరితో పాటు జో రూట్, హెట్‌మయెర్, జోస్ బట్లర్, తిసార పెరీరా, రషీద్ ఖాన్, ముస్తాఫిజుర్ రెహ్మాన్ జట్టులో ఉన్నారు. కాగా, ఈ జట్టులో ఆస్ట్రేలియా నుంచి ఒక్క క్రికెటర్‌కు కూడా చోటు దక్కకపోవడం గమనార్హం.

మెల్‌బోర్న్ పిచ్ 'సాదాసీదా'!

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా, భారత్ మధ్య మూడో టెస్టు జరిగిన మెల్‌బోర్న్ పిచ్‌కు ఐసీసీ 'సాదాసీదా' రేటింగ్ ఇచ్చింది. దీంతో ఆ స్టేడియానికి ఎటువంటి డీమెరిట్ పాయింట్ లభించదు. ఈ టెస్టులో టీమిండియా 137 పరుగుల తేడాతో నెగ్గింది. గతేడాది ఇక్కడ యాషెస్ టెస్టు డ్రాగా ముగియడంతో పిచ్‌పై విమర్శలు వ్యక్తమయ్యాయి. ఐసీసీ కూడా పేలవ రేటింగ్‌తోపాటు మూడు డీమెరిట్ పాయింట్లు ఇచ్చింది. ఐదేళ్లలో ఐదు డీమెరిట్ పాయింట్లు చేరితే ఆ స్టేడియం టెస్టు హోదాను కోల్పోతుంది.

టీ20 వరల్డ్‌కప్ అర్హతలో శ్రీలంక, బంగ్లా విఫలం

దుబాయ్: మాజీ చాంపియన్ శ్రీలంక, బంగ్లాదేశ్.. 2020లో జరిగే టీ20 వరల్డ్‌కప్ సూపర్-12కు నేరుగా అర్హత సాధించడంలో విఫలమయ్యాయి. దీంతో ఈ రెండు జట్లు క్వాలిఫయింగ్ మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం ర్యాంకింగ్స్‌లో టాప్-8లో ఉన్న పాకిస్థాన్, భారత్, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, వెస్టిండీస్‌తోపాటు అఫ్ఘానిస్థాన్‌లకు వరల్డ్‌కప్‌లో నేరుగా ఎంట్రీ లభించిందని ఐసీసీ ప్రకటించింది.

'టెస్టుల్లో నేనైతే బుమ్రా బౌలింగ్‌ను ఎదుర్కొనేందుకు ఇష్టపడను'...

ప్రపంచం మెచ్చే అద్భుత క్రికెటర్ విరాట్ కోహ్లీ కామెంట్ ఇది.

'బుమ్రా బౌలింగ్ శైలిని గమనిస్తే నాకు జెఫ్ థామ్సన్ గుర్తుకొస్తున్నాడు' ..

ఆసీస్ దిగ్గజ పేసర్ డెన్నిస్ లిల్లీ పొగడ్త ఇది.

అరంగేట్రం చేసిన ఏడాదిలోనే భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఎదుగుదల ఎలా ఉందో పై కామెంట్స్ చూస్తేనే అర్థమవుతుంది. కేవలం తొమ్మిది టెస్టుల అనుభవంతోనే అతడు జట్టుకు వెన్నెముకలా మారిన తీరు అపూర్వం. భారత్ అంటే బ్యాటింగే కాదు.. ఆ జట్టు పేస్ బౌలింగ్‌ను కూడా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలనే హెచ్చరికను అతడు ప్రత్యర్థి జట్లకు పంపగలిగాడు. పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో మెరుపులు మెరిపించి ఏడాది క్రితం టెస్టుల్లో చోటు దక్కించుకున్న ఈ గుజరాతీ.. తాజాగా ప్రపంచ మేటి పేసర్‌గా పేరు తెచ్చుకోగలిగాడు. అలాగే సెలెక్టర్లు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా భారత్‌ను చూసి ఇతర జట్లు వణికేలా చేస్తున్నాడు.



బుమ్రా విషయంలో నా అంచనా తప్పింది!

న్యూఢిల్లీ: భారత పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా విషయంలో తన అంచనా తప్పిందని దిగ్గజ ఆటగాడు కపిల్‌దేవ్ అన్నాడు. అతడు ఎంతో వైవిధ్యమైన బౌలర్ అని కొనియాడాడు. 'తొలిసారి బుమ్రా బౌలింగ్ యాక్షన్ చూసినప్పుడు ఎక్కువ కాలం క్రికెట్‌లో మనలేడనిపించింది. కానీ నా అంచనా తప్పింది. ఆస్ట్రేలియాలో అతడి ప్రదర్శనను ప్రశంసించకుండా ఉండలేన'ని కపిల్ తెలిపాడు. 'కొత్త, పాతబడిన బంతితో జస్‌ప్రీత్ అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నాడు. చక్కని బౌన్సర్‌తో ప్రత్యర్థిని ఆశ్చర్యపరచగలడు. కచ్చితత్వంతో పాటు తెలివిగా బంతులు వేయడం బుమ్రాకు ప్లస్. అందుకే నేడు అగ్రశ్రేణి బౌలర్లలో ఒకడిగా ఎదిగాడ'ని కపిల్ విశ్లేషించాడు.



అతని బౌలింగ్.. బ్యాట్స్‌మెన్‌కు పీడకలే!

సిడ్నీ: టీమిండియా పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాపై ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ బ్రాడ్ హాడ్జ్ ప్రశంసలు కురిపించాడు. అతడిని ఎదుర్కోవడం బ్యాట్స్‌మెన్‌కు పీడకలలాంటిదన్నాడు. బౌలింగ్‌లో సమంగా కనిపిస్తున్నా.. వన్‌డౌన్‌లో చటేశ్వర్ పుజారా భారీ స్కోర్లు చేయడం ఇరుజట్ల మధ్య ప్రధాన వ్యత్యాసమని విశ్లేషించాడు. టెస్టు మ్యాచ్ బౌలర్ల నుంచి ఏది కోరుకుంటామో.. అవన్నీ బుమ్రాలో పుష్కలంగా ఉన్నాయని చెప్పాడు. 'అతడి బంతులను ఎదుర్కోవడమంటేనే పీడకల లాంటిది. ఏ బ్యాట్స్‌మన్‌ను అడిగినా.. వామ్మో అనే అంటారు. వేగం, కచ్చితత్వంతోపాటు వికెట్‌కు ఇరువైపులా బంతిని తిప్పగలడ'ని అన్నాడు. కేవలం 12 నెలల్లోనే దిగ్గజం కపిల్‌దేవ్‌తో పోల్చగలిగేలా బుమ్రా ఎదగడం అద్భుతమని బ్రాడ్ చెప్పాడు. ఎన్నడూలేనంతగా భారత బౌలింగ్ విభాగం ఎంతో బలంగా కనిపిస్తోందని వివరించాడు. టీమిండియా సిరీస్ నెగ్గే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని హాడ్జ్ చెప్పాడు.



హాడ్జ్

భారత పేస్ దళపతి

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

గతంలో భారత క్రికెట్ అంటే బ్యాట్స్‌మెన్ హవా.. స్పిన్నర్ల మాయాజాలం గురించే చర్చించుకునేవారు. కానీ ఫాస్ట్ బౌలర్ల నుంచి మాత్రం ఆశించిన సహకారం అందేది కాదు. అప్పుడప్పుడూ కపిల్ దేవ్, జవగల్ శ్రీనాథ్, జహీర్ ఖాన్ రూపంలో అలా మెరుపులు కనిపించేవి. కానీ ఈ పరిస్థితిని 2018 సమూలంగా మార్చింది. జస్‌ప్రీత్ బుమ్రా, ఇషాంత్ శర్మ, మహ్మద్ షమి, భువనేశ్వర్, ఉమేశ్ యాదవ్ రూపంలో ఇప్పుడు భారత పేస్ దళం బలంగానే ఉంది. మరీ ముఖ్యంగా 25 ఏళ్ల బుమ్రా తన వైవిధ్యమైన బంతులతో భారత్‌కు అద్భుత విజయాలను అందిస్తున్నాడు. చాలా వేగంగా జట్టుకు ప్రధాన పేసర్‌గా మారిపోయాడు. కొత్త, పాత బంతితో మెరుపులు మెరిపిస్తూ అవతలి బ్యాట్స్‌మెన్‌కు బౌన్సర్లతో షాక్ ఇవ్వగలుగుతున్నాడు.

ఎంపికే అనూహ్యం..: గతేడాది జనవరిలో దక్షిణాఫ్రికా పర్యటనకు బుమ్రాను ఎంపిక చేయడం చాలా మందిని ఆశ్చర్యపరిచింది. ఈ ఎంపికకు ముందు ఏడాది వరకు అతడు ఫస్ట్‌క్లాస్ క్రికెట్ ఆడింది లేదు. అందుకే సంప్రదాయక టెస్ట్ ఫార్మాట్‌లో అతడిని తీసుకుని సాహసం చేస్తున్నారని మాజీలు వ్యాఖ్యానించారు. కానీ మూడు టెస్టుల ఆ సిరీస్‌లో అతను 25.21 సగటుతో 14 వికెట్లు తీసి విమర్శకుల నోళ్లు మూయించాడు. ఇందులో భారత్ గెలిచిన చివరి టెస్టులో కెరీర్‌లో తొలిసారిగా ఐదు వికెట్లతో చెలరేగాడు. ఆ తర్వాత ఇంగ్లండ్‌తో ఆడిన ఐదు టెస్టుల్లోనూ 25.91 సగటుతో మరో 14 వికెట్లు పడగొట్టాడు. గత 12 నెలల కాలంలో అతడు 9 టెస్టులు ఆడగా 21.02 సగటుతో 48 వికెట్లు తీసి భారత్ తరఫున రికార్డు నెలకొల్పాడు.

మరింత ఎత్తుకు ఎదిగాడు..: ఆస్ట్రేలియాతో జరుగుతున్న నాలుగు టెస్టుల సిరీస్ బుమ్రా కెరీర్‌లో ఎప్పటికీ గుర్తుండిపోయేదే. తన నైపుణ్యానికి పదును పెడుతూ ఇప్పటిదాకా ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనే 20 వికెట్లు తీసి విశ్లేషకులను సైతం అబ్బురపరిచాడు. ఈ ఫార్మాట్‌లో అనుభవం గడించిన కొద్దీ రాటుదేలుతున్నాడు. ప్రస్తుత సిరీస్‌ను గమనిస్తే ఈ విషయం బోధపడుతుంది. అడిలైడ్, మెల్‌బోర్న్ పిచ్‌లు ఫాస్ట్ బౌలర్లకు అంతగా సహకరించలేదు. అయినా బుమ్రా కచ్చితత్వంతో కూడిన బౌలింగ్‌తో వికెట్లను రాబట్టాడు. ఆసీస్ బ్యాటింగ్ లైనప్‌ను అతడు వణికిస్తున్న తీరు నిజంగా అభిమానులకు కనువిందు చేస్తోంది. ముఖ్యంగా మెల్‌బోర్న్ పిచ్‌పై కెరీర్‌లోనే ఉత్తమ గణాంకాల (6/33)తో భారత్‌కు 292 పరుగుల భారీ ఆధిక్యం లభించేలా చేశాడు. అలాగే ఆ మ్యాచ్ మూడో రోజు తొలి సెషన్ ఆఖరి బంతి క్రికెట్ అభిమానులకు చాలాకాలం గుర్తుండిపోతుంది. స్లో యార్కర్‌తో షాన్ మార్ష్‌ను అవాక్కయ్యేలా చేసిన తీరు అతడిలోని ప్రతిభను చాటింది.

సెహ్వాగ్ తరహాలో..: టెస్టు క్రికెట్ అంటే నత్తనడకన సాగే ఆట అనే అభిప్రాయానికి వీరేంద్ర సెహ్వాగ్ రాకతో చెక్ పడింది. టెక్నిక్ అనవసరం.. బాదడమే లక్ష్యంగా అతడు ఈ ఫార్మాట్‌ను కొత్త పుంతలు తొక్కించాడు. బౌన్సీ ట్రాక్‌లపై అతడు సాహసంగా అప్పర్ కట్‌తో బంతులను బౌండరీలకు పంపేవాడు. అందుకే ఎవరికీ సాధ్యంకానీ రీతిలో భారత్ నుంచి రెండు ట్రిపుల్ సెంచరీలు సాధించగలిగాడు. ఇప్పుడు బౌలింగ్‌లో బుమ్రా అదే శైలిని కనబరుస్తున్నాడు. దూకుడుగా బౌలింగ్ చేస్తూ ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచి వికెట్లు రాబడుతున్నాడు. అంతేకాకుండా పరిస్థితులకు తగ్గట్టుగా తన బౌలింగ్ రనప్‌ను మార్చుకుంటాడు. ఇది అతడి సహజ శైలిలో బౌలింగ్ చేసేందుకు తోడ్పడుతుంది. అందుకే స్లో బంతులు, యార్కర్లు, రివర్స్ స్వింగ్‌లతో బ్యాట్స్‌మెన్‌ను బెంబేలెత్తిస్తున్నాడు. మూడో టెస్టులో ఇలాగే హ్యారిస్‌ను బౌన్సర్‌తో, షాన్ మార్ష్‌ను స్లో యార్కర్‌తో, హెడ్‌ను స్వింగ్‌తో, లియాన్‌ను 146.1 కి.మీ వేగంతో అవుట్ చేశాడు. అతి తక్కువ రనప్‌తోనే 140కి.మీ వేగానికి మించి బంతులు విసరడం బుమ్రాపై గౌరవం పెంచుతోందని దిగ్గజ ఆల్‌రౌండర్ కపిల్‌దేవ్ సైతం కొనియాడాడు.

కోహ్లీకి కొండంత భరోసాగా..: గత ఏడాది విదేశాల్లో భారత జట్టు నాలుగు టెస్టుల్లో నెగ్గింది. ఇందులో ప్రతీ మ్యాచ్‌లోనూ బుమ్రానే ఎక్కువ వికెట్లు పడగొట్టడం విశేషం. జొహన్నెస్‌బర్గ్, ట్రెంట్‌బ్రిడ్జ్‌లో ఏడు వికెట్లు తీయగా అడిలైడ్‌లో ఆరు, మెల్‌బోర్న్‌లో తొమ్మిది వికెట్లతో కీలక పాత్ర పోషించాడు. అంతేకాకుండా అడిలైడ్‌లో మినహా మిగతా మూడు విజయాల్లో ఒక్కో ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్ల ఘనత సాధించాడు. అందుకే ప్రత్యర్థిని దెబ్బతీయాలంటే ఇప్పుడు కెప్టెన్ కోహ్లీ చూపు బుమ్రాపైనే ఉంటోంది. దీనికి తగ్గట్టుగానే అతడు తన సహచరులకన్నా ఎక్కువగా ఐదుసార్లు అర్ధ సెంచరీ భాగస్వామ్యాన్ని, 3 సార్లు సెంచరీ భాగస్వామ్యాన్ని విడదీశాడు. అలాగే ఇప్పుడు మూడు ఫార్మాట్లలోనూ బుమ్రా జట్టు ప్రధాన బౌలర్‌గా ఎదిగాడు. వన్డేలను గమనిస్తే 44 మ్యాచ్‌ల్లో 21.01 సగటుతో 78 వికెట్లు తీశాడు. ఇక పొట్టి ఫార్మాట్‌లోనూ 40 మ్యాచ్‌ల్లో 6.77 ఎకానమీ రేట్‌తో 48 వికెట్లు తీసి శభాష్ అనిపించుకున్నాడు. అందుకే బ్యాటింగ్‌లో విరాట్ కోహ్లీ ఎలాగో బౌలింగ్‌లో భారత్‌కు బుమ్రా కూడా అంతే ముఖ్యంగా మారాడు. ఈనేపథ్యంలో రానున్న ప్రపంచకప్ కోసం అతడిని తమ తురుపుముక్కగా వాడుకోవాలని జట్టు చూస్తోంది. ఇందుకోసం అతడిని తాజాగా ఉంచేందుకు ఐపీఎల్‌కు దూరంగా ఉంచాలనే ఆలోచనలో కూడా టీమ్ మేనేజ్‌మెంట్ ఉంది.

పెయిన్ సరదా తీర్చేశాడు

సిడ్నీ: 'నా భార్యతో సినిమాకు వెళతా.. నీవు మా పిల్లల్ని ఆడిస్తావా..' అంటూ మూడో టెస్టులో ఆస్ట్రేలియా కెప్టెన్ టిమ్ పెయిన్, భారత వికెట్ కీపర్ రిషభ్ పంత్‌ను రెచ్చగొట్టిన విధానం గుర్తుందిగా! ఇప్పుడు నిజంగానే పంత్ అతడి చిన్నారిని ఎత్తుకొని అందరినీ ఆకట్టుకున్నాడు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఆస్ట్రేలియా ప్రధాని స్కాట్ మారిసన్ ఇచ్చిన విందులో రెండు జట్ల ఆటగాళ్లు పాల్గొన్నారు. ఇందులో పెయిన్ భార్యా పిల్లలతో సహా హాజరయ్యాడు. దీంతో అక్కడే ఉన్న పంత్.. పెయిన్ కొడుకును ఎత్తుకుని సరదాగా ఆడించాడు. ఈ ఫొటోను పెయిన్ భార్య బొన్నీ.. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసి 'ఉత్తమ బేబీ సిట్టర్'గా క్యాప్షన్ పెట్టింది. అటు ఐసీసీ కూడా ఇదే ఫొటోను 'పెయిన్ సవాల్‌ను స్వీకరించిన పంత్' అనే కామెంట్‌తో ట్విటర్‌లో పోస్ట్ చేసింది.



పీబీఎల్‌లో నేడు

ఢిల్లీ x బెంగళూరు (రా. 7 గం.)

స్టార్ స్పోర్ట్స్-1లో

సైనాపై సింధు పైచేయి

● టేబుల్ టాపర్‌గా హంటర్స్



టాస్ సందర్భంగా సైనా, సింధు

పుణె: కొత్త ఏడాదిని స్టార్ షట్లర్ పీవీ సింధు గ్రాండ్‌గా ఆరంభించింది. ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్)లో ఏస్ షట్లర్ సైనా నెహ్వాల్‌పై తన ఆధిపత్యాన్ని మరోసారి చాటింది. గత రెండు మ్యాచ్‌ల్లో ఓటమిని చవిచూసిన సింధు మళ్లీ గెలుపు బాట పట్టడంతో.. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ హంటర్స్ 5-0తో నార్త్ ఈస్ట్రన్ వారియర్స్‌ను చిత్తుచేసి టేబుల్ టాపర్‌గా నిలిచింది. ఈరోజు పోరులో ఇరుజట్ల కెప్టెన్లు సింధు, సైనా మధ్య మ్యాచ్ హైలైట్. హంటర్స్ ప్లేయర్ సింధు 11-15, 15-9, 15-5తో సైనాపై నెగ్గి హైదరాబాద్‌ను 3-1 ఆధిక్యంలో నిలిపింది. గాయం కారణంగా గత మూడు మ్యాచ్‌లకు దూరంగా ఉన్న సైనా.. పూర్తి ఫిట్‌నెస్‌తో కనిపించలేదు. ముఖ్యంగా సుదీర్ఘ ర్యాలీలు ఆడలేకపోయింది. కానీ, తొలి గేమ్‌లో 7-10తో వెనుకబడినా.. పుంజుకున్న నెహ్వాల్ 15-11 గేమ్‌ను కైవసం చేసుకుంది. అయితే, రెండోగేమ్‌లో విరుచుకుపడిన సింధు 8-3తో పైచేయి సాధించింది. అదే జోరులో 15-9తో గేమ్‌న నెగ్గి 1-1తో సమం చేసింది. నిర్ణాయక మూడో గేమ్‌లో సింధు ముందు సైనా నిలవలేక పోయింది. 15-5తో నెగ్గిన సింధు మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. పీబీఎల్‌లో సైనాపై సింధుకు ఇది మూడో విజయం. అంతకుముందు మిక్స్‌డ్ డబుల్స్‌గా జరిగిన తొలి మ్యాచ్‌లో హంటర్స్ ఓడినా.. మిగిలిన మ్యాచ్‌లు నెగ్గి సత్తా చాటింది. మిక్స్‌డ్‌లో హైదరాబాద్ జోడీ కిమ్-ఎమ్‌ఒన్ 8-15, 14-15తో లియో -కిహ్ చేతిలో ఓడింది. అయితే, ట్రంప్‌గా ఎంచుకున్న పురుషుల సింగిల్స్‌లో లి హయున్ 10-15, 15-13, 15-9తో సయేన్‌సమ్‌బూన్‌సక్‌పై నెగ్గడంతో హంటర్స్ 2-1తో ఆధిక్యం సాధించింది. పురుషుల సింగిల్స్ రెండోమ్యాచ్‌లో మార్క్ కల్‌ర్యూ 15-11, 15-14తో టియాన్‌పై నెగ్గి 4-0తో హంటర్స్ గెలుపును ఖరారు చేశాడు. వారియర్స్ ట్రంప్‌గా ఎంచుకున్న ఈ మ్యాచ్‌లో ఓడడంతో గెలుచుకున్న ఒక్క పాయింట్‌ను కూడా చేజార్చుకుంది. చివరగా పురుషుల డబుల్స్‌లో కిమ్ -బోడిన్ ఇసారా జోడీ 15-10, 12-15, 15-14తో సియాంగ్-లియోపై గెలిచింది.



శ్రీకర్ భరత్ (178 నాటౌట్)

భరత్, భుయ్ సెంచరీలు

● ఆంధ్ర తొలి ఇన్నింగ్స్ 502/7 డిక్లేర్డ్

● హైదరాబాద్‌తో రంజీ పోరు



రికీ భుయ్ (129)

విజయనగరం (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌తో గ్రూప్- బి రంజీలో ఆతిథ్య ఆంధ్ర జట్టు భారీ స్కోరు నమోదు చేసింది. శ్రీకర్ భరత్ (277 బంతుల్లో 22 ఫోర్లు, 2 సిక్సర్లతో 178 నాటౌట్), రికీ భుయ్ (248 బంతుల్లో 14 ఫోర్లు, 2 సిక్సర్లతో 129) సెంచరీలతో రాణించగా.. ఓవర్‌నైట్ స్కోరు 207/3తో మూడో రోజైన మంగళవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర 502/7 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. భరత్-రికీ భుయ్ నాలుగో వికెట్‌కు ఏకంగా 234 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. మెహ్దీ హసన్ 3, రవితేజ 2 వికెట్లు సాధించారు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో ఆట చివరకు హైదరాబాద్ వికెట్ నష్టపోకుండా 33 రన్స్ చేసింది. ప్రస్తుతం అక్షత్‌రెడ్డి సేన 198 పరుగుల వెనుకంజలో ఉంది. ఓపెనర్లు ఠాకూర్ తిలక్‌వర్మ (20), తన్మయ్ అగర్వాల్ (13) క్రీజులో ఉన్నారు. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 271 స్కోరు చేసింది. అయితే ఆటకు బుధవారమే చివరి రోజు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107
Editor : K. Srinivas, RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.**